టెస్ట్ క్రికెట్‌కు కోహ్లి గుడ్‌బై

- రిటైర్మెంట్ ప్రకటించిన రన్ మెషిన్
- ఇక వన్డేలకే పరిమితం

8

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 279 | విజయవాడ, మంగళవారం 13 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 13 May 2025 | Rs

టెన్త్ సప్లిమెంటరీ హాల్ టికెట్లు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసింది. ఈ నెల 19 నుంచి జరగనున్న పరీక్షల హాల్ టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరగనున్నాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు వ్యక్తిగతంగా వాట్సాప్-మనమిత్ర ద్వారా వాట్సాప్ నెంబర్ 9552300009 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని వివరించారు.

ఉగ్రవాద శిబిరాలు తుడిచిపెట్టాల్సిందే

పాకిస్తాన్‌కు ప్రధాని తీవ్ర హెచ్చరిక

'ఆపరేషన్ సిందూర్' తరువాత తొలిసారి జాతినుద్దేశించి ప్రసంగం

కవ్వింపు చర్యల నిరోధానికి డిజిఎంఓల మధ్య చర్చలు

ఢిల్లీ: 'బతికి బట్టకట్టాలనుకుంటే ఉగ్రవాద శిబిరాలను తుడిచిపెట్టాలి' అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాకిస్తాన్ నుద్దేశించి తీవ్ర హెచ్చరిక చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన తరువాత తొలిసారి ఆయన దేశ ప్రజల నుద్దేశించి సోమవారం రాత్రి మాట్లాడారు. ప్రధాని ప్రసంగానికి ముందు భారత్ - పాకిస్తాన్ దేశాల డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంవోలు) మధ్య హాట్‌లైన్‌లో ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో పరస్పరం కవ్వింపు చర్యలను నిరోధించుకోవడం, కాల్పుల విరమణ పాటించడం తదితర అంశాలపై చర్చించారు.

ఈ చర్చల ప్రక్రియ ముగిసిన తరువాత దేశ ప్రజల నుద్దేశించి మాట్లాడిన మోడీ వివిధ అంశాలను ప్రస్తావించారు. పాకిస్తాన్ తనంతట తానుగా ఉగ్రవాద శిబిరాలను తుడిచిపెట్టాలని ఆయన అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు తీసుకోవడానికైనా, దాడులు చేయడానికి వెనకాడేది లేదని చెప్పారు. ఉగ్రవాద నిర్మూలన సమయంలో పాకిస్తాన్ న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్ పాల్పడితే సహించేది లేదని అన్నారు. టెర్రరిజం, చర్చలు రెండూ ఏకకాలంలో ఉండవని, ఉగ్రవాదం.. వాణిజ్యం, ఉగ్రవాదం... నీటి పంపిణీ కూడా ఏకకాలంలో ఉండవని ప్రధాని అన్నారు.

చర్చలకు పాక్ పరిగెత్తుకొచ్చింది..

ఇప్పటికే ఉగ్రవాదులు కలలో కూడా

ఊహించనంత దారుణంగా భారత సైన్యం వారిని దెబ్బతీసిందని చెప్పారు. 'మన దెబ్బకు పాక్ నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయింది. దాడులతోఎటూ పాలుపోని పాక్.. సరిహద్దులోని జనావాసాలు, పాఠశాలలపై దాడికి దిగింది. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, మిసైళ్లను మన క్షిపణి రక్షణ వ్యవస్థ సరిహద్దులు దాటకుండానే కూల్చేసింది. పాక్ రక్షణ వ్యవస్థలను భారత క్షిపణులు ఛిన్నాభిన్నం చేశాయి. పాక్ వైమానిక స్థావరాలు, రాడార్ స్టేషన్లలో మన మిసైళ్లు విధ్వంసం సృష్టించాయి."అని ఆయన వివరించారు. ఈ చర్యలకు బెంబేలెత్తిన పాకిస్తాన్ కాల్పుల విరమణ కోసం ప్రపంచం మొత్తాన్ని వేడుకుంది" అని ప్రధాని అన్నారు. 'భారత రక్షణ దళాలు చూపిన ధైర్య సాహసాలు దేశానికి తలమానికం. సైన్యానికి నా సెల్యూట్' అని ఆయన చెప్పారు.

ప్రసంగం ముగిసిన కాసేపటికే...

మళ్లీ పాక్ ఉల్లంఘన

శ్రీనగర్ : ప్రధాని ప్రసంగం ముగిసిన కాసేపటికే పాకిస్తాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. రాత్రి పది గంటల ప్రాంతంలో జమ్మూకాశ్మీర్‌లోని సరిహద్దు జిల్లా సాంబ , కథువాప్రాంతాల్లో పాక్ డ్రోన్లతో దాడికి ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. దీంతో జమ్మూకాశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో అధికారులు బ్లాక్ అవుట్ విధించారు. సాంబ, సమీప ప్రాంతాల్లో అనుమానిత డ్రోన్లను కూల్చివేసినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు.

ఆలస్యంగా ప్రారంభమైన చర్చలు

భారత్ - పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ అనంతరం సోమవారం జరిగిన చర్చలు ఆలస్యంగా ప్రారంభమైనాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు చర్చల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా సాయంత్రం ప్రారంభమైనాయి. హాట్‌లైన్ ద్వారా జరిగిన ఈ చర్చల్లో భారత డిజిఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘయ్, పాకిస్తాన్ డిజిఎంఓ మేజర్ జనరల్ కాశిఫ్ చౌదరి పాల్గొన్నారు. కవ్వింపు చర్యల నిరోధం, కాల్పుల విరమణ మిగతా 2లో

చైనా, అమెరికా డీల్

- సుంకాలకు 90 రోజుల విరామం
- 115 శాతం తగ్గింపు

జెనీవా : వాణిజ్య యుద్ధాన్ని నివారించడానికి ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా పరస్పర సుంకాలను ప్రస్తుతానికి తగ్గించేందుకు అంగీకరించాయి. ఈ మేరకు జెనీవాలో జరిగిన వాణిజ్య చర్చలు ఫలప్రదమయ్యాయి. సుంకాల అమలును 90 రోజుల పాటు నిలిపివేస్తున్నామని రెండు దేశాలు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశాయి. చైనా అధికారులతో చర్చల అనంతరం అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్ విలేకర్లతో మాట్లాడుతూ, ప్రస్తుత టారిఫ్ రేట్లను గణనీయంగా తగ్గించాలని కూడా నిర్ణయించామని చెప్పారు. రెండు దేశాలు తమ సుంకాలను 115 శాతం మేర తగ్గిస్తాయని చెప్పారు. ఈ 90 రోజుల విరామ సమయంలో చైనా దిగుమతులపై సుంకాలను 145 శాతం నుండి 30 శాతానికి తగ్గించాలని అమెరికా నిర్ణయించింది. చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై తాము విధించిన టారిఫ్‌లను 125 శాతం నుండి 10 శాతానికి తగ్గించేందుకు అంగీకరించింది. ఈ నిర్ణయాలు ఈ నెల 14వ తేదీ నుండి అమలులోకి వస్తాయి. '90 రోజుల విరామంపై మేము ఒక ఒప్పందానికి వచ్చాము. సుంకాల స్థాయిని గణనీయంగా తగ్గించాలని కూడా నిర్ణయించాము' అని బెస్సెంట్ పేర్కొన్నారు. చైనాతో చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని, రెండు దేశాలు తమ జాతీయ ప్రయోజనాలను ప్రదర్శించాయని చెప్పారు. సంతులన వాణిజ్యంలో ఇరు పక్షాలకు ఆసక్తి వుందన్నారు. ఆ దిశగా అమెరికా ముందుకు సాగుతుందన్నారు. భవిష్యత్తులో ఉద్రిక్తతలు తలెత్తకుండా నివారించేందుకు అమెరికా, చైనాలు సమర్థవంతమైన ప్రొటోకాల్స్‌ను ఏర్పాటు చేసుకున్నాయన్నారు. గత నెల 2వ తేదీ నుండి అమలు చేసిన టారిఫ్ యేతర ప్రతీకార చర్యలను కూడా నిలిపివేయాలని తాము భావిస్తున్నామని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

పంటల బీమా అస్తవ్యస్తం

- నాలుగేళ్లుగా నయాపైసా దక్కని పరిహారం
- 2022 రబీ నుంచి క్లెయిములు బంద్
- 2 వేల కోట్ల ప్రీమియం బకాయి పెట్టిన వైసిపి సర్కారు
- వాటిని చెల్లించని టిడిపి ప్రభుత్వం
- ఈ రబీ నుంచి ఉచితానికి మంగళం
- తన వాటా నిధులివ్వని కేంద్రం
- కనీస ఆసరా కోల్పోయి రైతు అన్యాయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రకృతి విపత్తులతో పంటలు నష్టపోయిన రైతులకు కొంతలో కొంతైనా ఆసరా కావాల్సిన పంటల బీమా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపి, టిడిపి ప్రభుత్వాల నిర్వాకం వలన అస్తవ్యస్తమైంది. మోడీ సర్కారు ఒత్తిడితో ఫసల్ బీమాలో వైసిపి ప్రభుత్వం చేరాక 2022 రబీ లాగాయత్ ప్రస్తుత రబీ వరకు వరుసగా ఐదు సీజన్లకుగాను విపత్తు బాధిత అన్నదాతలకు నయాపైసా పరిహారం అందలేదు. వైసిపి సర్కారు ఇన్సూరెన్స్ కంపెనీలకు తన వంతు ప్రీమియం చెల్లించకుండా చివరి వరకు జాప్యం చేసింది. వైసిపిపై విరుచుకుపడటమే కాకుండా పాత ప్రభుత్వ బకాయిలను తాము చెల్లిస్తామని చెప్పిన టిడిపి కూటమి సర్కారు చెల్లించకుండా ఎగనామం పెట్టింది. తామొచ్చాక సమగ్ర పంటల బీమా తెస్తామని హామీ ఇచ్చి అప్పటి వరకు ఉన్న ఉచిత పంటల బీమాను ప్రస్తుత రబీ నుంచి ఎత్తేసి రైతులపై ప్రీమియం భారం మోపింది. అటు కేంద్రం తన వంతు ప్రీమియం జమ చేయకుండా పేరపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఈ ధోరణి విపత్తులతో పంటలు కోల్పోయి ఆర్థికంగా చితికిపోయిన రైతులకు బీమా లేకుండా అన్యాయం చేశాయి.

ఫసల్‌లో చేరిన నాటి నుంచీ..

వైసిపి వచ్చాక 2019 రబీ మొదలు కేంద్ర

పథకాల నుంచి వైదొలికి తానే సొంతంగా, ఇన్సూరెన్స్ కంపెనీలతో సంబంధం లేకుండా పంటల బీమా నిర్వహించింది. తదుపరి మోడీ ప్రభుత్వ ఒత్తిడితో 2022 ఖరీఫ్ నుంచి కేంద్ర పథకాల్లో చేరినప్పటికీ రైతుల తరపున ప్రీమియంను తానే భరించి ఇ-క్రాప్ డేటా ఆధారంగా ఉచిత పంటల బీమా అమలు చేసింది. ఆ ఏడాది ఖరీఫ్, రబీలో ఫసల్ బీమా (దిగుబడి ఆధారితం) నిర్వహణ కేంద్రం నిర్దేశం కిందికి వెళ్లడంతో కంపెనీలు రంగ ప్రవేశం చేశాయి. వాతావరణ బీమాను మాత్రం కంపెనీలతో సంబంధం లేకుండా రాష్ట్రమే నిర్వహిం చింది. 2023 ఖరీఫ్ నుంచి ఫసల్, వాతావరణ రెండు పథకాలూ కేంద్రం నిర్దేశంలోకి వెళ్లాయి. ఇన్సూరెన్స్ కంపెనీలు నిర్వహిస్తున్నాయి. 2022-23 రబీ నుంచి 2023 ఖరీఫ్, 2023-24 రబీ ఈ మూడు సీజన్లకూ వైసిపి సర్కారు తాను చెల్లించాల్సిన ప్రీమియం మిగతా 7లో

పార్లమెంట్ ప్రత్యేక సమావేశం

వెంటనే నిర్వహించాలని ప్రధానికి సిపిఎం నేత బేబీ లేఖ

న్యూఢిల్లీ : కాల్పుల విరమణకు, దేశ భద్రతకు సంబంధించిన అంశాలు, ఆందోళనలను పరిష్కరించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. ఈ మేరకు ఆయన ఒక లేఖ రాశారు. ఆ లేఖ పూర్తి పాఠం ఇలా వుంది. భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి, కాల్పుల విరమణ ప్రకటించడానికి సంబంధించి చోటు చేసుకున్న తాజా పరిణామాల నేపథ్యంలో ఈ లేఖ రాస్తున్నాను. ఈ ప్రకటన మన దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అలాగే అంతర్జాతీయ శాంతి కాముకులకు ఉపశమనం కలిగించింది. అయితే, ఇంకా అనేక ఆందోళనలు-ముఖ్యంగా, పహల్గాంలో ఉగ్ర దాడికి సంబంధించినవి అపరిష్కృతంగానే వున్నాయి. ఏప్రిల్ 22న అమాయకులైన పర్యాటకులపై జరిగిన హేయమైన దాడి మన దేశ ప్రజల మనస్సులను కదిలించివేసింది. అయినా, దేశవ్యాప్తంగా ప్రజలందరూ ప్రదర్శించిన సమైక్యతా భావం అత్యంత శక్తివంతమైన, అమూల్యమైన శక్తిగా నిలిచింది. ఈ సంఘీభావాన్ని ఉపయోగించుకుని దేశీయ, విదేశీ ఉగ్రవాదులను, వారి మద్దతు దారులను ఏకాకులను చేయాలి. అయితే, ఈ జాతీయ ఐక్యతా భావనను విద్వేషం, దూకుడుతో కూడిన జాతీయవాదం (జింగోయిజం) వంటి ప్రచారాలు దెబ్బతీయడం విచారకరం. అలాగే కొన్ని మీడియా సంస్థలు, శక్తులు సామాజిక మాధ్యమాల వేదికలపై పాల్పడే తప్పుడు సమాచార వ్యాప్తి కూడా ఆందోళనకరం. ఇటువంటి చర్యలు ప్రజల్లో తీవ్రమైన గందరగోళాన్ని, అశాంతిని కలిగిస్తాయి. దీనికితోడు, భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణకు సంబంధించి ఆయా దేశాల ప్రతినిధుల నుండి ఎలాంటి అధికారిక ప్రకటన కూడా రాకముందే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం తీవ్రమైన ఆందోళనలు రేకెత్తిస్తోంది. తృతీయ పక్షం జోక్యాన్ని అనుమతించకుండా మన వివాదాలను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలన్నది మన దేశం ఆమోదించిన స్పష్టమైన విధానంగా వుంది. అందువల్ల, ఈ పరిస్థితికి మన ప్రభుత్వంలో ఉన్నతస్థాయి వర్గాల నుండి స్పష్టమైన, అధికారయుతమైన వివరణ రావాల్సిన అవసరం వుంది. ఈ పరిణామాల నేపథ్యంలో సిపిఎం ఫ్లోర్ లీడర్లు ఇప్పటికే అభ్యర్థించినట్లుగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ప్రభుత్వ వైఖరిని వివరించడంలో ప్రధానిగా మీరు కూడా ఈ సమావేశాలకు హాజరు కావాలని కోరుతున్నాం.' అని బేబీ పేర్కొన్నారు.

నేడు, రేపు మాక్ డ్రిల్

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అత్యవసర పరిస్థితుల్లో సంసిద్ధతపై మంగళవారం, బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా మాక్ ఎక్స్‌ర్‌సైజ్ నిర్వహించనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఆందోదన చెందొద్దని, అప్రమత్తంగా ఉండటమే ముఖ్యమని అన్నారు. మంగళవారం నాడు విజయనగరం, ఏలూరు, ప్రకాశం, వైఎస్ఆర్ జిల్లాల్లో, బుధవారం నాడు పార్వతీపురం మన్యం, అనకాపల్లి, పశ్చిమ గోదావరి, గుంటూరు, పల్నాడు, నెల్లూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విపత్తుల నిర్వహణతో సంబంధం ఉన్న అన్ని విభాగాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన కార్యకలాపాలతో సన్నద్ధమైనట్లు పేర్కొన్నారు. సోమవారం నాడు శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్‌టిఆర్, బాపట్ల, కర్నూలు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల్లో మాక్ ఎక్స్‌ర్‌సైజ్ నిర్వహించినట్లు వెల్లడించారు.

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సిపై 15లోగా స్పష్టతివ్వాలి

- లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం
- ప్రభుత్వానికి సాధన కమిటీ అల్టిమేటం

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

2025 మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు నూరు శాతం టీచర్ పోస్టులు కేటాయిస్తూ ఈ నెల 15లోగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని లేదా మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో తమ

అభివాదం చేస్తున్న ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ నాయకులు

ఆందోళనను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చింది. నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామంటూ కాలయాపన చేయడం ఆదివాసీలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. అడ్వకేట్ జనరల్ లీగల్ ఒపినీయన్ ఇచ్చినప్పటికీ రిజర్వేషన్‌పై ఉత్తర్వుల్లో జాప్యం తగదని పేర్కొంది. ప్రభుత్వం తక్షణం స్పందించకపోతే సీలేరు జెన్‌కో పవర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని, అరకులో రైల్‌రోకో నిర్వహిస్తామని ప్రకటించింది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని గిరిజన భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాధన కమిటీ నాయకులు పి.అప్పలనర్స, కూడ రాధాకృష్ణ, వంతల నాగేష్ మాట్లాడుతూ నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ తెచ్చింది మేమే.. ఇచ్చేది మేమే అంటూ ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. 2020లో జిఒ నెంబర్ 3ని రద్దు చేస్తే మిగతా 7లో

జిఓ నెం.3 పునరుద్ధరణపై అధ్యయనం

- అధికారులకు సిఎం ఆదేశం

2

ఇంకా అందని పరిహారం!

- ఖాతాల్లో జమకాని పంట నష్టం డబ్బు
- సిఎం హామీ అమలుకు రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఈదురుగాలులు, అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన మాట ఇంకా కొన్ని జిల్లాల్లో ఆచరణకు నోచుకోలేదు. మంగళవారం సాయంత్రం (6వ తేదీ)లోపు సాయం రైతుల ఖాతాలో జమ చేస్తామని ఆయన ప్రకటించారు. వారం గడిచినా రైతుల ఖాతాల్లో పరిహారం జమైన దాఖలాలు లేవు. నష్టంపై కొన్ని జిల్లాల నుంచి ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. మరికొన్ని జిల్లాల్లో ఇంకా పూర్తి స్థాయి ఎన్యూమరేషన్ జరగలేదు. ప్రభుత్వ సాయం కోసం బాధిత రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. 33 శాతం పైబడి నష్టం వాటిల్లితేనే పరిహారం వస్తుందని, లేకపోతే రాదని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు తేల్చి చెప్తున్నారు. గత ఏడాది సెప్టెంబరులో వరదల వల్ల మునిగిన భూములకు పరిహారం ఇచ్చామని, ఒకే ఏడాది రెండుసార్లు పరిహారం ఇవ్వడం సాధ్యం కాదనీ అంటున్నారు.

కృష్ణా జిల్లా తోట్లవల్లూరులోని లంకల్లో నేలకొరిగిన అరటి తోట (ఫైల్ ఫొటో)

కృష్ణాలో తుది నివేదికలో కోత

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం మానికొండకు చెందిన కొల్లి వెంకటకృష్ణారావు 1.85 ఎకరాల్లో, బాపులపాడు మండలం సింగన్నగూడెంకు చెందిన సముద్రాల వరప్రసాద్ 1.45 ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. గెలలు వస్తున్న దశలో వీరి తోటలు ఈ నెల నాలుగో తేదీన వీచిన ఈదురుగాలులకు నేలవాలాయి. ఎకరానికి లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.3.20 లక్షలు నష్టపోయారు. ఈ ఇద్దరు రైతులే కాదు.. ఈదురుగాలులకు, భారీ వర్షాలకు జిల్లాలో 135 మంది రైతులకు నష్టం వాటిల్లింది. బాపులపాడు, ఉంగుటూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, పామర్రు, కంకిపాడు, పెనమలూరు తదితర ఏడు మండలాల్లో 190.50 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఈ తర్వాత 33 శాతంపైగా నష్టపోయిన పంటలను మాత్రమే పరిగణలోకి తీసుకుని తుది నివేదిక మిగతా 7లో

గెస్ట్ లెక్చరర్లకు గౌరవ వేతనం పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీకి గౌరవ వేతనం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన జిఓ 181ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం విడుదల చేశారు. గంటకు రూ.150గా ఉన్న వేతనాన్ని రూ.375కు పెంచారు. నెలకు రూ.27 వేలు (72 గంటల పరిమితి)కు పరిమితం చేశారు. ఈ ఉత్తర్వులు వల్ల రాష్ట్రంలోని 475 జూనియర్ కళాశాలల్లో పనిచేసే 1,177 మంది లెక్చరర్లకు లబ్ధి చేకూరనుంది.

ల్యాండ్ పూలింగులో ప్లాట్ల కేటాయింపు ఇక కమిషనర్ ఇష్టం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంతంలో కొత్తగా భూములు సమీకరించాలని ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం పూలింగ్ చట్టంలో కీలక సవరణ చేసింది. ఇప్పటి వరకూ రైతులకు తిరిగి ఇచ్చే ప్లాట్లను లాటరీ పద్ధతిలో కేటాయిస్తుండగా, తాజా సవరణలో కమిషనర్ ఇష్టానికి వదిలివేసింది. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. అథారిటీ చట్టం రూల్‌లో పేర్కొన్న షెడ్యూల్ 11(1)(ఐ)(సి) ప్రకారం ఇప్పటి వరకూ పూలింగు చట్టం కింద ప్లాట్లను పూర్తి లాటరీ పద్ధతిలో పారదర్శకంగా కేటాయించాల్సి ఉంది. కొత్తగా చేసిన సవరణ ప్రకారం ప్లాట్ల కేటాయింపును లాటరీ లేదా పారదర్శకతతో కూడిన ఇంకేపద్ధతినైనా ప్రభుత్వం లేదా సిఆర్‌డిఏ కమిషనర్ నిర్ణయం మేరకు చేయొచ్చని సవరించారు. పూలింగు చట్టం తెచ్చిన సమయంలో సిఆర్‌డిఏ చట్టంలో ఛాప్టర్ ఏడులో సెక్షన్ 48(5)(సి)(ప్లాట్ల పునర్నిర్మాణం) కింద లాటరీ పద్ధతిలో కేటాయించాలని నిర్ణయించారు. దీనికోసం 2016లో అథారిటీలో 36వ నెంబరుతో తీర్మానం చేశారు. దీనిపై 2016లోనే జిఓ నెంబరు 207 తీసుకొచ్చారు. దీని ప్రకారం ప్లాట్లను 120 చదరపు గజాల నుండి 25 వేల చదరపు గజాల వరకూ కేటాయించేలా నిర్ణయం తీసుకున్నారు. డైనమిక్ పద్ధతిలో ప్లాట్ల కేటాయింపు చేసేందుకు ఏపి ఆన్‌లైన్ లిమిటెడ్‌తో జాయింట్ అగ్రిమెంటు చేసుకున్నారు. భూమి తాలూకా 9.14 అగ్రిమెంటు చేసుకున్న తరువాత రైతులిచ్చిన ఆప్షన్ల మేరకు వారికి ప్లాట్ల విస్తీర్ణం వారీగా లాటరీ తీసి కేటాయింపులు జరిపేశారు. ఇదంతా ఆన్‌లైన్ పద్ధతిలో జరిగేది. ఒకసారి గ్రామాన్ని సెలక్ట్ చేసి రైతులు కోరుకున్న ఆప్షన్లు ఇచ్చేసి అందరి ముందూ ఆన్‌లైన్‌లోనే లాటరీ బటన్ నొక్కగానే ప్లాట్లనెంబర్లు వారి ప్లాట్లవిస్తీర్ణం ప్రకారం మంజూరయ్యేవి. ఎవరికి ఏ ప్లాట్లు ఇస్తే జిఐఎస్‌లో ఉన్న నెంబర్ ఆధారంగా వారికి ధృవీకరణపత్రం ఇచ్చేవారు. అయితే రోడ్డు శూల ఉన్న ప్లాట్ల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తే వారికి అందుబాటులో ఉన్న ప్లాట్లను తిరిగి కేటాయించేవారు. ఈ పద్ధతిపై అప్పట్లోనూ రైతుల నుండి అభ్యంతరాలు వచ్చాయి. అధికారులకు అనుకూలంగా ఉన్న వారికి ఒకచోట, లేనివారికి మరోచోట ప్లాట్లు ఇచ్చారని ఫిర్యాదులూ చేశారు. శాఖమూరు, ఐనవోలు గ్రామాల్లో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం మారిన తరువాత ఎటువంటి మిగతా 2లో

డిఎస్‌సికి 4,77,879 దరఖాస్తులు

- 15తో ముగుస్తున్న గడువు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సికి 4,77,879 దరఖాస్తులు అందాయి. ఏప్రిల్ 20న ఈ నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. మొత్తం 3,03,527 మంది అభ్యర్థులు 4,77,879 దరఖాస్తులు చేశారు. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 15తో ముగియనుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరి రోజు వరకూ ఆగకుండా, అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రవేశ కోర్సులకు స్థానికత నిర్ధారణ

- రీజియన్లుగా ఎయు, ఎస్‌వి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఉమ్మడి ప్రవేశ పరీక్షల అడ్మిషన్లకు స్థానికతను రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఇందుకు సంబంధించిన జిఓ 20ను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం విడుదల చేశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పదేళ్లు ఉమ్మడిగానే ప్రవేశాలు కొనసాగాయి. విభజన జరిగి గతేడాది జూన్ 2వ తేదీతో పదేళ్లు ముగిసింది. దీంతో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన సీట్ల భర్తీకి విధి విధానాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలను రెండు రీజియన్లుగా విభజించింది. ఎయు పరిధి కింద శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు ఉన్నాయి. ఈ పరిధిలోని నివసించే విద్యార్థులకు ఎయు పరిధిలోని ఉండే విద్యాసంస్థల్లో స్థానికత ఉంటుంది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోకి అనంతపూర్, కర్నూలు, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలు వస్తాయి. ఎస్‌వి పరిధిలో నివసించే విద్యార్థులకు ఆ పరిధిలోని ఉండే విద్యాసంస్థల్లో స్థానికత ఉంటుంది. ప్రవేశాల్లో స్థానికుల కోటా 85 శాతం, స్థానికేతరులకు 15 శాతం చొప్పున సీట్ల కేటాయింపు ఉంటుంది.

పావులుగా పోలీసులు

- వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చట్టాలను అతిక్రమించి పోలీసులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పోలీసులను పావుగా వాడుకుంటోందని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో అందుబాటులో ఉన్న నాయకులతో సోమవారం సజ్జల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కొంతమంది పోలీసులు పరిధి దాటి వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి విడదల రజిని పట్ల సిఐ అనుసరించిన తీరు అన్యాయంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వ అన్యాయాలను ప్రజల ముందు పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

డిజిపి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

రెడ్‌బుక్ రాజ్యాంగంపై ఫిర్యాదు చేసేందుకు డిజిపిని ఎన్నిసార్లు కోరినా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని తెలిపారు. పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. దీనిపై సోమవారం మరోసారి డిజిపికి లేఖ రాశామని వివరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, జోగి రమేష్, విడదల రజిని, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, పోతిన మహేష్, దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా శైలజ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మహిళా, శిశుసంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఆమె రెండేళ్ల పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉగ్రవాద శిబిరాలు తుడిచిపెట్టాల్సిందే

మొదటిపేజీ తరువాయి

కొనసాగించడంపై ఇరుపక్షాలు చర్చించినట్లు సమావేశం అనంతరం సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. సరిహద్దులు, ఫార్వర్డ్ బేస్ ప్రాంతాల్లో బలగాలను తగ్గించే అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలన్న సూచన ఈ సమావేశంలో వచ్చినట్లు సైన్యం పేర్కొంది. అయితే, నిర్దిష్టంగా ఏం నిర్ణయాలు తీసుకున్నారన్న విషయాన్ని, మళ్లీ ఎప్పుడు చర్చలు జరుగుతాయన్న అంశాన్ని సైన్యం తెలపలేదు.

అప్రమత్తంగా ఉండాలి : సైన్యానికి మోడీ సూచన

పాక్ ఎత్తుగడల్ని తిప్పికొట్టడానికి సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రధాని ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాని నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. త్రివిధ దళాధిపతులు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు సైనిక అధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగులోప్లాట్ల కేటాయింపు ఇక కమిషనర్ ఇష్టం

మొదటిపేజీ తరువాయి

లావాదేవీలు జరగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఇప్పుడున్న రాజధానికి తోడు అదనంగా భూమిని సమీకరించాలనే ప్రతిపాదన రావడంతో మరలా ప్లాట్ల కేటాయింపు అంశం కీలకంగా మారింది. ఈ సమయంలో గతంలో ఉన్న పద్ధతిలో కాకుండా ప్రభుత్వం లేదా కమిషనర్ వారికి ఇష్టం వచ్చిన పద్ధతిలో కేటాయింపులు జరపొచ్చని తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిఓ నెం.3 పునరుద్ధరణపై అధ్యయనం

- అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



గిరిజన ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో నూరు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన జిఓ నెం. 3ను పునరుద్ధరించే అంశంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ అంశంపై సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ దిశలో రాజ్యాంగ, న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరపాలని , ప్రజా సంఘాల అభిప్రాయలు తీసుకోవాలని సూచించారు. 2000 ఏడాదిలో జిఓ 3 తీసుకువచ్చినట్లు చెప్పారు. దీన్ని అమలు చేయడంతో సుమారు 4,626 ఉపాధ్యాయ ఉద్యోగాలు గిరిజన ప్రాంతంలోని గిరిజనులకు దక్కాయన్నారు. అయితే, 2002లో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, వివిధ స్థాయిల్లో విచారణ అనంతరం 2020లో ఈ ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం దీనిపై రివ్యూ పిటీషన్ వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, దీంతో రివ్యూ పిటీషన్‌ను కూడా సుప్రీంకోర్టు కొట్టేసిందన్నారు. ఈ అంశాలన్నింటిని దృష్టిలో ఉంచుకుని అధికారులు అధ్యయనం చేయాలన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ముడు మార్గాలను సిఎంకు సూచించారు. మొదటి అంశంగా గిరిజన ప్రాంతాల్లో 100 శాతం రిజర్వేషన్లు స్థానిక గిరిజనులకు కల్పించడం, రెండవ అంశంగా స్థానిక గిరిజనులకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించడం, మూడవ అంశంగా సుప్రీం కోర్టు సూచించిన విధంగా 50 శాతం మించకుండా స్థానిక గిరిజనులకే రిజర్వేషన్లు కల్పించి వారి హక్కులను పరిరక్షించడం వంటి అంశాలను సిఎం దృష్టికి తీసుకువచ్చారు అనంతరం సిఎం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా జిఓ నెంబర్ 3ను పునరుద్ధరించడం కుదరని పక్షంలో అదే స్థాయిలో గిరిజనులకు న్యాయం చేయడం తమ ప్రాధాన్యత అని చెప్పారు.

నెలాఖరుకు కాలువ తవ్వకాలు పూర్తి

- అధికారులకు జలవనరులశాఖ మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు, షట్టర్లు, గేట్ల మరమ్మతులు, గ్రీజు పెట్టడం వంటి నిర్వహణ పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులను జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఈ పనులకు రూ.344 కోట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేశారని తెలిపారు. ఇరిగేషన్ పనులపై సోమవారం విజయవాడ కార్యాలయం నుండి మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, కాడా కమిషనర్ రామ్‌సుందర్‌రెడ్డి, ఇఎన్‌సి వెంకటేశ్వరరావుతోపాటు ఇతర ఉన్నతాధి .కారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గుర్రపుడెక్క, తూటుకాడ వంటి వాటి తొలగింపుల కోసం, మందుల పిచికారికి డ్రోన్లు సైతం వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల ఏడు రోజుల వ్యవధిలో షార్ట్ టెండర్లు పిలవడానికి అనుమతి వచ్చిందని, నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టడం దీని ప్రధాన లక్ష్యమని వివరించారు. 2025 ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటి పారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసురావడం ముఖ్యమని అధికారులకు సూచించారు. గేట్లు, షట్టర్లు వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజినీరు పరిశీలించి సక్రమంగా పనిచేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని చీఫ్ ఇంజినీరుకు ఇవ్వాలని ఆదేశించారు. సాగునీటి సంఘాల ఆధ్వర్యాన వారి పరిధిలోని పనులను, మే నెలాఖరుకు పూర్తి చేయాలని, ఇలా పనులను సకాలంలో పూర్తి చేయడానికి చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. గతంలో మాదిరి కాకుండా స్వీయ పర్యవేక్షణ చేస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని పనులూ, సీజన్ మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని అధికారులకు మంత్రి నిమ్మల సూచించారు.

వర్షాకాలంలోపు డ్రెయినేజీ పూడికతీత పూర్తి

- కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి నారాయణ సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వర్షాకాలం వచ్చేలోపు డ్రెయినేజీ పూడికతీత పనులు పూర్తి చేయాలని, తాగునీటికి ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లను పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. సోమవారం ఉదయం రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కమిషనర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, డైరెక్టర్ సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు త్వరితగతిన పూర్తయ్యేలా వేగవంతం చేయాలని సూచించారు. వర్షాలు పడే వరకూ తాగునీటికి ఎక్కడా ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. ఓపెన్ డ్రెయిన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ కమిషనర్లు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, తిరుపతి, విశాఖ, గుంటూరులో టిడిఆర్ బాండ్ల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అన్న క్యాంటీన్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఆహారం నాణ్యత పరీక్షించాలని, పన్నుల వసూళ్లలో అలసత్వం లేకుండా ఆదాయంపై దృష్టి సారించాలని కోరారు. చండీగఢ్ తరహాలో రోడ్లకు ఇరువైపులా చెట్లను నాటించాలని ఆదేశించారు.

కనెక్షన్లు వెంటనే పునరుద్ధరించకపోతే ఉద్యమిస్తాం

- దళితుల ఇళ్లకు కరెంటు కనెక్షన్ల తొలగింపు అన్యాయం
- ఎమ్మెల్యే ఆదేశాలు పాటిస్తున్నామని చెప్పడం విడ్డూరం : అంద్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - కాళ్ల

బాధిత దళిత కుటుంబాలతో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, నేతలు

దళితుల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగించడం అన్యాయమని, వాటిని వెంటనే పునరుద్ధరించకపోతే ఉద్యమిస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్లలోని లంక రోడ్డులో ఉన్న దళితుల ఇళ్లను సోమవారం కెవిపిఎస్ బృందం పరిశీలించి, బాధితులను పరామర్శించింది. అనంతరం అధికారులతో ఫోన్‌లో మాల్యాద్రి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళ్ల లంక రోడ్డులోని పది దళిత కుటుంబాలకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా దుర్మార్గంగా కరెంటు కనెక్షన్లు తొలగించడం అన్యాయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆదేశాల ప్రకారమే దళితుల ఇళ్లకు కరెంట్ కట్ చేశామని, పంచాయతీ, ఆర్‌అండ్‌బి అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఎలక్ట్రికల్ ఎఇ, పంచాయతీ అధికారులు కుమ్మక్కై కరెంటును కట్ చేశారని, తక్షణం వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె క్రాంతిబాబు, సిఐటియు జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ, బాధితులు పద్మారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరుచుకున్న 32 విమానాశ్రయాలు

న్యూఢిల్లీ : దేశంలోని 32 విమానాశ్రయాల్లో తిరిగి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొనడంతో ఇటీవల ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను మే 15 వరకు మూసివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. తాజాగా ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో ఆయా విమానాశ్రయాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. పౌర విమానయాన కార్యకలాపాలు వెంటనే అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో 17 మంది అనధికార వెండర్స్ గుర్తింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఎటువంటి లైసెన్స్ లేకుండా వెండర్స్ అమ్మకాలు సాగిస్తున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో రైల్వే అధికారులు సోమవారం షాపులపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 17 మంది లైసెన్స్ లేకుండా ఉండటం, కొందరేమో లైసెన్స్ గడువు పూర్తయినా అమ్మకాలు సాగిస్తున్నట్లు గుర్తించి వారికి రూ.85 వేలు పెనాల్టీలు విధించినట్లు రైల్వే పిఆర్‌ఒ మంద్రుప్కర్ తెలిపారు.

తిరుమల ఘాట్ రోడ్డులో చిరుత సంచారం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో చిరుత సంచారం కలకలం రేపింది. రెండవ ఘాట్ రోడ్డులో చిరుత కనిపించడంతో యాత్రికులు ఆందోళనకు గురయ్యారు. వినాయకుడి గుడి సమీపంలో రోడ్డు దాటుతూ కనిపించిందని ద్విచక్ర వాహనదారులు చెప్పారు. యాత్రికుల ఫిర్యాదుతో రెండవ ఘాట్ రోడ్డుకు చేరుకున్న అధికారులు చిరుత జాడలను పరిశీలించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఘాట్ రోడ్డులో రాకపోకలకు అంతరాయం కలగకుండా, చిరుత అటువైపు రాకుండా ఏర్పాట్లు చేస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. నడకదారిలో కొండకు వెళ్లే యాత్రికులు.. గుంపులుగా వెళ్లాలని, ఒంటరిగా వెళ్లొద్దని, రాత్రి వేళల్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ అధికారులు సూచించారు. ఇటీవల వెటర్నరీ కళాశాలలో బోనులో చిరుత చిక్కడంతో సమస్య తీరిపోయింది అనుకున్నారు. కానీ మళ్లీ మరో చిరుత కనిపించడం యాత్రికులను భయాందోళనలకు గురి చేస్తోంది.

గార్లపేట రోడ్డులో మద్యం దుకాణాలొద్దు : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లా, కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని గార్లపేట రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయకూడదని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్‌కు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి లేఖను సోమవారం మెయిల్ చేశారు. గార్లపేట రోడ్డులో మద్యం షాపు ఏర్పాటును ఐద్వా ఆధ్వర్యాన మహిళలు 9వ తేదీన అడ్డుకున్నట్లు తెలిపారు. ఆస్పత్రి, సచివాలయం, పాఠశాల, వసతిగృహం, ఆలయం ఉన్న ఈ ప్రాంతంలో ఎక్కువగా పేదలు నివసిస్తున్నారని చెప్పారు. మద్యం దుకాణం ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల తమ కుటుంబాలు ఛిన్నాభిన్నమైపోతాయని, గొడవలు పెరుగుతాయని, మహిళలకు రక్షణ ఉండదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. మహిళల ఆందోళన గురించి తెలుసుకున్న ఎక్సైజ్‌శాఖ సిఐ విజయ భాస్కర్ అక్కడికి చేరుకుని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సిఐ ఆదేశాల మేరకు మద్యం షాపు ఏర్పాటుకు తెచ్చిన మద్యం లోడును నిర్వాహకులు వెనక్కి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయకుండా తగిన ఆదేశాలను అధికారులకు ఇవ్వాలని కమిషనర్‌ను లేఖలో కోరారు.

ఉర్దూ డిఐ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి : రూట

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్రంలోని ఉర్దూ డిఐ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాఖ్ సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, కృష్ణా, గుంటూరు, బాపట్ల, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ డిఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ రేంజ్) పోస్టులను అర్హులతో భర్తీ చేయాలని కోరారు.

ఉపాధి కార్మికురాలు ఆత్మహత్య

- ఫీల్డ్ అసిస్టెంట్ వేధింపులే కారణమని సెల్ఫీ

ప్రజాశక్తి - చందర్లపాడు :

ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడు మండలం విభరింతలపాడు శివారు సంగళ్లపాలెం గ్రామంలో ఉపాధి కార్మికురాలు అబ్బూరి మాధురి (45) ఆత్మహత్య చేసుకున్నారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తన చావుకు ఫీల్డ్ అసిస్టెంటే కారణమని ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉపాధి కార్మికురాలు అబ్బూరి మాధురిని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మైలా రవితేజ నోటికొచ్చినట్లు అందరి ముందూ దూషించారు. దీంతో, ఆమె తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అవమానాన్ని భరించలేక సోమవారం ఉదయం పని ప్రదేశం నుండి ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న భర్త వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మాధురి మరణించారు. తన చావుకు ఫీల్డ్ అసిస్టెంట్ రవితేజ కారణమని, తనకు జరిగినట్లు మరో మహిళకు అవమానం జరగకూడదని సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. తాను చచ్చిపోతున్నానని, తనకు న్యాయం చేయాలని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను వేడుకున్నారు. మృతదేహానికి నందిగామ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. ఫీల్డ్ అసిస్టెంట్‌పై చందర్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసు విచారణకు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి హాజరు

- లింగమయ్య హత్య కేసు

తప్పుదోవకే కేసులు : ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏప్రిల్ 8న సత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లి వెళ్లిన సందర్భంగా జరిగిన హెలిపాడ్ ఘటనపై నమోదైన కేసు విచారణకు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సోమవారం హాజరయ్యారు. పాపిరెడ్డిపల్లి లో హత్యకు గురైన కురవ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లినప్పుడు వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రావడంతో హెలిపాడ్ విండ్ షీల్డ్ దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు ప్రకాష్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. 41 సి నోటీసు ఇచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నోటీసు రెండ్రోజుల క్రితం అందుకున్న ప్రకాష్‌రెడ్డి సోమవారం విచారణకు హాజరయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొతపల్లి పోలీస్ స్టేషన్లో రామగిరి సిఐ శ్రీధర్ సమక్షంలో పోలీసులు మూడు గంటల పాటు విచారించారు. సుమారు 102 ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ప్రకాష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. లింగమయ్య హత్య కేసును తప్పుదోవ పట్టించేందుకు పోలీసులు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ పర్యటనలో పూర్తిస్థాయి పోలీస్ వైఫల్యం ఉందని విమర్శించారు. బారికేడ్లు తోసుకుని హెలిపాడ్‌లోకి వచ్చిన జనాన్ని పోలీసులు నియంత్రించలేకపోయారని, ఈ తప్పిదాన్ని కూడా కప్పిపుచ్చుకునేందుకు వైసిపి నేతలపై కేసులు బనాయియించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్య చేసిన నిందితులపై మాత్రం ఇప్పటికీ సరైన చర్యలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజలను, పంటలను ఏనుగుల నుంచి రక్షించాలి

- ఉప ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ప్రజలు, పంటలను ఏనుగుల బారి నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రికి సోమవారం ఆయన లేఖ రాశారు. తిరుపతిలోని రేణిగుంట మండలంలో, పార్వతీపురం మన్యం జిల్లాలోని కొమరాడ, సీతానగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని సీతంపేట, భామిని మండలాల్లో ఏనుగుల వల్ల పంట, ఆస్తి, ప్రాణనష్టం జరుగుతోందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏనుగుల దాడిలో ఇప్పటికి 16 మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఏనుగులు ఎప్పటికప్పుడు దాడి చేస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల రేణిగుంట మండలం పరిధి మామండూరులో మార్కొండ గురవయ్య మామిడితోటలో 1.50 ఎకరాల్లో పంట చేతికొచ్చే చెట్లను, ఫెన్సింగ్‌ను పూర్తిగా ధ్వంసం చేశాయని పేర్కొన్నారు. ఆ గ్రామ రైతులు ఎప్పటికప్పుడు ఏనుగుల దాడి వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి తక్షణ పరిహారం ఇవ్వాలని కోరారు. ఆ ప్రాంత రైతులను కాపాడేందుకు కాలువల్లో పూడిక తీయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. సోలార్ ట్రంచింగ్ ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారని లేఖలో వివరించారు. ఏనుగులను తరలించాలని కొన్నేళ్లుగా పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నారని, నేటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. గ్రామాల మధ్యలోనే ప్రభుత్వం ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రతిపాదన ఉందని వివరించారు. దానికి వ్యతిరేకంగా ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నారని, ఈ జోన్ ఏర్పాటు వల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎలిఫెంట్ జోన్‌ను జనం లేని సూదూర ప్రాంతాలకు తరలించాలని, యుద్ధ ప్రాతిపదికన ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడంతోపాటు గ్రామాల మధ్య ఎలిఫెంట్ జోన్ ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు. చనిపోయిన వ్యక్తుల కుటుంబాలను ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని శ్రీనివాసరావు కోరారు.

కాకానిలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, కాకానిలో 43.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. బాపట్ల జిల్లా, ఇంకొల్లులో 43.5 డిగ్రీలు, ప్రకాశం జిల్లా జువ్విగుంటలో 43.3, ఎన్‌టిఆర్ జిల్లా, మొగల్లూరులో 43.1, తూర్పుగోదావరి జిల్లా, చిట్యాలలో 42.8, ఏలూరులో 42.6, విజయనగరం జిల్లా ధర్మవరంలో 42.5, తిరుపతి జిల్లా, గూడూరులో 42.3 డిగ్రీల చొప్పున అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు. ఈ నెల 13న 42 డిగ్రీల నుంచి 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందన్నారు. 21 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశముందని, వాటిలో శ్రీకాకుళం-4, విజయనగరం-2, పార్వతీపురం మన్యం-11, కాకినాడ-3, తూర్పుగోదావరి 1 మండలాలు ఉన్నాయి. మరో 32 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశముందని, వీటిలో శ్రీకాకుళం-2, విజయనగరం-14, పార్వతీపురం మన్యం-2, అల్లూరి సీతారామరాజు-3, కాకినాడ-4, తూర్పుగోదావరి-7 మండలాలు ఉన్నాయి. మరోవైపు ఈ నెల 13న రాయలసీమలో అక్కడక్కడా చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని కూర్మనాథ్ తెలిపారు.

ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పోలీసులు, విద్యార్థులు

సైనికుల కుటుంబాలకు అండగా నిలుద్దాం

- కొవ్వొత్తుల ర్యాలీలో హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరం కంటోన్మెంట్

పెహల్గాంలో టూరిస్టులపై తీవ్రవాదులు జరిపిన దాడిలో మరణించిన భారత పౌరులకు, పాకిస్తాన్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయి అమరులైన సైనికులకు నివాళిగా పోలీసుశాఖ ఆధ్వర్యాన విజయనగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు హాజరయ్యారు. అమరులైన భారత సైనికులకు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించారు. అనంతరం అక్కడి నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ కూడలికి చేరుకున్నారు. అక్కడ అమరులైన భారత సైనికుల ఫోటోల వద్ద క్యాండిల్స్ పెట్టి నివాళులర్పించారు. మంత్రి అనిత మాట్లాడుతూ.. పెహల్గాం దాడికి ప్రతిగా భారత ప్రభుత్వం మహిళా అధికారుల నేతృత్వంలో ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్ చేపట్టి, దేశ సరిహద్దుల్లోని తీవ్రవాదుల స్థావరాలపై దాడులు చేసిందన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పాకిస్తాన్ జరిపిన దాడుల్లో మృతి చెందిన సైనిక కుటుంబాలకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్, తిరుమల మెడికవర్ ఎండి కె.తిరుమల ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాలి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పొగాకు రైతులలో నెలకొన్న ఆందోళనను తొలగించేలా వారి పంటలను కంపెనీలు కొనుగోలు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. సాగు ఖర్చులు పెరగడంతో రైతులను ఆదుకునే బాధ్యత కంపెనీలు తీసుకోవాలని కోరారు. పొగాకు కొనుగోళ్లు జరుగుతున్న తీరు, ధరలపై మంత్రి గొట్టిపాటి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, పొగాకు బోర్డ్ చైర్మన్ యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ, జెసి ఆర్. గోపాలకృష్ణ జిల్లాలోని ప్రజాప్రతినిధుల సమక్షంలో పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ.. అన్ని గ్రేడ్‌ల పొగాకును కొనుగోలు చేయాలని, ఇకపై వేలం కేంద్రాలను సందర్శించి కొనుగోలు తీరును ప్రజాప్రతినిధులు, బోర్డు అధికారులు పరిశీలించాలన్నారు.

మంత్రి వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. పొగాకు హై గ్రేడ్‌తో పాటు మీడియం, లో గ్రేడ్‌ను కూడా కొనుగోలు చేయాలని సూచించారు. సెస్ ప్రతిపాదన వద్దని, ప్రస్తుత పరిస్థితులలో మార్క్‌ఫెడ్ జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి లేదన్నారు. పొగాకు బోర్డ్ చైర్మన్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 167 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా 240 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని కొనుగోలు చేయించేలా ప్రయత్నిస్తామన్నారు. దేశంలో 80 మిలియన్ కిలోలు, ఇతర దేశాలలో 400 మిలియన్ కిలోలు అధిక ఉత్పత్తి రావడంతో అంతర్జాతీయంగా ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. నెలాఖరుకు మార్కెట్ పుంజుకునే అవకాశం ఉందని, రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని, చివరి ఆకుతో సహా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

పిడుగుపాటుకు ఒకరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలో పిడుగుపాటుకు ఒకరు మరణించారు. స్థానికుల సమాచారం మేరకు.. పాలవలసకు చెందిన గొర్రెల పెంపకందారుడు దాసరి అప్పన్న (47) తన గొర్రెలను తోలుకోని వెళ్లారు. ఒక్కసారిగా వర్షం పడడంతో చిగురువలస పంచాయతీ పరిధి తాడికొండ వద్ద గొర్రెల మందను నిలిపి ఉంచారు. ఆ సమయంలో ఆయనకు సమీపంలో పిడుగు పడడంతోఅప్పన్న అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య తులసమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని పలు మండలాల్లో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షానికి సంతబొమ్మాళి మండలం నౌపడ, మర్రిపాడు ప్రాంతాల్లో ఉప్పు పంటకు నష్టం ఏర్పడింది. రైతులు నిల్వ చేసిన ఉప్పు కుప్పలు వర్షానికి తడిసిపోయాయి. ఏలూరు జిల్లా పోలవరం మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. తహశీల్దారు కార్యాలయానికి వెళ్ళే మార్గంలో రోడ్డుపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

తప్పు చేసిన వారికే రెడ్‌బుక్

- యాక్సిస్ ఒప్పందంతో పీక్ అవర్స్‌లో రూ.4.60కు విద్యుత్ : మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)

తప్పు చేసిన వారికి మాత్రమే రెడ్‌బుక్ వర్తిస్తుందని... వారు కచ్చితంగా శిక్షను అనుభవిస్తారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు. ఇది ప్రజల ప్రభుత్వమని.. ప్రజలు స్వేచ్ఛగా తిరగాలనే కారణంగానే ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదని, పెట్టబోమని తెలిపారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం, ఏడుగుండ్లపాడులో ఓ ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యుత్ శాఖను జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ఆదాయ వనరుగా వాడుకుందని, ప్రజలపై మోయలేని భారం మోపిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఎటువంటి విద్యుత్ ఛార్జీలనూ పెంచలేదన్నారు. యాక్సిస్ ఎనర్జీ యూనిట్‌కు రూ.5.12కు గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని.. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందాన్ని సవరించి యూనిట్ రూ.4.60కు విద్యుత్ సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా అధిక విద్యుత్ వినియోగ సమయంలో యూనిట్ రూ.4.60కు లభిస్తుందని తెలిపారు.

సమస్యలపై గళమెత్తిన ఉపాధ్యాయులు

- యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా డిఇఒ కార్యాలయాల ఎదుట ధర్నా

విజయవాడ ధర్నాచౌక్‌లో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎన్ ప్రసాద్

ప్రజాశక్తి - యంత్రాంగం

పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ, బదిలీలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఇఒ కార్యాలయాల ఎదుట సోమవారం ఉపాధ్యాయులు ధర్నా చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కృష్ణా జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిఒ117 రద్దు చేసి దాని స్థానంలో కొత్త జిఒ విడుదల చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలలను పునఃవ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూళ్లను నిర్వీర్యం చేస్తున్నారని, ఈ వైఖరి విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈ నెల 15 లోగా పరిష్కరించకుంటే విద్యాభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

విజయవాడ ధర్నాచౌక్ సెంటర్, ఏలూరులో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎన్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలకు 1:20 నిష్పత్తిలో, ఉన్నత పాఠశాలలో 1:45 నిష్పత్తిలో పోస్టులను కేటాయించాలని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని డిఇఒ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేస్తున్నప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదన్నారు. ఏలూరులో ధర్నాకు సిఐటియు, ఎస్ఎఫ్ఐ నేతలు సంఘీభావం తెలిపారు.

పార్వతీపురంలో ఉపాధ్యాయులు గొడుగులతో నిరసన తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు హాజరై ప్రసంగించారు. విజయనగరంలో జిల్లా కేంద్రాస్పత్రి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు పాల్గొన్నారు. అన్ని మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ఐదవ తరగతులు బోధించడానికి ఐదుగురు టీచర్లను నియమించాలని, విద్యార్థుల సంఖ్య 75 మించితే పిఎస్, హెచ్‌ఎం. పోస్టు అదనంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. గుంటూరులో కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎ.ఎన్.కుసుమకుమారి పాల్గొన్నారు.. తిరుపతి, చిత్తూరు, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లా పాడేరు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, కడప, అన్నమయ్య, ఉమ్మడి ప్రకాశం, అనంతపురం, కర్నూలు జిల్లాల డిఇఒ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం

ఇష్టపడి చదివితే విజయం

- పోటీ పరీక్షల నిపుణులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్షణరావు
- డిఎస్‌సి అభ్యర్థుల కోసం విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్ పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి- నెల్లూరు

డిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణులు కావాలంటే ఇష్టపడి చదివి విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని పోటీ పరీక్షల నిపుణులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్షణరావు అన్నారు. డిఎస్‌సి పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు నెల్లూరులోని డాక్టరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం డిఎస్‌సి అభ్యర్థులకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా తాను రచించిన విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని కెఎస్ లక్ష్మణరావు ఆవిష్కరించి మాట్లాడారు. భారత రాజ్యాంగం, కరెంట్ అఫైర్స్‌పై వివరించారు. జనరల్ నాలెడ్జిని, ఆర్‌టి నాయుడు, సైకాలజీని డాక్టర్ నళిని, మెథడాలజీని స్ఫూర్తి వెంకటేశ్వర్లు తెలుగు సబ్జెక్ట్‌ను ఆర్ వెంకట్రావు, ఇంగ్లీషు సబ్జెక్టును డి శ్రీనివాసులు, సాంఘిక శాస్త్రాన్ని జివల్.రత్నశేఖర్ బోధించారు. అవగాహన సదస్సుకు హాజరైన డిఎస్‌సి అభ్యర్థులకు విద్య మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్‌ని ఉచితంగా అందజేశారు. ఈ నెల 18న ఉదయం 9.30 గంటలకు డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో డిఎస్‌సి గ్రాండ్ టెస్ట్ జరగనుందని, 9440893123 నెంబర్‌కి పరీక్ష ఫీజు రూ.20 ఫోన్ పే చేయాలని, అభ్యర్థి పేరు, మొబైల్ నెంబర్, సబ్జెక్టు వివరాలు వాట్సాప్ చేయాలని నిర్వాహకులు తెలిపారు.

శ్రీశైలం డ్యాం భద్రతకు ముప్పులేదు

- సిడిఒ బృందం వెల్లడి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

డ్యాం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న సిడిఒ బృందం

శ్రీశైలం డ్యాం భద్రతకు ఎలాంటి ముప్పు లేదని రాష్ట్ర జల వనరుల శాఖ సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ (సిడిఒ) బృందం తెలిపింది. సిఇ విజయ భాస్కర్ నేతృత్వంలో డ్యాం నీటి నిల్వలు, గేట్ల ఆపరేషన్, అప్రోచ్ రోడ్డు తదితరాలను బృందం సభ్యులు సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎస్ఇ శివ ప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ప్రాజెక్టును సందర్శించిన ఎన్‌డిఎస్‌ఎ బృందం తక్షణమే చేపట్టాల్సిన సిఫార్సులపై అధ్యయనం చేస్తుందని తెలిపారు. 2009లో భారీ వరద వల్ల డ్యామ్ దిగువ భాగాన ఏర్పడిన గొయ్యి మూడేళ్లుగా ముందుకు వెళ్లడం లేదన్నారు. 62 కాంక్రీట్ సిలిండర్లు, కొన్ని డ్రమ్స్ పాడైనట్లు వివరించారు. రెండు రాష్ట్రాల అంశంగా ఉందని, వచ్చేనెల జూన్‌లో ఈ పనులను ప్రారంభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోచిస్తున్నాయని తెలిపారు. డ్యాం భద్రతకు సంబంధించిన ఎన్‌డిఎస్‌ఎ సూచించిన అంశాలపై డిజైనింగ్ లోపాలను పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. త్వరలోనే అప్రోచ్ రోడ్డు పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ బృందం వెంట స్థానిక డ్యామ్ ఎస్ఇ శ్రీరామచంద్రమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాల్ రెడ్డి, ఏఇలు సుదర్శన్ రెడ్డి, మల్లికార్జున, వినోద్ తదితరులు ఉన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాలి

- కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా



పొగాకు రైతుల సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పొగాకు కొనుగోళ్లలో ఆలస్యం అయితే పొగాకు నల్లబడుతుందని, ఒప్పందం చేసుకున్న కంపెనీలు తక్షణమే రైతుల నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని, లేనిపక్షంలో కంపెనీల గోదాములను ముట్టడిస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. రైతులతో ఆలయన్స్ వన్, ఎంఎల్, జిపిఐ కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయని, పంట చేతికివచ్చాక కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో నంద్యాల కలెక్టరేట్ వద్ద పొగాకు రైతులు, సంఘం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాల్లో దాదాపు 36 వేల ఎకరాల్లో పొగాకు సాగుచేశారని తెలిపారు. ఇందులో కౌలు రైతులు కూడా ఉన్నారని చెప్పారు. మూడు నెలల నుంచి పొగాకు కొనుగోలు చేయకుండా ఆలయన్స్ వన్ కంపెనీ కాలయాపన చేస్తోందన్నారు. ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన కౌలు రైతు 60 ఎకరాల్లో పొగాకు సాగు చేసి 450 క్వింటాళ్లు పండించారని, కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో ఆ రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. తక్షణమే కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని కలిసి పొగాకు రైతుల సమస్యలను వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ అగ్రిమెంట్ జిరాక్స్ కాపీలు ఉంటే ఇవ్వాలని, కంపెనీలను పిలిపించి మాట్లాడుతామని, పొగాకు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, ఉపాధ్యక్షులు సుబ్బారాయుడు, పొగాకు రైతులు పాల్గొన్నారు.

పోర్టు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

విశాఖ పోర్టు ఆస్పత్రిని ప్రయివేటీకరించ వద్దని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం పోర్టు ఆస్పత్రి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని, రీటెండర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పోర్టు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి వి రామలింగేశ్వరరావు, విడిఎల్‌బి, డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జె సత్యనారాయణ, బి లక్ష్మణరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఎంతో మందికి సేవలందిస్తున్న పోర్టు ఆస్పత్రిని ప్రయివేటుకు ఇవ్వడం దారుణవ2న్నారు. పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. అవసరమైన, నిపుణులైన డాక్టర్లు, సిబ్బందిని, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చాల డిమాండ్ చేశారు. ఏటా విశాఖ పోర్టు రూ. వందల కోట్ల లాభాలను ఆర్జిస్తోందని, ఇటువంటి తరుణంలోనూ పోర్టు ఉద్యోగుల, వారి కుటుంబాల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయాలని చూడడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ ఏడాది సుమారు రూ.800 కోట్ల లాభాలను పోర్టు ఆర్జించిన విషయాన్ని గుర్తుచేశారు. దాంట్లో కొద్దిపాటి మొత్తాన్ని వెచ్చించినా పోర్టు ఆస్పత్రి అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రయివేటీకరణ నిర్ణయంపై యాజమాన్యం, ప్రభుత్వం ముందుకెళ్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

విద్యాదృక్పథాలు-విద్యాహక్కు చట్టం-2009

2010 ఏప్రియల్ 1వ తేదీ విజ్ఞాన సముపార్జనా ప్రక్రియలో ఒక చిరస్మరణీయమైన దినంగా పరిగణించబడే రోజు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలందరూ పాఠశాలకు దూరంగా ఉండటానికి వీల్లేకుండా నాణ్యమైన విద్యను పొందటానికి వీలుగా ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కుల చట్టం-2009 భారత పార్లమెంట్ ద్వారా రూపొందించబడి ఆగస్టు 26, 2009న రాష్ట్రపతి ద్వారా ఆమోదించబడి 2010 ఏప్రియల్ 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది.

చట్టం పేరు : ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కుల చట్టం 2009
ఏ ప్రాంతాల వారికి వర్తిస్తుందంటే : జమ్మూ కాశ్మీర్ మినహా భారతదేశమంతటికి
అమలు తేదీ : 01-04-2010 (అధ్యాయం 1, సెక్షన్ 1)
ఏ వయస్సువారంటే : 6 నుండి 14 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలు
చట్టంలోని అధ్యాయాలు : 07
సెక్షన్లు : 38
షెడ్యూలు : 01 (బడికి నియమాలు, ప్రామాణికాలు)

చట్టంలోని కొన్ని ముఖ్యాంశాలు

1. 6 నుంచి 14 సంవత్సరాలున్న బాలబాలికలందరికీ పరిసరప్రాంత పాఠశాల ఎలిమెంటరీ విద్య (1 నుండి 8వ తరగతి వరకూ) పూర్తి చేసే వరకూ ఉచిత నిర్బంధ విద్య పొందే హక్కు ఉంటుంది. (అధ్యాయం -II, సెక్షన్ - 3, సబ్ సెక్షన్ -1).
2. పైన పేర్కొన్న విధంగా విద్యను పూర్తిచేయటానికి ఎలాంటి రుసుం, ఛార్జీలు, ఖర్చులను చెల్లించాల్సిన అవసరం బాలలకు లేదు. (అధ్యాయం- II, సెక్షన్- 3, సబ్ సెక్షన్-2).
3. ఆరేళ్లు నిండిన బాలుడు/ బాలికను బడిలో చేర్చకపోయినా, లేదా చేర్చిన తరువాత ప్రాథమిక విద్యను పూర్తి చేయలేకపోయినా వారిని వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్చుకోవాలి. (అధ్యాయం- II, సెక్షన్
4. ప్రత్యేకంగా వయసు మించిన సందర్భంలో ప్రవేశం పొందినవారు 14 సంవత్సరాలు పూర్తయిన తర్వాత కూడా ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసే వరకూ ఉచితవిద్యను పొందే హక్కు కల్గివుంటారు. అధ్యాయం-II, సెక్షన్ - 4).
5. ఒక బడిలో ప్రాథమిక విద్యను పూర్తిచేసే సదుపాయం లేకుంటే కొన్ని ప్రత్యేక బడులకు తప్ప ఏ ఇతర బడికైనా బదిలీ హక్కు ఉంటుంది. ప్రధానోపాధ్యాయుడు బదిలీ సర్టిఫికెట్‌ను వెంటనే ఇవ్వాలి. (అధ్యాయం- II, సెక్షన్ - 5).
6. పరిసర ప్రాంత పరిధిలో బడి లేకుంటే 3 సంవత్సరాలోపు బడిని సంబంధిత ప్రభుత్వాలు స్థాపిస్తాయి. అంతేకాకుండా నిధులను, జాతీయ పాఠ్యప్రణాళికను, ఉపాధ్యాయుల శిక్షణ, ప్రామాణికాలను అందజేస్తాయి. (అధ్యాయం-II, సెక్షన్-6, 7).
7. తమ బిడ్డ లేదా సంరక్షణలోనున్న బాలుడు/ బాలికను పరిసర ప్రాంతంలోని ఎలిమెంటరీ విద్యలో చేర్పించడం ప్రతి తల్లి/తండ్రి లేదా సంరక్షకుని బాధ్యత (అధ్యాయం -II, సెక్షన్- 10).
8. మూడు సంవత్సరాలకు మించిన బాలలను ఎలిమెంటరీ విద్యకు సంసిద్ధులను చేయటానికి ఆరేళ్ళు నిండే వరకు ఉచిత పూర్వపాఠశాల విద్యను అందించే ఏర్పాట్లు చేయబడతాయి. (అధ్యాయం -II, సెక్షన్ - 11).
9. ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను అందించడం అవాసప్రాంత బడి యొక్క బాధ్యత (అధ్యాయం -II, సెక్షన్ - 11). ఎలాంటి ఎంపిక విధానాలు (ఎంట్రన్స్ టెస్ట్) చేయరాదు. చేస్తే రూ.25 వేలు, రూ.50వేలు జరిమానా. (అధ్యాయం-IV, సెక్షన్ 13, స.సె. 2(బి)).
10. వయస్సు నిర్ధారణ చేయలేదన్న కారణంతో ఏ బాలుడికి, బాలికకు బడిలో ప్రవేశాన్ని తిరస్కరించరాదు. (అధ్యాయం - IV సెక్షన్- 14, స.సె. 2).
11. బడిలో ప్రవేశం పొందిన బాలలను ఎలిమెంటరీ విద్య పూర్తయ్యే వరకూ ఏ తరగతి లోనైనా మళ్లీ కొనసాగించడం, బడి నుంచి తీసివేయటం చేయరాదు (అధ్యాయం - IV, సెక్షన్ 16).
12. ఏ బాలుడు, బాలికను కూడా శారీరక శిక్షకు, మానసిక వేధింపులకు గురిచేయ కూడదు. (అధ్యాయం - IV, సెక్షన్ - 17).
13. గుర్తింపు లేకుండా బడిని స్థాపించడం, పనిచేయించడం చేయకూడదు. (అధ్యాయం -IV, సెక్షన్ - 18).
14. గుర్తింపు రద్దయిన తర్వాత బడినడిపితే రూ.లక్ష జరిమానా, (అధ్యాయం - 4, సెక్షన్ - 19, స.సె. 5).
15. ఉపాధ్యాయులు బడికి హాజరు కావడంలో సమయాన్ని, క్రమబద్ధతనూ పాటించాలి. పాఠ్యప్రణాళిక ప్రకారం పాఠశాలను చేపట్టి నిర్ధారిత సమయంలో పూర్తి చేయాలి. అవసరమైతే విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా అదనపు బోధనను అందించాలి. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి. (అధ్యాయం-IV, సెక్షన్-24).
16. జనాభా గణన, వైపరీత్యాలలో సహాయ విధులు, ఎన్నికల విధులు మినహాయించి ఉపాధ్యాయులను ఏ ఇతర విద్యేతర పనులకు వినియోగించరాదు. (అధ్యాయం -IV, సెక్షన్ - 27).
17. పాఠ్యప్రణాళిక రాజ్యాంగ విలువలకు, బాలల సర్వతోముఖాభివద్ధికి తగిన విధంగా ఉండాలి. (అధ్యాయం IV సెక్షన్ 29)
18. ఎలిమెంటరీ విద్య పూర్తయ్యే వరకూ బాలలు ఎలాంటి బోర్డు పరీక్షకు హాజరుకానవసరం లేదు. పూర్తయ్యాక సూచిన విధానంలో ధృవీకరణ పత్రం జారీచేయబడుతుంది. (అధ్యాయం IV, సెక్షన్ 30) స.సె.1.2.)
19. బడి యాజమాన్యం సంఘం ఎన్నికైన ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఏర్పాటుచేయబడి బడి పనితీరును సమీక్షించటం, అభివృద్ధి ప్రణాళికలను తయారుచేయడం, నిధుల వినియోగాన్ని పర్యవేక్షించటం చేస్తుంది. (అధ్యాయంIV, సెక్షన్ 21).
20. ఎయిడెడ్ పాఠశాలలు, అన్ ఎయిడెడ్ పాఠశాలలు తమ బడిలో చేర్చుకున్న పిల్లల్లో కనీసం 25 శాతానికి తగ్గకుండా 1వ తరగతిలో పేద పిల్లలను చేర్చుకోవాలి.ఎలిమెంటరీ వరకూ ఉచితంగా విద్యను అందించాలి. ఇందుకయ్యే ఖర్చును అన్ని ఎయిడెడ్ పాఠశాలలకు రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తుంది. (అధ్యాయం IV, సెక్షన్ 12)
21. విద్యాహక్కు చట్టం ప్రకారం 1 నుంచి 5వ తరగతులు బోధించటానికి 60 మంది పిల్లల వరకు ఇద్దరు, 61 నుంచి 90 వరకు ముగ్గురు, 91 నుంచి 120 వరకు నలుగురు, 121 నుంచి 200 వరకూ ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలి. 150 కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులతోపాటు ప్రధానోపాధ్యాయుడు కూడా ఉండాలి. 200 కంటే ఎక్కువ పిల్లలు ఉన్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుతోపాటు 1 :40 మించకుండా ఉపాధ్యాయులను నియమించాలి.

బాలల సర్వతోముఖాభివృద్ధికై రూపొందించబడిన బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009ను పటిష్టంగా అమలుపర్చే క్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్య, విద్యేతర ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంధ సేవా సంస్థలు, మీడియా ప్రతినిధులు, ప్రజలంతా తమ వంతు సహకారాన్ని అందిస్తూ చట్టం విజయవంతం అయ్యేటట్లు కృషిచేయాల్సిన బాధ్యత ఉంది.

ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కుల నిబంధనలు

1. పాఠశాల యాజమాన్య కమిటీ, స్థానిక అధారిటీ ప్రత్యేక శిక్షణ అవసరమైన పిల్లలను గుర్తించి వారికి శిక్షణను నిర్వహించాలి (నిబంధన 4.1).
2. 1-5 తరగతులు బాలలను వారి పరిసర ప్రాంతానికి 1 కి.మీ. నడవగలిగే దూరపులోపు పాఠశాలను ఏర్పాటు చేయాలి. 6-8 తరగతుల బాలలను తమ పరిసర ప్రాంతానికి 3 కి.మీ. నడవగలిగే దూరంలోపు పాఠశాలను ఏర్పాటు చేయాలి (5.1).
3. వైకల్యంతో అందుబాటులో ఉన్న పాఠశాలలకు హాజరు కాలేని బాలల విషయంలో ప్రభుత్వం, స్థానికప్రభుత్వం సురక్షిత రవాణా ఏర్పాట్లను కల్పించడం లేదా అర్హతగల తల్లిదండ్రుల, సంరక్షకులకు ప్రత్యామ్నాయ ఆర్థిక ప్రోత్సాహకాలను అందించడం ద్వారా అలాంటి బాలలు పాఠశాలకు హాజరై మాధ్యమిక విద్యను పూర్తిచేయడానికి తగిన కృషి చేయాలి (నిబంధన 5.7).
4. ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తున్న పాఠశాలల్లో చేరిన బాలలు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారంలు, లేఖన సామగ్రి పొందడానికి అర్హులు (నిబంధన 6.1).
5. కులం, వర్గం, మతం లేదా లింగం కారణంగా వివక్షతలకు ఏ బాలుడు, బాలిక కూడా గురికాకుండా, ఏ ఒక్కరికి కులం, వర్గం, మతం, లింగం కారణంగా అడ్మిషను ఏ ప్రభుత్వ లేదా ప్రయివేటు పాఠశాల కూడా తిరస్కరించకుండా ప్రభుత్వం, స్థానికప్రభుత్వం నిర్ధారించాలి (నిబంధన 6.3).
6. ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు బోధించే వ్యత్యంతర ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి (నిబంధన 6.7). ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు తోడుగా నిలిచే విధంగా వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వాలి (నిబంధన 6.8). ప్రత్యేక అవసరాలుగల పిల్లల గురించి పాఠశాల యాజమాన్య కమిటీలకు, ఇతర పౌరసమాజ సంస్థలకు శిక్షణ ఇవ్వాలి (6.9).
7. పుట్టినప్పటి నుండి 14 ఏళ్ళ వయస్సు వచ్చే వరకు పిల్లలందరి రికార్డును ఇంటింటి సర్వే ద్వారా స్థానిక అథార్టీ తన పరిధిలో నిర్వహించాలి. పైతరగతికి వెళ్లేవారి వివరాలు, అభ్యసన సాధన, హాజరు, నమోదు, పర్యవేక్షణ కోసం ప్రతిఒక్కరికీ ఒక ప్రత్యేక సంఖ్యను కేటాయించాలి (నిబంధన 7.1).
8. పాఠశాలల్లో కేవలం పిల్లల విద్యా విషయక ప్రగతినే కాకుండా వారి నిలకడ, స్థాయిల వారీగా ఆశించిన మార్పులు సాధించడం, వలసలను అరికట్టడం వంటి అంశాలను పర్యవేక్షించడానికి చైల్డ్ ట్రాకింగ్ విధానాన్ని అవలంభించాలి (నిబంధన 7.2).
9. పిల్లలను తరగతి గదుల్లో ఇతర పిల్లల నుండి వేరుచేయడం, వేరుగా చూడటం కాని చేయకూడదు. ఇతర పిల్లలకు కేటాయించిన సమయం, స్థలం కాకుండా వేరే సమయం, స్థలం కేటాయించడం చేయకుండా నిర్ధారించాలి (నిబంధన 8.1).
10. పాఠ్యపుస్తకాలు, యూనిఫారంలు, గ్రంథాలయం, ఐసిటి సౌకర్యాలు, పాఠ్యేతర కార్యకలాపాలు, క్రీడలు వంటి వాటి విషయంలో ఏ విధంగానైనా ఇతర పిల్లలనుండి వేరుగా చూడకూడదు (నిబంధన 8.2).
11. బాలుడు, బాలిక సంబంధిత సమీప ప్రాంతానికి చెందినట్లు రుజువుగా రేషన్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, కరెంటు బిల్లు, ఇంటి పన్ను రసీదు, టెలిఫోన్ బిల్లులో దేనినైనా స్వీకరించొచ్చు. (నిబంధన 9.1).
12. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్పర్సన్ తన పరిధిలోని ప్రత్యేక పాఠశాలలు, ప్రతి ప్రయివేట్ పాఠశాల వివరాలతోపాటు సమీప ప్రాంతంలో ఉన్న బలహీనవర్గాలు, అననుకూల బృందాలకు చెందిన పిల్లల జాబితా నిర్వహించాలి (నిబంధన 9.3).
13. రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం ద్వారా నెలకొల్పబడి లేదా నియంత్రణలో ఉన్న అన్ని పాఠశాలల మొత్తం వార్షిక రికరింగ్ ఖర్చును అలాంటి పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్యతో భాగించగా వచ్చిన ఒక్కొక్క పిల్లవాడి ఖర్చుగా భావించి రాష్ట్ర ప్రభుత్వం తమ స్వంత నిధులు లేదా కేంద్ర ప్రభుత్వం నుండి పొందిన నిధుల నుండి ఖర్చు చేయాలి (నిబంధన 10.1).
14. పాఠశాలలో ప్రవేశం కోసం జనన మరణ రిజిస్ట్రేషన్ చట్టం 1886 ప్రకారం ధృవీకరణ పత్రం పొందలేకపోయినపుడు (1) వైద్యశాల లేదా ఎఎన్‌ఎం రిజిస్టరు రికార్డు. (2) తల్లి,తండ్రి, సంరక్షకుడు ఇచ్చిన స్వీయ ప్రకటనతో పాఠశాలలో ప్రవేశం కల్పించాలి. ప్రవేశం పొందిన ఆరు నెలల్లోపు కంపిటెంట్ అథార్టీ నుంచి జనన ధృవీకరణ పత్రం తీసుకొని సమర్పించొచ్చు. (నిబంధన 12).
15. సాధారణ కాలవ్యవధి ముగిసినప్పటి నుంచి 3 నెలల వరకు ప్రవేశ అవకాశాన్ని పొడిగించొచ్చు. (నిబంధన 13).
16. పాఠశాల గుర్తింపుకోసం జిల్లా విద్యాశాఖాధికారికి దరఖాస్తు సమర్పించాలి (14).
17. చట్టం ప్రకారం విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి లేకపోయినా చట్టం అమలులోకి వచ్చిన తేదీ నుండి ఆరు నెలల వరకు పాఠశాల నడపడానికి జిల్లా విద్యాశాఖాధికారి అనుమతిస్తూ తాత్కాలిక ధృవీకరణ పత్రాన్ని జారీచేయాలి (నిబంధన 15.1)
18. చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత గుర్తింపు ధృవీకరణ పత్రం పొందకుండా నూతన పాఠశాలను నెలకొల్పకూడదు (నిబంధన 15.3).
19. చట్టంలోని ప్రమాణాలు కొనసాగించడం, నిబంధనలు పాటించడం, గుర్తింపు షరతులను అనుసరించడంలో పాఠశాల విఫలమైనప్పుడు గుర్తింపు పత్రాన్ని జారీచేసే అధికారి షోకాజ్ నోటీస్ ఇచ్చి, వివరణ పొంది, తర్వాత గుర్తింపు రద్దు ఉత్తర్వులను రాత పూర్వకంగా ఇవ్వాలి (నిబంధన 16.1).
20. అన్‌ఎయిడెడ్ పాఠశాలలు తప్ప ప్రతి పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు చేయాలి. ఈ కమిటీని ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి పునరుద్ధరించాలి. (నిబంధన 19.1).
21. పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసి) ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి (నిబంధన 20.1).
22. ప్రయివేటు అన్‌ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల విషయంలో వేతనం, అలవెన్సులు వారి సర్వీస్ నిబంధనలు అమలులో ఉన్న శాసన నిర్మితం, నిబంధనల మేరకు పాఠశాల యాజమాన్యం నిర్ధారిస్తుంది (నిబంధన 21).
23. ఉపాధ్యాయుల అభ్యసనాభివృద్ధి కార్యక్రమం లేదా ఇతర కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రతి విద్యార్థి క్యుములేటివ్ రికార్డ్ నిర్వహించాలి. ఇది చదువు పూర్తయినట్లు ఇచ్చే ధృవీకరణ పత్రానికి ఆధారమవుతుంది. (నిబంధన 22.1).
24. ఉపాధ్యాయులు రెగ్యులర్ బోధనకు ఆటంకం కలగకుండా తనకు కేటాయించిన (అ) శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనడం, (ఆ) పాఠ్యప్రణాళిక రూపకల్పన, సిలబస్, శిక్షణ మాడ్యూల్స్, పాఠ్యపుస్తకాలు మెరుగు పరచడంలో పాల్గొనడం (నిబంధన 22.2).
25. పాఠశాల యాజమాన్య కమిటీ పాఠశాలలోని ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించే ప్రాథమిక వేదిక (నిబంధన 23.1).
26. రెగ్యులర్ బేసిస్ పై ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి (నిబంధన 24.3)
27. పాఠశాలల్లో వేతనం చెల్లిస్తూ ఉపాధ్యాయులను డెప్యుటేషన్ ద్వారా వారిసేవలను ఇతర కార్యాలయాలు లేదా సంస్థలు వినియోగించుకొంటున్న సందర్భాల్లో అలాంటి డెప్యుటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి (నిబంధన 24.4).
28. రాష్ట్ర విద్యావిషయక అథార్టీగా రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణా మండలి (ఎస్‌సిఇఆర్‌టి) వ్యవహరించాలి (నిబంధన 25.1).
29. మాధ్యమిక విద్య పూర్తయిన నెలలోపు మాధ్యమిక విద్యను పూర్తిచేసినట్లు ధృవీకరణ పత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇవ్వాలి (నిబంధన 26.1).
30. రాష్ట్ర ప్రభుత్వం విద్యా హక్కు పరిరక్షణ అథార్టీని ఏర్పరస్తుంది. ఇది బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ ఏర్పడేంత వరకు అమలులో ఉంటుంది (నిబంధన 27.1).
31. రాష్ట్ర సలహా మండలి ఏర్పాటు చేయాలి.
32. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల విద్యా కమిషనర్ అండ్ డైరెక్టర్ జారీ చేసి ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలు, నియమాలు, నిబంధనలు, ఎక్సిక్యూటల్ సూచనలు మొదలైనవి ఈ నియమాలతో పొంతన లేనప్పుడు అవి ఆ మేరకు రద్దయినట్లుగా భావించాలి (నిబంధన 29.1)

రేపు : బాలల హక్కులు

సంపాదకీయం

తక్షణం పార్లమెంట్

ఏప్రిల్ 22న పహల్గాంలో అమాయకులైన టూరిస్టులపై ఉగ్రదాడి, తదనంతరం మే 7న భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో భారత పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తత తీవ్రమై యుద్ధ వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో శనివారంనాడు ఇరు దేశాల డిజిఎంఓలు కాల్పుల విరమణ ప్రకటన చేయడం సానుకూల పరిణామం. అయితే, ఆ ప్రకటన సిరా ఆరకమునుపే సరిహద్దు ప్రాంతాల్లో పాక్ కాల్పులకు పాల్పడడం, భారత దళాలు వాటిని తిప్పికొట్టడం వంటి చర్యలతో ఉద్రిక్తత కొనసాగుతూనే వుందని స్పష్టమవుతోంది. సోమవారంనాడు ఇరు దేశాల డిజిఎంఓల మధ్య చర్చలు జరిగినా అవి చాలా ప్రాథమికమైనవే. ఇవి మరింత ముందుకుపోయి సరిహద్దులో సంపూర్ణ శాంతియుత పరిస్థితులు ఏర్పడాలన్నది ప్రజల ఆకాంక్ష. అయితే, అటు పాకిస్థాన్‌లో ముస్లిం ఛాందస శక్తులు చెప్పినట్టు ఆడే ప్రభుత్వం, ఇటు భారత్‌లో హిందుత్వ శక్తుల నేతృత్వంలోని సర్కారు వున్న నేపథ్యంలో ఆ ఆకాంక్ష ఎంతవరకు నెరవేరుతుందో మరి! ఏది ఏమైనప్పటికీ అది ఏ రూపంలో వున్నా ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందే!

ఇరు దేశాలమధ్య కాల్పుల విరమణ ప్రకటన రావడానికి ముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించడంతో కీలకమైన ద్వైపాక్షిక వివాదంలో అగ్ర రాజ్యం పెత్తనం బట్టబయలైంది. 'మధ్యవర్తిత్వం చేశాం. ఒక రాత్రంతా సుదీర్ఘ చర్చలు జరిపాం' అంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తుతుండగానే ఆదివారం మరో వివాదాస్పద పోస్టు చేశారు. తాజా పోస్టులో ఆయన కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తానని పేర్కొనడం మరింత వివాదాస్పదంగా మారింది. ద్వైపాక్షిక అంశంలో అమెరికా జోక్యం అంతటా చర్చనీయాంశంగా మారింది. ఇంటా బయటా ఈ విషయమై విమర్శలు వెల్లువెత్తడంతో భారత ప్రభుత్వం నష్ట నివారణ చర్యలకు పూనుకున్నట్లు కనిపిస్తోంది. ఆదివారంనాడు సైనిక దళాల ప్రధానాధికారి (సిఒఎఎస్) సమీక్షించి, పాకిస్తాన్ ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడిన పక్షంలో తగిన చర్యలు తీసుకునేందుకు సైనిక కమాండర్లకు పూర్తి అధికారాలు అప్పగించారన్న ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశంలో ప్రధాని మోడీ ఆపరేషన్ సిందూర్‌తో పాటు పిఓకే అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారని ప్రభుత్వ వర్గాలు మీడియాకు తెలిపాయి. ఆ వర్గాలు చెప్పిన సమాచారం ప్రకారం 'అటు నుండి తుపాకి గుళ్లు వస్తే.. ఇటు నుండి మిసైల్స్ ప్రయోగించాలి అని మోడీ చెప్పారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ అంశంపై మధ్యవర్తులు అవసరం లేదు' అని అన్నారనీ, ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా పాకిస్తాన్‌కు మరో మార్గం లేదనీ ప్రధాని ఈ సమావేశంలో అన్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసి పోలేదు. పాక్ దాడికి దిగితే, భారత్ ఎదురు దాడి చేస్తుంది.' అని ఆయన అన్నారని మీడియాకు వెల్లడించారు. సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోనూ గంభీర వచనాలే!

ఇన్ని మాటలు చెప్పిన ప్రధాని లేదా భారత విదేశాంగ శాఖ అమెరికా జోక్యం గురించి స్పష్టం చేయకపోవడం వాస్తవాలను దాచిపెట్టడం, తద్వారా ప్రజలను వంచించడమే అవుతుంది. ఇప్పటికైనా భారత ప్రభుత్వం ఈ విషయంలో జరిగిందేమిటో ముఖ్యంగా అమెరికా పాత్ర ఏమిటో నిజాలు వెల్లడించాలి. భారత్ పాక్ మధ్య ద్వైపాక్షిక అంశాలను ఇరు దేశాలే పరిష్కరించుకుంటాం తప్ప మూడోవారి జోక్యాన్ని అనుమతించబోమని ఎన్నో దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానానికి కట్టుబడి వ్యవహరిస్తామని దేశ ప్రజలకు హామీనివ్వడం అవసరం. ఈనాడున్న విపత్కర పరిస్తితులపై దేశ ప్రజలందరికీ ఉమ్మడి అభిప్రాయం ఏర్పడడం అవసరం. అందుకు ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదిక పార్లమెంటు కనుక కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటు అత్యవసర సమావేశం నిర్వహించాలి. అన్ని విషయాలూ సమగ్రంగా చర్చించాలి. జమ్ము కాశ్మీర్‌తో సహా దేశ ప్రజలంతా ఉగ్రవాదాన్ని ఏకోన్ముఖంగా వ్యతిరేకించిన నేపథ్యంలో ఆ ఐక్యతను మరింత పెంపొందించే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలి తప్ప స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చూడరాదన్నది ప్రజల ఆకాంక్ష.

మంచి మాట

ప్రకృతి శక్తులను మనుషులకు సేవలు అందించేందుకు లొంగదీసుకున్న సైన్సు కార్మికులకు విశ్రాంతి కల్పించలేదా? అందువల్ల వారు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారు కదా. ఈ వైఫల్యం గురించి అందరికన్నా బాగా పెట్టుబడిదారునికే బాగా తెలుసు.

- పాల్ లాఫార్గ్,
ప్రముఖ ఫ్రెంచి మార్క్సిస్టు మేధావి, కారల్ మార్క్స్ అల్లుడు.

పశ్చిమ ఆఫ్రికాలో సామ్రాజ్యవాదం


ప్రభాత్ పట్నాయక్

గతంలో ఫ్రాన్స్ దేశానికి వలసలుగా ఉండిన ఆఫ్రికా దేశాలు ఇప్పటికి కూడా పూర్తిగా వలస పెత్తనం నుండి బైట పడలేదు. తనకు వలసలుగా ఉండిన దేశాలకు స్వాతంత్ర్యం ప్రకటించినప్పటికీ, ఆ యా దేశాలలో ఉన్న తన ఆస్తుల రక్షణ నిమిత్తం అక్కడ ఫ్రెంచి సైన్యాలను మోహరించాలని ఫ్రాన్స్ పట్టుబట్టింది. అందుకు ఆ దేశాల ప్రభుత్వాలు అంగీకరించాయి కూడా. దాంతో ఆ దేశాలలోని అంతర్గత రాజకీయ వ్యవహారాలలో జోక్యం చేసుకోడానికి ఫ్రాన్స్‌కు అమితమైన అవకాశం దొరికింది. దాంతోబాటు, ఈ దేశాలన్నీ సి.ఎఫ్.ఎ ఫ్రాంక్ (సెంట్రల్ ఆఫ్రికన్ ఫ్రాంక్)ను ఉమ్మడి కరెన్సీగా అంగీకరించాయి. ఈ సి.ఎఫ్.ఎ ఫ్రాంక్ ఫ్రెంచి కరెన్సీ అయిన ఫ్రాంక్ తో స్థిరమైన మారకపు రేటును కలిగివుంటుంది. ఈ స్థిరమైన మారకపు రేటును కొనసాగించాలంటే ఆ దేశాల ద్రవ్య విధానాన్ని ఫ్రెంచి సెంట్రల్ బ్యాంక్ కంట్రోల్‌లో ఉంచడానికి అంగీకరించాలి. ద్రవ్య విధానాన్ని ఆర్థిక విధానం నుండి వేరు చేయడం సాధ్యం కాదు. అంటే ఆచరణలో ఆ దేశాల ఆర్థిక విధానాలను చాలా మేరకు ఫ్రాన్స్ నిర్దేశిస్తూ వుంటుంది. ఫ్రాన్స్ యూరోపియన్ యూనియన్ ఆర్థిక వ్యవస్థతో కలిసిపోయినప్పుడు కూడా ఈ ఆఫ్రికన్ దేశాలపై ఫ్రాన్స్ నియంత్రణ కొనసాగుతూనే వుంది.

అందుచేత ఈ పూర్వపు ఫ్రెంచి వలసలైన ఆఫ్రికన్ దేశాల స్వతంత్రం చాలా పరిమితులకు లోబడి నడుస్తోంది. ఒకవేళ ఏ దేశంలోనైనా విప్లవకారులు అధికారంలోకి వచ్చి ఈ ఫ్రెంచి చట్రాన్నుంచి విడగొట్టుకోడానికి ప్రయత్నిస్తే. ఆ దేశం మీద ఫ్రాన్స్ పలు రూపాలలో నయా ఉదారవాద ఆంక్షలను విధించి ముందడుగు పడకుండా నిరోధిస్తుంది. ఇందుకు అమెరికా మద్దతు ఎప్పుడూ ఉండనే వుంది.

బుర్కినా ఫాసో లో థామస్ సంకారా అనే విప్లవకారుడు అధికారంలోకి వచ్చినప్పుడు అతడు తన దేశం నుండి ఫ్రెంచి సైన్యాలు ఖాళీ చేయాలని ఆదేశించాడు. అప్పుడు అతడిని స్వంత పార్టీకి చెందిన వ్యక్తులే కుట్రపూరితంగా హత్య చేశారు. ఈ కుట్ర వెనుక ఫ్రెంచి సైనిక దళాల పాత్ర, ఫ్రెంచి ప్రభుత్వ మద్దతు ఉన్నాయని వేరే చెప్పనక్కరలేదు. అయితే నయా వలస ఆధిపత్యాన్ని ఎదిరిస్తూ ఈ దేశాలలో పోరాటాలు కొనసాగుతూనే వచ్చాయి. అటువంటి ప్రతిఘటన తరచూ సైనిక దళాలలోకి రిక్రూట్ చేయబడ్డ స్థానిక సాయుధ దళాల నుండి వచ్చింది. పి.ఎం.ఎస్.ఆర్ (పేట్రియాటిక్ మూవ్‌మెంట్ ఫర్ సేఫ్‌గార్డ్ అండ్ రెస్టొరేషన్) అనే సంస్థ 2022లో బుర్కినా ఫాసో లో ఏర్పడింది. దీనికి కెప్టెన్ ఇబ్రహీం ట్రావ్‌రె నాయకుడు. ఇతడు 2022 సెప్టెంబర్ 30న దేశంలో అధికారానికి వచ్చాడు. ఆ వెంటనే ఫ్రెంచి సైన్యాలను దేశం నుండి ఖాళీ చేయమని ఆదేశించాడు. ఖాళీ చేయించడంలో కృతకృత్యుడయాడు కూడా. తన దేశం చిక్కుకు పోయిన సి.ఎఫ్.ఎ ఫ్రాంక్ ఏర్పాటు వల నుంచి బైటకు తెచ్చి ఆ ఏర్పాటుకు ముగింపు పలికాడు. తమ పొరుగు దేశాలైన మాలి, నైగర్ లలో ఉన్న ప్రభుత్వాలు కూడా వలసాధిపత్యం నుంచి పూర్తి స్థాయి విముక్తి కోరుకుంటున్నందున వాటితో కలిసి అసోసియేషన్ ఆఫ్ సాహెల్ స్టేట్స్ (ఎ.ఇ.ఎస్)ను ఏర్పాటు చేశాడు. ఆ ఉమ్మడి ఒత్తిడికి ఆ రెండు దేశాల నుండి కూడా ఫ్రెంచి, అమెరికన్ సైన్యాలు వైదొలగక తప్పలేదు. వాటితోబాటు నైగర్‌లో ఏర్పాటు చేసిన పెంటగాన్ డ్రోన్ కేంద్రాన్ని కూడా మూత వేయవలసి వచ్చింది. ఆ ప్రాంతం యావత్తూ ఖనిజ సంపదతో కూడి వుంది. అటువంటి చోట ఈ ఎ.ఇ.ఎస్ ఏర్పడి స్వతంత్రతను స్థిరపరచుకునేందుకు పూనుకోవడం సామ్రాజ్యవాదానికి కాల్లో ముల్లు మాదిరిగా ఉంది.

> **రానున్న రోజుల్లో ఒకవైపు సామ్రాజ్యవాదం, మరోవైపు ఆఫ్రికాలో వలస పీడన నుండి విముక్తి కోసం పోరాడుతున్న శక్తులు తీవ్రంగా ఘర్షించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆ ఘర్షణలకు ఆఫ్రికా ఖండం వేదిక కానున్నది.**

> **పాత ఫ్రెంచి సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు తోడు, తాజాగా డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడెక్కడున్న ముడి ఖనిజ సంపదనూ కొల్లగొట్టడానికి తహతహలాడడం ఆఫ్రికాలో కీలక పాత్ర పోషిస్తుంది.**

ఈ ఖనిజ సంపదలో బంగారం ఒక ముఖ్యమైన వనరు. ఆఫ్రికాలోకెల్లా అత్యధికంగా బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్న దేశం బుర్కినా ఫాసో. 2024లో ఆ దేశం 57 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసింది. కాని ఆ దేశ ప్రజలకు ఆ బంగారం వలన ఎటువంటి ప్రయోజనమూ దక్కలేదు. అక్కడి బంగారపు గనులు విదేశీ కంపెనీల పెత్తనంలో ఉండడమే దానికి కారణం. ఆ బంగారం ఉత్పత్తి నుంచి వచ్చే ఆదాయం దాదాపుగా ఆ విదేశీ కంపెనీలకే చెందుతుంది. అక్కడ ఉన్న పేట్రియాటిక్ ప్రభుత్వం 2024లో ఎస్.ఒ.పి.ఎ.ఎం.ఐ.బి అనే ఒక ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేసింది. బంగారపు ఖనిజాన్ని వెలికి తీసే ప్రైవేటు విదేశీ కంపెనీలను క్రమంగా స్వాధీనపరుచుకోడానికి దీనిని ఏర్పాటు చేశారు. తద్వారా వచ్చే ఆదాయంలో అధిక భాగాన్ని బుర్కినాబె ప్రజలకు విద్య, వైద్యం అందించడానికి ఖర్చు చేశారు. ఈ మధ్య డాలర్ భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడం, తమ సంపదను ఇన్నాళ్ళూ డాలర్ల రూపంలో దాచుకున్నవాళ్ళు ఇప్పుడు బంగారం రూపంలో దాచుకోడానికి సిద్ధమౌతూవుండడంతో బంగారం ధర పెరుగుతోంది. ఈ పరిస్థితిని బుర్కినా ఫాసో ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉపయోగించుకోడానికి ప్రయత్నిస్తోంది. అక్కడి నుంచి ఫ్రెంచి సైన్యాలను వెళ్ళగొట్టిన అనంతరం ఆ దేశం మీద సామ్రాజ్యవాదులు విధించిన ఆంక్షల ప్రభావాన్ని తగ్గించడానికి కూడా ఉపయోగపడుతోంది.

ఇక్కడితో అయిపోలేదు. ట్రావ్‌రె ప్రభుత్వం తన దేశంలో ఒక బంగారం శుద్ధి చేసే కర్మాగారాన్ని కూడా స్థాపించింది. తద్వారా బంగారు ఆభరణాల, వస్తువుల తయారీని కూడా నియంత్రించగలుగుతోంది. అంతేగాక వ్యవసాయోత్పత్తులను కూడా ప్రాసెస్ చేసే పరిశ్రమలను స్థాపించింది. మరోవైపు దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగుతోంది.

ఈ చర్యలన్నీ అమెరికా ఆగ్రహానికి కారణం కావడం ఊహించలేనిదేమీ కాదు. అమెరికా కు చెందిన ఆఫ్రికా కమాండ్ (ఆఫ్రికామ్) చీఫ్ అయిన జనరల్ మైకేల్ లాంగ్‌లే అమెరికన్ సెనేట్ కమిటీ ముందు వాంగ్మూలమిస్తూ ఇబ్రహీం ట్రావ్‌రె బంగారం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని తమ స్వంతానికి, స్వంత భద్రతను మరింత పటిష్టం చేసుకోడానికి దారి మళ్ళిస్తున్నాడని విషపూరితంగా ఆరోపించాడు. ఈ వ్యాఖ్యానాలను మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది. అయితే యావత్తు ఆఫ్రికాలోని ప్రజానీకం లాంగ్‌లే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బహుశా లాంగ్‌లే ఈ విధంగా వ్యాఖ్యానం చేయడం వెనుక అసలు లక్ష్యం ట్రావ్‌రేను పదవీచ్యుతుడిని చేయడానికి పన్నిన కుట్రను సమర్థించుకోవడమే అయివుండొచ్చు. లాంగ్‌లే ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే ఏప్రిల్ 16న ఒక కుట్ర ప్రయత్నం జరిగింది. పశ్చిమ దేశాల మీడియాలో ఊరూ పేరూ లేకుండా పలు రాతలు వెలువడ్డాయి. అవన్నీ ట్రావ్‌రె ప్రభుత్వం నియంతృత్వ ప్రభుత్వం అని, బుర్కినా ఫాసోలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని అవాస్తవాలతో నిండివున్నాయి. అయితే, ఆ కుట్ర భగ్నం అయింది. కుట్రదారులు అరెస్టయ్యారు. అందుచేత సంకారా కు పట్టిన గతి ట్రావ్‌రేకు పట్టలేదు.

ఒక ఆఫ్రికన్ ప్రభుత్వం వలసవాదుల ఉచ్చు నుండి బైట పడడానికి ప్రయత్నించినప్పుడు అందుకు పూనుకున్న ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా కూలగొట్టడానికి సామ్రాజ్యవాదం ప్రయత్నించడం అన్నది ఊహించలేని విషయం ఏమీ కాదు. అందరికీ తెలిసిన పాత చింతకాయ పచ్చడి లాంటిదే ఈ ప్రయత్నం. అయితే ఆఫ్రికన్ దేశాలు వలసవాద ఉచ్చు నుండి బైట పడడం అనేది ఎన్ని కష్టాలతో కూడుకుందో ఇది తెలియజేస్తోంది. బుర్కినా ఫాసో ప్రభుత్వం ఒక వైపు సామ్రాజ్యవాద కుట్రలను ఎదుర్కొంటూనే మరోవైపు ఇస్లామిక్ ఉగ్రవాదుల తిరుగుబాటును కూడా ఎదుర్కోవలసి వస్తోంది. వాళ్ళ చేతుల్లో దాదాపు 40 శాతం భూభాగం ఉంది. చుట్టుపక్కల పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాలు ఉన్నాయి. ఆ దేశాల్లో ఒక మొక్కుబడిగా ఎన్నికలు జరుగుతూ వుంటాయి. అందులో ప్రజలకు నిజంగా ప్రాతినిధ్యం వహించే సంస్థలేవీ పాల్గొనవు. కాని ఆ ప్రజలు మాత్రం ఓట్లు వేస్తారు. ఎవరు ఎన్నికైనా వాళ్ళు సామ్రాజ్యవాదులకు తొత్తులుగా వ్యవహరిస్తారు. అటువంటి తొత్తు ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని తమ అధికారాన్ని ప్రశ్నించే దేశాలమీద ఆంక్షలను ప్రయోగించడం సామ్రాజ్యవాదుల ఎత్తుగడల్లో ఒక భాగం.

అందులో భాగంగానే బుర్కినా ఫాసో కు వ్యతిరేకంగా ఎకనామిక్ కమ్యూనిటీ ఆఫ్ వెస్ట్ ఆఫ్రికన్ స్టేట్స్ (ఇ.సి.ఒ.డబ్ల్యు.ఎ.ఎస్) ను దింపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి ఆ కూటమి బుర్కినా ఫాసో మీద ఆర్థిక ఆంక్షలను ప్రయోగిస్తానని బెదిరించింది (సామ్రాజ్యవాదుల తొత్తుగా ఉండే 'ప్రజాస్వామ్య' ప్రభుత్వాన్ని కూలదోసి ప్రస్తుత బుర్కినా ఫాసో ప్రభుత్వం ఏర్పడింది). కాని ఇబ్రహీం ట్రావ్‌రె ప్రభుత్వానికి గట్టి ప్రజా మద్దతు ఉంది. ప్రభుత్వానికి మద్దతుగా భారీ సంఖ్యలో ప్రజలు వీధుల్లో ప్రదర్శనలు చేశారు. ఇకోవాస్ నుండి విడగొట్టుకుని ఎ.ఇ.ఎస్ ఏర్పడింది. గతంలో సంకారా మీద కుట్రకు పాల్పడిన మూకలు పొరుగునే ఉన్న ఐవరీ కోస్ట్ అనే దేశానికి పోయి అక్కడ తల దాచుకుంటున్నాయి. ఫ్రాన్స్ పనుపున బుర్కినా ఫాసోలో కుట్రలు చేయడానికి స్థావరంగా ఐవరీ కోస్ట్ ఉపయోగపడుతోంది. ఇప్పుడు విఫలమైన ఏప్రిల్ కుట్రలో పాల్గొన్న మూకలు కూడా ఐవరీ కోస్ట్ లోనే తల దాచుకున్నాయి.

ఇన్ని కష్టాల నడుమ వలసవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి యావత్తు పశ్చిమ ఆఫ్రికా లోని ప్రజానీకమూ పూర్తి మద్దతును అత్యుత్సాహంగా అందిస్తున్నారు. బుర్కినా ఫాసో కు దూరంగా ఉండమని సామ్రాజ్యవాదుల్ని డిమాండ్ చేస్తూ మొత్తం పశ్చిమ ఆఫ్రికా అంతటా ప్రజానీకం రోడ్లపైకి వచ్చి భారీ ర్యాలీలు చేశారు. వారు ఇబ్రహీం ట్రావ్‌రె ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటించారు. గతంలో పాట్రిస్ లుముంబా, ఎమిల్కర్ చాబ్రాల్, ఎడ్వర్డో మాండేన్, థామస్ సంకారా వంటి నేతలు ఏ లక్ష్యం కోసమైతే తమ ప్రాణాలర్పించారో, క్వామే ఎన్‌కుమా, జూలియస్ నైరెరి వంటి నేతలు జీవితాంతమూ ఏ లక్ష్యం కోసం పోరాడారో, ఆ లక్ష్యం నేడు ఆఫ్రికన్ ప్రజల నడుమ మార్మోగుతోంది. ప్రస్తుతం మనం ఆఫ్రికా విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో ఒక నూతన అధ్యాయాన్ని చూస్తున్నాం.

> **గతంలో పాట్రిస్ లుముంబా, ఎమిల్కర్ చాబ్రాల్, ఎడ్వర్డో మాండేన్, థామస్ సంకారా వంటి నేతలు ఏ లక్ష్యం కోసమైతే తమ ప్రాణాలర్పించారో, క్వామే ఎన్‌కుమా, జూలియస్ నైరెరి వంటి నేతలు జీవితాంతమూ ఏ లక్ష్యం కోసం పోరాడారో, ఆ లక్ష్యం నేడు ఆఫ్రికన్ ప్రజల నడుమ మార్మోగుతోంది. ప్రస్తుతం మనం ఆఫ్రికా విముక్తి కోసం జరుగుతున్న పోరాటంలో ఒక నూతన అధ్యాయాన్ని చూస్తున్నాం.**

రాబోయే రోజుల్లో సామ్రాజ్యవాదం మరింత క్రూరంగా ఈ పోరాటాన్ని అణచివేయడానికి ప్రయత్నం చేయడం తథ్యం. పాత ఫ్రెంచి సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు తోడు, తాజాగా డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడెక్కడున్న ముడి ఖనిజ సంపదనూ కొల్లగొట్టడానికి తహతహలాడడం ఆఫ్రికాలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికే కాంగోలోని ప్రభుత్వం చేతులు కలపడంతో ట్రంప్ ప్రభుత్వం ఆ దేశంలోని ఖనిజ సంపదను తన పెత్తనంలోకి తెచ్చుకునేందుకు పథకాన్ని సిద్ధం చేసింది. ప్రపంచం లోని ఖనిజ సంపదను, ముఖ్యంగా ఆధునిక టెక్నాలజీలో, కొత్తగా తలెత్తుతున్న టెక్నాలజీలలో వినియోగించే ఖనిజ సంపదను తన అధీనంలోకి తెచ్చుకోవాలని ట్రంప్ చాలా తొందరపడుతున్నాడు. అందుకే ఉక్రెయిన్ విషయంలో తొందరగా ఒప్పందం కుదుర్చుకోవాలని, గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని, కెనడాను అమెరికా యొక్క 51వ రాష్ట్రంగా చేసుకోవాలని తాపత్రయపడుతున్నాడు. చివరికి సముద్రం అడుగున ఉన్న భూభాగాన్ని కూడా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని అనుకుంటున్నాడు. రష్యా, ఉక్రెయిన్ ల నడుమ శాంతి ఒప్పందం కుదర్చడానికి ఒక నిజాయితీ కలిగిన మధ్యవర్తి పాత్ర పోషిస్తానంటూ ప్రకటించడం వెనుక ఆ రెండు దేశాలలోనూ ఉన్న అపార ఖనిజ నిక్షేపాలను చేజిక్కించుకోవాలనే కాంక్ష ఉంది.

ఏదేమైనా రానున్న రోజుల్లో ఒకవైపు సామ్రాజ్యవాదం, మరోవైపు ఆఫ్రికాలో వలస పీడన నుండి విముక్తి కోసం పోరాడుతున్న శక్తులు తీవ్రంగా ఘర్షించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆ ఘర్షణలకు ఆఫ్రికా ఖండం వేదిక కానున్నది. ఒకవైపు ఆ ఖండపు అపార ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టాలనే సామ్రాజ్యవాదులు, రెండోవైపు తమ ఖండంలోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోడానికి ఆ వనరులను ఉపయోగించాలనుకునే స్థానిక శక్తులు మోహరించి వున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

జనవాక్యం

జీవ వైవిధ్యాన్ని కాపాడుదాం

ఆధునిక నిర్మాణాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో చాలా పక్షి జాతులు నశిస్తున్నాయి. అందులో పిచ్చుకలు అంతరించిపోయే పక్షి జాతుల్లో మొదటి వరుసలో ఉన్నాయి. నగరీకరణ, పల్లెల్లో కూడా మారుతున్న జీవన శైలి, పర్యావరణం వల్ల అంతటా ఈ ప్రమాదం ముంచుకు వస్తోంది. దానికి తోడు వాతావరణంలో మార్పులు, విపరీతమైన ఎండలు, తగ్గుతున్న హరితం వల్ల కూడా అవి అంతరించిపోయే దశ వేగవంతంగా తయారైంది. జీవవైవిధ్యం కోల్పోవడం మరిన్ని కొత్త ప్రకృతిపరమైన ఉపద్రవాలకు కారణభూతమౌతుంది. ఉదాహరణకు కొన్ని పక్షులు కీటకాల సంతతిని అదుపులో ఉంచుతాయి. తద్వారా పంటల పెరుగుదలకు ఊతమిస్తాయి. ఒక పక్షి జాతి లేదా జంతు జాతి నశిస్తే, దానితో పాటు పర్యావరణ సమతుల్యత అదుపు తప్పుతుంది. మరిన్ని విపరిణామాల్ని మానవాళి నెత్తిపై రుద్దుతుంది. కాబట్టి సమాజం అలాంటి విపత్తు రాకుండా జాగ్రత్త వహించాలి. జీవరాశుల ఉనికికి భంగం రానీయకుండా, వాటి మనుగడకు సహకరించాలి. ఉదాహరణకు మండుటెండల్లో ఇంటి ఆవరణలో ఒక మట్టి పాత్రను నీటితో నింపి ఉంచొచ్చు. అది చిన్న పనిలా మనకు అనిపించినా, దాహంతో ఉన్న పక్షికి అదే పెద్ద సాయం. ఒక్కోసారి వాటి ప్రాణం నిలుస్తుంది. అలాగే పూర్వం మన ఇళ్లల్లో, పశువుల శాలల్లో చూరుకి వరి కంకులు వేలాడదీసే వారు. పిచ్చుకలు, ఇతర చిన్న పక్షులు హాయిగా వచ్చి చేరేవి. ఆ అలవాటుని మళ్లీ మనం వాడుకలోకి తీసుకురావాలి. జీవవైవిధ్యం, జీవ సంరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహన కలిగించాలి. వారితో తదనుగుణమైన చర్యలు చేయించాలి. పెద్ద సభల్లో పెద్ద ఉపన్యాసాల కన్నా క్షేత్ర పరిధిలో చిన్న చిన్న సమూహాలకు నేర్పే అలవాట్లు పెద్ద మార్పుని తీసురాగలవు. ఈ బాధ్యత అందరూ తీసుకోవాలి.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

అభిప్రాయం

ఆ రెండు రోజులూ... భయం... టెన్షన్...!

మా కాలేజీ మెస్ ఎప్పటిలా రాత్రి 8 గంటలకి కాకుండా 9 గంటలకి మొదలవుతుందని మే ఏడవ తేదీన వాట్సాప్‌లో మెసేజ్ వచ్చింది. భారత్-పాక్ యుద్ధ సన్నాహాల్లో భాగంగా మాక్ డ్రిల్ కోసం ఇలా చేస్తున్నారన్నది ఆ మేసేజ్ సారాంశం. సరిగ్గా 8:15 నిమిషాలకు మా యూనివర్శిటీ (డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్.ఐ.టి-జలంధర్)లో ఒక్కసారిగా కరెంట్ పోయింది. ఇలా ఎప్పుడూ కాలేదు. ఈ నాలుగేళ్లలో ఇదే మొదటి సారి. మాక్ డ్రిల్ కోసమని సరిపెట్టుకున్నాం. హాస్టల్ మొత్తం ఒకటే అంధకారం. ఓ అర్ధగంటలో మా కాలేజీ పైనుండి ఏదో నిప్పులు చెరుగుతూ వెళ్ళింది. అది దీపావళి టపాసా లేదా పాకిస్తాన్ వదిలిన మిస్సైలా! ఎవ్వరికీ క్లారిటీ లేదు. గంట తర్వాత మళ్ళీ కరెంట్ రాగానే రూమ్ లోపలికి వెళ్లిపోయాం.

జలంధర్ పక్కనే ఉన్న హోషియార్‌పూర్‌లో పాకిస్తాన్ డ్రోన్ శకలాలు దొరికాయని మే 8వ తేదీ ఉదయం న్యూస్‌లో వచ్చింది. మొత్తం స్టూడెంట్స్ గుండెల్లో దడ మొదలైంది. మా ఎన్ఐటి పక్కనే భారత మిలట్రీ శిబిరాలు ఉన్నాయి. కొంత మందిమి వెళ్ళి కాలేజీ 'డీన్ స్టూడెంట్ వెల్ఫేర్'ని కలిసి...మాకు ఇక్కడ సేఫ్టీ కాదు, మమ్మల్ని ఇంటికి పంపించే ప్రయత్నం చెయ్యండి...అని విన్నవించాం. 'స్టూడెంట్స్ సేఫ్టీనే మాకు మొదటి ప్రాధాన్యత, కానీ ఇప్పటి వరకు మన ఎన్.ఐ.టి. సేఫ్ గానే ఉంది, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ఏమైనా నిర్ణయాలు ఉంటే మెయిల్ పంపిస్తామ'ని చెప్పారు. అందరిలోనూ ఆందోళన కొంచెం తగ్గినా, అది ఎక్కువ సేపు నిలవలేదు. జలంధర్‌లో బ్లాకౌట్ అనౌన్స్ చేసినట్లు వాట్సాప్‌లో న్యూస్ వచ్చింది. ఆ రోజు రాత్రి బ్లాకౌట్‌లోనే డిన్నర్ చేసిన కాసేపటికి...మా ఎన్ఐటికి కొంచెం దూరంలో ఏవో నాలుగైదు మిస్సైళ్లు పైకి వెళ్ళాయి. అవి డ్రోన్లన్నారు మా ఫ్రెండ్స్. ఏదైతేనేం? మనకేం కాలేదు కదా అనుకునేలోపే ఆ చిమ్మచీకట్లో పెద్ద పెద్ద పేలుడు శబ్దాలు వినిపించాయి. మా బాల్కనీ నుండి పైకి చూస్తే రెండువైపుల నుంచి ఏవో వచ్చి గుద్దుకుని పేలాయి. భయపడుతూనే ఆకాశ దృశ్యాలను ఫోన్లతో వీడియో తీశాం. స్టూడెంట్లు అందరూ రోడ్ల మీదనే వున్నారు. రాత్రి 9 గంటలకు మొదలై పదిన్నర పదకొండు గంటల వరకూ కాల్పులు జరుగుతూనే ఉన్నాయి.

> **ఆ రోజు రాత్రి బ్లాకౌట్‌లోనే డిన్నర్ చేసిన కాసేపటికి... మా ఎన్ఐటికి కొంచెం దూరంలో ఏవో నాలుగైదు మిస్సైళ్లు పైకి వెళ్ళాయి. అవి డ్రోన్లన్నారు మా ఫ్రెండ్స్. ఏదైతేనేం? మనకేం కాలేదు కదా అనుకునేలోపే ఆ చిమ్మచీకట్లో పెద్ద పెద్ద పేలుడు శబ్దాలు వినిపించాయి. మా బాల్కనీ నుండి పైకి చూస్తే రెండువైపుల నుంచి ఏవో వచ్చి గుద్దుకుని పేలాయి. భయపడుతూనే ఆకాశ దృశ్యాలను ఫోన్లతో వీడియో తీశాం. స్టూడెంట్లు అందరూ రోడ్ల మీదనే వున్నారు. రాత్రి 9 గంటలకు మొదలై పదిన్నర పదకొండు గంటల వరకూ కాల్పులు జరుగుతూనే ఉన్నాయి.**

స్వస్థలాలకు చేరుకోవడానికి బస్‌స్టాండ్‌లో నిలబడిన జలంధర్ విద్యార్థులు

ఈ విషయం చెప్పాలని అమ్మకు ఫోన్ చేశాను. ఫోన్‌లో ఆ భారీ శబ్దాలు విని మా అమ్మ, నాన్న భయపడ్డారు. నేను తీసిన వీడియోలను అమ్మకు షేర్ చేశాను. ఇంతలో డీన్ నుండి మెయిల్ వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో స్టూడెంట్లకి ఇక్కడ సేఫ్ కాదు. కాబట్టి రేపు తెల్లవారి 6 గంటల నుండి కాలేజీ ఖాళీ చేసి మీ సొంత ఊళ్లకు వెళ్లిపోవాలని మెయిల్ సందేశం. ఒక్కసారిగా అందరిలో ఆందోళన మొదలైంది. ఇంత సడన్‌గా సొంత ఊళ్లకు వెళ్లాలంటే ఎలా! ఆందోళన పడుతూనే, ట్రైన్ టికెట్ల కోసం ఆన్‌లైన్‌లో వెతకడం మొదలుపెట్టాం. ఏ డ్రోన్, మిస్సైల్ వచ్చి పడుతోందోనని రాత్రంతా ఒకటే టెన్షన్. ఇంటికి ఎలా వెళ్లాలి? పంజాబ్ వాళ్లకు ట్రాన్స్‌పోర్టు పరవాలేదు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు సుమారు 20 రాష్ట్రాల వారు ఇక్కడ చదువుతున్నారు. పంజాబీ ఫ్రెండ్స్ తమ ఇళ్లకు రమ్మని నన్ను అడిగారు. కానీ అప్పటికే పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, భటిండా, అమృత్‌సర్‌లో ఈ దాడులు తీవ్రంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అక్కడ ఉండడం సేఫ్ కాదని, ఇంటికి వైజాగ్ వెళ్లాలని నిర్ణయించుకున్నాను. రిజర్వేషన్ లేదు కాబట్టి ముందు ఇక్కడ నుండి బయట పడాలనే ఉద్దేశంతో ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌లో జాబ్ చేస్తున్న అక్క దగ్గరకు వస్తానని ఫోన్ చేసి చెప్పాను. అర్ధరాత్రి దాటింది. రాత్రంతా టెన్షన్, భయంతో నిద్ర పట్టలేదు. బ్యాగు సర్దుకుని తొమ్మిదవ తేదీ ఉదయం 5 గంటలకే జలంధర్ రైల్వేస్టేషన్ చేరుకున్నాను. స్టేషన్ మొత్తం స్టూడెంట్లతో కిక్కిరిసిపోయింది. జలంధర్‌లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీలన్నీ ఇదే విధంగా ప్రకటించాయి. ఏ స్టూడెంట్‌ను చూసినా భయంతో తల్లిదండ్రులతో మాట్లాడుతూ కనిపించారు. లలిత్‌పూర్ ట్రైన్ రాగానే జనరల్ బోగిల్లో ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడ అమ్మాయిలం, అబ్బాయిలం అంతా ఎక్కేశాం. కొంతమంది ఢిల్లీ వెళ్లి ఫ్లైట్, ఇతర రవాణా మార్గాల ద్వారా బయల్దేరారు.

యుద్ధం అంటే బుక్స్‌లో చదువుకోవడం, సినిమాల్లో, న్యూస్‌లో చూడడమే. కానీ ప్రత్యక్షంగా నేనున్న ప్రాంతంలోనే అలాంటి వాతావరణం చూసి ఒకవైపు ఆందోళన, మరోవైపు భయం! యుద్ధం ఎక్కడ జరిగినా ప్రాణ భయం, ప్రాణ నష్టం తప్ప ఏమీ సాధించలేమని అనుకున్నంతలోనే మన సైనికులు మృత్యువాత పడిన వార్తలను చూసి చాలా బాధపడ్డాను. భారత ప్రభుత్వం ఎందుకు యుద్ధం చేస్తోందో? ఉగ్రవాదులను పట్టుకోవాలంటే యుద్ధం ఒక్కటే మార్గమా? అనుకుంటూ ఆ రోజు రాత్రి 10 గంటలకు లలిత్‌పూర్‌లోని మా అక్క దగ్గరకు చేరుకున్నాను. మరో వారం రోజుల్లో ఫైనల్ ఎగ్జామ్స్ రాసి బి.టెక్ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్ళాల్సిన టైంలో ఇలా జరిగిందేమిటా? అనుకున్నాను. మాలాంటి స్టూడెంట్ల కోసం ఎస్.ఎఫ్.ఐ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి ఢిల్లీలో షెల్టర్ ఇస్తుందని సోషల్ మీడియాలో చూసి మిత్రులకు షేర్ చేశాను.



- రిఖిల్,
బి.టెక్ విద్యార్థి, ఎన్.ఐ.టి, జలంధర్.

దలాల్ స్ట్రీట్ జిగేల్

- సెన్సెక్స్ 3000 పాయింట్ల పరుగు
- పెరిగిన రూ.16 లక్షల కోట్ల సంపద
- కాల్పుల విరమణతో మద్దతు
- యుఎస్- చైనా మధ్య టారిఫ్ ఒప్పందం ప్రభావం

ముంబయి: భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం దలాల్ స్ట్రీట్‌ను జిగేల్ మనిపించింది. మరోవైపు అమెరికా, చైనా వాణిజ్య చర్చలు, రష్యా,ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ చర్చల్లో పురోగతి అంశాలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 2975 పాయింట్లు లేదా 3.7 శాతం పెరిగి రూ.82,429.90కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ916 పాయింట్లు లేదా 3.8 శాతం లాభంతో 24,925 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 3000 పైగా పాయింట్లు పెరిగింది. 2024 డిసెంబర్ 16 తర్వాత సూచీలు ఈ స్థాయిని చేరుకోవడం ఇదే తొలిసారి. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.16 లక్షల కోట్లు పెరిగి రూ.432 లక్షల కోట్లకు చేరింది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చల్లారాడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. సెన్సెక్స్ శుక్రవారం ముగింపు 79,454తో పోల్చితే సోమవారం ఉదయం 80,804 వద్ద ప్రారంభమైన సూచీ.. ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. ఇంట్రాడేలో 3,000 పాయింట్లకు పైగా లాభంతో 82,495.97 వద్ద గరిష్ఠాన్ని తాకింది. బిఎస్ఇ మిడ్ క్యాప్ 3.85 శాతం, స్మాల్ క్యాప్ 4.18 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీలో అన్ని రంగాలు పరుగులు పెట్టాయి. ఐటి, రియాల్టీ సూచీలు ఏకంగా 6.7 శాతం, 5.9 శాతం చొప్పున రాణించాయి. లోహ, ఎనర్జీ, బ్యాంకింగ్, కన్స్యూమర్ డ్యూరెబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసిజి రంగాలు 5.8 శాతం వరకు పెరిగాయి. గడిచిన ఐదేళ్లలో ఒక్కరోజులో ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్ మినహా మిగిలిన షేర్లు లాభాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా షేర్లు గరిష్టంగా 7.6 శాతం వరకు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ చమురు 65 డాలర్లుగా, బంగారం ఔన్సు 3222 డాలర్ల వద్ద నమోదయ్యాయి. భారత్, పాకిస్థాన్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడం మార్కెట్లకు కలిసివచ్చిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు అమెరికా, చైనా మధ్య వాణిజ్య వివాదం ఓ కొలిక్కి రావడం, ఎఫ్ఐఐ కొనుగోళ్ల మద్దతు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపిందన్నారు.

10 భారతీయ ఉపగ్రహాల పహారా

ఇస్రో చైర్మన్ వి.నారాయణన్

ఇస్రో : పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశ సరిహద్దుల తీరప్రాంతాన్ని పర్యవేక్షించడానికి, రక్షించడానికి 10 భారతీయ ఉపగ్రహాలు 24 గంటలు నిర్విరామంగా పనిచేస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. కీలకమైన నిఘా డేటాను అందించడం ద్వారా పౌరులను రక్షించడంలో ఉపగ్రహాలు వ్యూహాత్మక పాత్ర పోషిస్తాయని అన్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఆదివారం జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ ప్రసంగించారు. దేశభద్రతను కాపాడుకునేందుకు భారతదేశపు 7,000 కిలోమీటర్ల సముద్ర తీరం, ఉత్తర భూభాగాలపై నిరంతరం నిఘా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తం ఉత్తర భాగాన్ని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. శాటిలైట్లు, డ్రోన్ టెక్నాలజీ లేకుండా భారతదేశం పూర్తి భద్రతా కవరేజీని సాధించలేమని నారాయణన్ స్పష్టం చేశారు. భద్రతాపరమైన అంశాలతోపాటు ఇస్రో ఉపగ్రహాలు వ్యవసాయం, టెలీ-ఎడ్యుకేషన్, టెలీ-మెడిసిన్, వాతావరణ అంచనాలు, పర్యావరణ పర్యవేక్షణ, ఆహార భద్రత వంటి అనేక పౌర సేవల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా విపత్తుల సమయంలో నష్టాన్ని గణనీయంగా తగ్గించడంలో ఉపగ్రహాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. గతంలో విపత్తుల వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోతే నేడు ఆ పరిస్థితి లేదని గుర్తుచేశారు. చంద్రయాన్-1 ద్వారా చంద్రుడిపై నీటి జాడలను కనుగొన్న తొలి దేశంగా భారత్ నిలిచిందని నారాయణన్ ప్రకటించారు. ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను భారత్ విజయవంతంగా ప్రయోగించిందని తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు విక్రమరావు మృతికి సంతాపం

- జర్నలిస్ట్ సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుదీర్ఘకాలం జర్నలిస్ట్ ఉద్యమంలో పనిచేస్తూ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులు కోటంరాజు విక్రమరావు (82) లక్నోలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విక్రమరావు మరణం పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ (ఎన్ఎజె), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎపి బిజెఎ), ఎన్ఎజె తెలంగాణ యూనిట్లు సంతాపం తెలిపాయి. ఐదు దశాబ్దాలుగా జర్నలిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విక్రమరావు జర్నలిస్టుల వేజ్ బోర్డులో, ప్రెస్ కౌన్సిల్‌లో సభ్యులుగా పనిచేశారని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎన్ఎజె అధ్యక్షులు ఎస్‌కె పాండే, సెక్రటరీ జనరల్ ఎన్ కొండయ్య, కోశాధికారి ఎ అమరయ్య, జెండర్ ఈక్విటీ కౌన్సిల్ చైర్‌పర్సన్ కె మంజరి, ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఎపి బిజెఎ కన్వీనర్లు బి శ్రీనివాసరావు, కె మునిరాజ్, తెలంగాణ శాఖ కన్వీనరు ఎంఎ రవూఫ్ ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- 13 మంది దుర్మరణం
- మృతులంతా మహిళలు, చిన్నారులే

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రాయ్‌పూర్ జిల్లాలోని సారగావ్ సమీపంలో రాయ్‌పూర్ - బలోదజార్ రోడ్డుపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 13 మంది మరణించారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు చిన్నారులు, తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. వీరంతా సమీప బంధువులే. చటౌడ్ గ్రామానికి చెందిన వీరంతా బన్సారీ గ్రామంలో ఒక కుటుంబ కార్యక్రమానికి హాజరు కావడం కోసం వెళ్లారు. ఆ కార్యక్రమంలో పాల్గొని వీరంతా ఒక ట్రక్కులో తిరిగి వస్తున్నారు. సారగావ్ సమీపంలో ట్రక్కు ట్రాలర్ ఢీకొన్నాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే పోలీసులు, జిల్లా పరిపాలన అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను రాయ్‌పూర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయ్‌పూర్ జిల్లా కలెక్టర్ గౌరవ్ సింగ్ తెలిపారు.

సలీమాకే పగ్గాలు

- యూరోపియన్ ప్రొ లీగ్‌కు జట్టు ఇదే: హాకీ ఇండియా

భువనేశ్వర్: యూరోపియన్ ప్రొ లీగ్‌లో ఆడే భారత మహిళల హాకీ జట్టును హాకీ ఇండియా(హెచ్ఐ) సోమవారం ప్రకటించింది. 24మంది ఆటగాళ్లతో కూడిన జట్టుకు మిడ్‌ఫీల్డర్ సలీమా తేటే కెప్టెన్‌గా ఎంపికైంది. ఫార్వర్డ్ క్రీడాకారిణి నవ్‌నీత్ కౌర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. జూన్ 14 నుంచి 29వరకు లండన్, యాంట్‌వెర్ప్, బెర్లిన్ వేదికలుగా భారతజట్టు ఈ టోర్నమెంట్‌లలో పాల్గొనుంది. ఆస్ట్రేలియా, అర్జెంటీనా, బెల్జియం, చైనాలతో రెండేసి మ్యాచ్‌లు చొప్పున భారతజట్టు తలపడనుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో భువనేశ్వర్ వేదికగా 9జట్ల మధ్య జరిగిన తొలి ప్రొ లీగ్‌లో భారత్ 8మ్యాచ్‌లు ఆడి 2విజయాలు, రెండు డ్రాలతో సహ 9పాయింట్లతో 6వ స్థానంలో ఉంది.

గోల్‌కీపర్లు: సవిత, బిచ్చుదేవి **డిఫెండర్లు:** సుశీల, జ్యోతి, సుమన్ దేవి, జ్యోతి సింగ్, ఇషికా చౌదరి, జ్యోతి ఛత్రి
మిడ్‌ఫీల్డర్లు: సలీమ(కెప్టెన్), వైష్ణవి, సుజాత కౌర్, మనీషా, నేహా, లాల్‌రిమిసిమి, షర్మిలా దేవి, సునీత టొప్పొ, మహిమా
ఫార్వర్డ్: నవ్‌నీత్ కౌర్(కెప్టెన్), దీపిక, దీపిక షెరాంగ్, బల్జీత్ కౌర్, రుతుజ, బ్యూటీ, సాక్షిరాణా
స్టాండ్‌బై: బన్సారీ సోలంకి(గోల్‌కీపర్), అజ్మినకుజుర్(డిఫెండర్)

షెడ్యూల్...

జూన్ 14 : భారత్ క్ష్మ ఆస్ట్రేలియా (లండన్) సా.3.30గంIIలకు
జూన్ 15 : భారత్ క్ష్మ ఆస్ట్రేలియా (లండన్) సా.3.00గంIIలకు
జూన్ 17 : భారత్ క్ష్మ అర్జెంటీనా (లండన్) రా.8.00గంIIలకు
జూన్ 18 : భారత్ క్ష్మ అర్జెంటీనా (లండన్) రా.8.00గంIIలకు
జూన్ 21 : భారత్ క్ష్మ బెల్జియం (యాంట్‌వెర్ప్) సా.4.30గంIIలకు
జూన్ 22 : భారత్ క్ష్మ బెల్జియం (యాంట్‌వెర్ప్) సా.4.30గంIIలకు
జూన్ 28 : భారత్ క్ష్మ చైనా (బెర్లిన్) సా.5.30గంIIలకు
జూన్ 29 : భారత్ క్ష్మ చైనా (బెర్లిన్) సా.8.30గంIIలకు

గుజరాత్ ప్రాక్టీస్ ప్రారంభం

- ఐపిఎల్ సీజన్-18
- జూన్ 3న ఫైనల్



అహ్మదాబాద్: ఐపిఎల్ పునఃప్రారంభ తేదీలను నిర్వాహకులు ప్రకటించడానికి ముందే గుజరాత్ టైటాన్స్ సాధనను మొదలు పెట్టింది. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ప్రాక్టీస్ చేసింది. "అవును.. మేం తిరిగి సాధన ప్రారంభించాం. కుర్రాళ్లు చాలా హుషారుగా ఉన్నారు" అని ఓ గుజరాత్ ఫ్రాంచైజీ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. పూర్తి జట్టు ప్రాక్టీస్ సెషన్లో పాల్గొంది. జోస్ బట్లర్(ఇంగ్లాండ్), కొయెజ్జీ (దక్షిణాఫ్రికా) తప్ప విదేశీ ఆటగాళ్లంతా భారత్‌లోనే ఉన్నారు. స్వదేశానికి వెళ్లిన వాళ్లు.. అవసరమైతే వెనక్కి వస్తారని గుజరాత్ ఫ్రాంచైజీ తెలిపింది.

ఐపిఎల్ షెడ్యూల్...

తేదీ	మ్యాచ్‌లు	వేదిక	సమయం
మే 17(శని)	బెంగళూరు × కోల్‌కతా	బెంగళూరు	రా. 7.30గంII
18(ఆది)	రాజస్తాన్ × పంజాబ్	జైపూర్	మ.3.30గంII
	ఢిల్లీ × గుజరాత్	ఢిల్లీ	రా.7.30గంII
19(సోమ)	లక్నో × సన్‌రైజర్స్	లక్నో	రా.7.30గంII
20(మంగళ)	చెన్నై × రాజస్తాన్	ఢిల్లీ	రా.7.30గంII
21(బుధ)	ముంబయి × ఢిల్లీ	ముంబయి	రా.7.30గంII
22(గురు)	గుజరాత్ × లక్నో	అహ్మదాబాద్	రా.7.30గంII
23(శుక్ర)	బెంగళూరు × సన్‌రైజర్స్	బెంగళూరు	రా.7.30గంII
24(శని)	పంజాబ్ × ఢిల్లీ	జైపూర్	రా.7.30గంII
25(ఆది)	గుజరాత్ × చెన్నై	అహ్మదాబాద్	మ.3.30గంII
	సన్‌రైజర్స్ × కోల్‌కతా	ఢిల్లీ	రా.7.30గంII
26(సోమ)	పంజాబ్ × ముంబయి	జైపూర్	రా.7.30గంII
27(మంగళ)	లక్నో × బెంగళూరు	లక్నో	రా.7.30గంII
29(గురు)	క్వాలిఫయర్-1	---	రా.7.30గంII
30(శుక్ర)	ఎలిమినేటర్-1	---	రా.7.30గంII
జూన్1(ఆది)	క్వాలిఫయర్-2	---	రా.7.30గంII
జూన్2(మంగళ)	ఫైనల్	---	రా.7.30గంII

విదేశాంగ విధానంలో మార్పులు వచ్చాయా..?

- మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : భారత్ - పాకిస్తాన్ దేశాలు కాల్పుల విరమణకు తన మధ్యవర్తిత్వంతోనే అంగీకారం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కాశ్మీర్ అంశంపై అమెరికా ప్రమేయం నిజమేనా? అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, పార్టీ సీనియర్ నాయకులు, చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ భఘేల్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "భారతదేశ విదేశీ విధానంలో ఏమైనా మార్పులు చోటుచేసుకున్నాయా..? భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉన్న కాశ్మీర్ అంశంపై మధ్యవర్తిత్వానికి మూడో పక్షాన్ని అనుమతించి సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించారా..?' అని కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ విషయంలో తన జోక్యం ఉందని పేర్కొంటూ ప్రతిరోజూ ప్రకటనలు చేస్తున్నారని, వీటిపై కేంద్రప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. భూపేష్ భఘేల్ మాట్లాడుతూ కాశ్మీర్ సమస్యను 'అంతర్జాతీయం' చేయడానికి ఎవరినీ అనుమతించకూడదనే విధానాన్ని భారత్ విడిచిపెట్టిందా? అని ప్రశ్నించారు. కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించడంపై దేశం అనుమానం వ్యక్తం చేస్తోందని, అన్నారు.

2025 - జెఇఇ అడ్వాన్స్‌డ్ అడ్మిట్ కార్డ్స్ రిలీజ్

కాన్పూర్ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాన్పూర్ అధికారికంగా జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 అడ్మిట్ కార్డ్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ నెల 18న రెండు పేపర్లు (ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్- 1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్- 2గా జరిగే జెఇఇ అడ్వాన్స్‌డ్ అడ్మిట్ కార్డులను ఐఐటి కాన్పుర్ డౌన్‌లోడ్ కోసం అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, ఇతర వివరాలు ఎంటర్ చేసి అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్‌లో కనీస స్కోర్ సాధించిన రెండున్నర లక్షలమందికి పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షకు నమోదు చేసుకున్న అభ్యర్థులు ఇప్పుడు వారి హాల్ టికెట్‌ను అధికారిక వెబ్‌సైట్ jeeadv.ac.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇండూస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్
రిజిష్టర్డు ఆఫీసు: 2401, జెనరల్ తిమ్మయ్య రోడ్ (కంటోన్మెంట్), పూణె-411001.
కంజ్యూమర్ ఫైనాన్స్ డివిజన్: న్యూ నం.34, జి.ఎన్.చెట్టి రోడ్, టి.నగర్, చెన్నై-600 017
రాష్ట్ర కార్యాలయం: ఇండూస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్, 59ఎ-15-22, గ్రౌండ్ ఫ్లోర్, పంతకాలువ రోడ్, స్టెల్లా కాలేజి స్టేడియం ప్రక్కన, పటమట, విజయవాడ-520010.
డిమాండ్ నోటీసు ప్రచురణ
(ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద)
1. రుణ ఒప్పందం నంబరు: AVV05191M.
ప్రదేశం: విజయవాడ
తేది: 13.05.2025
సం/- అధీకృత అధికారి, ఇండూస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ తరఫున.

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
Chola
రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు
తేది : 10.05.2025
ప్రదేశం : గుంటూరు
సం/- అధీకృత అధికారి, మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

హీరో ఫిన్‌కార్ప్ లిమిటెడ్
Hero FINCORP
CIN: U74899DL1991PLC046774
ఇ-మెయిల్: litigation@herofincorp.com వెబ్‌సైట్: www.herofincorp.com
రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులకు ప్రకటన
తేది:13.05.2025. ప్రదేశం: విజయవాడ. సం/- అధీకృత అధికారి, మెసర్స్ హీరో ఫిన్‌కార్ప్ లిమిటెడ్.

ఇండూస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్
డిమాండ్ నోటీసు ప్రచురణ
1. రుణ ఒప్పందం నంబరు: AVG05271M.
2. రుణ ఒప్పందం నంబరు: AVG05190M.
తేది: 13.05.2025
ప్రదేశం: గుంటూరు (ఆం.ప్ర.)
సం/- అధీకృత అధికారి, ఇండూస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ తరఫున.

స్వాధీనత ప్రకటన
ఈడల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
సిఐఎన్: U67100MH2007PLC174759
ప్రదేశం: ముంబై
తేది : 13.05.2025
సం/- అధీకృత అధికారి, ఈడల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
Edelweiss Asset Reconstruction

ARKA అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్
రిజిష్టర్డ్ ఆఫీసు: 2504, 25వ అంతస్తు, వన్ లోధా ప్లేస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్, ముంబయి - 400013, మహారాష్ట్ర, ఇండియా
డిమాండ్ నోటీసు
ప్రదేశం: విజయవాడ
తేది: 13-05-2025
సం/- అధీకృత అధికారి, అర్కా ఫిన్‌క్యాప్ లిమిటెడ్
A Kirloskar Group Company
The mark 'Kirloskar' in the status line is owned by Kirloskar Proprietary Limited and ARKA Fincap Limited is the permitted user.

మురళీ నాయక్ స్మారక చిహ్నం ఏర్పాటు చేయండి

- సిఎంను కోరిన సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వీర జవాన్ మురళి నాయక్ స్మారకార్థం స్మారక చిహ్నం, లేనిపక్షంలో అవార్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ కోరింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సోమవారం లేఖ రాశారు. అనంతపురంలో చదువుకునే రోజుల్లోనే దేశానికి సేవ చేయాలని సంకల్పంతో మురళి నాయక్ ఆర్మీ జవాన్‌గా చేరారని చెప్పారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మురళి నాయక్ అందరికీ ఆదర్శప్రాయుడని చెప్పారు. ఆయన త్యాగం చిరస్మరణీయం కావాలంటే కళ్లితండా పేరును 'వీర జవాన్ మురళి నాయక్ తండా'గా మార్చాలని, గోరంట్ల కూడలిలో మురళి నాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొన్నారు. అంతే కాకుండా మురళి నాయక్ స్మారకార్థం రాష్ట్ర ప్రభుత్వం తరపున స్మారక చిహ్నం లేక అవార్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

19 మందితో ఆలిండియా సబ్ కమిటీ ఎన్నిక

- జాతీయ కన్వీనర్‌గా లలిత బాలన్ ఎన్నిక
- రాష్ట్రం నుంచి శివనాగరాణి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలోని మలప్పురం జిల్లా, పరిమన్న నగరంలోని ఇఎంఎస్ అకాడమీలో జరిగిన అఖిల భారత వ్యవసాయ కార్మిక, రూరల్ వర్కర్స్ మొదటి జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. 16 రాష్ట్రాల నుండి 410 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహిళా సమస్యలపై జాతీయ స్థాయిలో చర్చించారు. అనంతరం 19 మందితో అఖిల భారత సబ్ కమిటీ ఎన్నికైంది. ఈ మేరకు సోమవారం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ప్రకటన విడుదల చేశారు. కేరళకు చెందిన లలిత బలన్‌ను కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి శివనాగ రాణి, తెలంగాణ నుంచి బి పద్మకు చోటు లభించింది.

మీ సేవలు అందించండి

- మస్క్ కంపెనీ స్టార్‌లింక్‌కు ప్రభుత్వ ఆహ్వానం
- అమెరికా ఒత్తిడితోనే : వాషింగ్టన్ పోస్ట్ కథనం

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సన్నిహితుడైన ఎలన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీ త్వరలో మన దేశంలో కార్యకలాపాలు ప్రారంభించబోతోంది. స్టార్‌లింక్‌కు ఆహ్వానం పలుకుతూ కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ నుండి ఓ లేఖ పంపారు. భారత ప్రభుత్వ నూతన జాతీయ భద్రతా మార్గదర్శకాలను పాటించేందుకు స్టార్‌లింక్ అంగీకరించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. స్టార్‌లింక్ ప్రవేశాన్ని అనుమతిం చాల్సిందిగా సుంకాలు విధించిన కొన్ని దేశాలపై అమెరికా ఒత్తిడి చేసిందని విదేశాంగ శాఖ వర్గాలను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తెలియజేసింది. స్టార్‌లింక్ దరఖాస్తు కొంతకాలంగా పరిశీలనలో ఉన్నదని అధికార వర్గాలు చెబుతున్నాయి. గత వారం సవరించిన భద్రతా నిబంధనలు విడుదలైన తర్వాత వాటికి ఆ కంపెనీ అంగీకరించడంతో వెంటనే అనుమతులు లభించాయి. ఉపగ్రహ ఇంటర్నెట్ ప్రొవైడర్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన భద్రతా నిబంధనల ప్రకారం... వారు తమ వద్ద ఉన్న సమాచారాన్ని భారత సరిహద్దుల లోపలే ఉంచుకోవాలి. బయటకు పంపకూడదు. విదేశీ టర్మినల్స్ లేదా ఫెసిలిటీలకు యూజర్ కనెక్షన్లను అనుసంధానం చేయడాన్ని నిషేధించారు.

స్టార్‌లింక్ డిమాండ్లకు తలొగ్గారా?

సంప్రదింపుల సమయంలో స్టార్‌లింక్ రెండు అంశాలపై అయిష్టత వ్యక్తం చేసింది. అంతర్జాతీయ సరిహద్దుల వద్ద టెర్మినల్స్‌ను పర్యవేక్షించడం, శాట్‌కామ్ కంపెనీలలో భారతీయులకు మెజారిటీ వాటాలు ఇవ్వడం... ఈ రెండు నిబంధనలను స్టార్‌లింక్ ఇష్టపడలేదు. దీంతో ఆ రెండింటినీ ప్రభుత్వం తొలగించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి చర్చించాలి

- ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల హేతుబద్ధీకరణ, ఉపాధ్యాయుల బదిలీల్లో ఉన్న అసంబద్ధాలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని విద్యాశాఖ మంత్రిని ఎపిటిఎఫ్ కోరింది. హేతుబద్ధీకరణలో ఒక్కొక్క ప్రభుత్వం ఒక్కో రకంగా విధానాలను రూపొందించి పోస్టులను అటుఇటు మార్చడంతో ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో చర్చించిన అంశాలను మార్గదర్శకాలుగా ఇవ్వకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ఒక్క పోస్టునూ బ్లాక్ చేయబోమని హామీ ఇచ్చి మార్గదర్శకాలలో బ్లాక్ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో సమాంతర, మైనర్ మీడియాలను కొనసాగించాలని కోరారు. జిఓ 117 రద్దు పేరుతో పాఠశాలలను ప్రయోగశాలలుగా చేసే ప్రమాదం వాటిల్లకుండా, అనేక అసంబద్ధ విధానాలపై ఉత్తర్వులు వెలువడకముందే మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

బదిలీల్లో ఎనిమిదేళ్ల స్టేషన్ పాయింట్లు : ఎపిఎస్‌టిఎ

పాఠశాలలో ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తికాకుండానే తప్పనిసరిగా బదిలీ చేసే ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్ల స్టేషన్ పాయింట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి స్కూల్ టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రేషనలైజేషన్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు పాత, కొత్త స్టేషన్ పాయింట్లు, రేషనలైజేషన్ పాయింట్లు అనేది కాకుండా ఎనిమిదేళ్ల పాయింట్లు కేటాయించాలని కోరారు.

సుందరయ్యనగర్ నుంచి సీతానగరం వర్కుషాప్ వరకూ

కనెక్టివిటీకి క్లియర్ లైన్

- ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతి మంజూరు
- ప్లానింగు ఇచ్చిన ప్రణాళికా విభాగం
- మణిపాల్ వద్ద జాతీయ రహదారిపై ట్రంపెట్ సర్కిల్
- పేదల ఇళ్లకూ ఇబ్బందే
- అతి త్వరలో పనులు ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు

రాజధాని అమరావతికి ఆయువు పట్టయిన సీడ్ యాక్సెస్ రోడ్డును 16వ నెంబరు జాతీయ రహదారికి కలిపేందుకు మార్గం సుగమం అయింది. ఎలివేటెడ్ కారిడార్ రూపంలో దీన్ని నిర్మించనున్నారని, దీనికోసం ఎలైన్‌మెంట్ కూడా పూర్తి చేశారని, 2019 మే 17న ప్రజాశక్తి తొలిసారి బయటపెట్టింది. దీనిపై 2018 డిసెంబర్లో జరిగిన 19వ బోర్డు సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై అప్పట్లో ప్రజల నుండి పెద్దయెత్తున విమర్శలు, ఆందోళనలు రావడంతో కొంత వెనక్కు తగ్గింది. విషయం బయటకు పొక్కిందనే పేరుతో అప్పట్లో సిఆర్‌డిఎలో పనిచేసే ఓ సిఇని కూడా మార్చేశారు. అనంతరం మార్కింగ్ ఇచ్చినా కొంత వెనక్కు తగ్గారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎలివేటెడ్ కారిడార్ వేళ్లే మార్గం మధ్యలో అక్కడక్కడ నిర్మాణాలకూ అనుమతులిచ్చింది. దీంతో వైసిపికి చెందిన ఓ ఎమ్మెల్యే అక్కడ పెద్దయెత్తున అపార్టుమెంట్లు నిర్మించారు. కారిడార్ పక్కగా ఈ నిర్మాణాలున్నాయి. అప్పట్లో దీనిపై విమర్శలు వచ్చినా పెద్దగా పట్టించుకోలేదు. రెండు రోజుల క్రితం ప్లానింగ్ అధికారులు సుందరయ్యనగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. గతంలో ఉన్న ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. కొత్తగా వచ్చిన ప్లానులో మణిపాల్ ఆస్పత్రి స్థలంలోకి మార్కింగ్ ఇవ్వడంతోపాటు కొన్ని నివాసాలూ అడ్డు వస్తాయని తేల్చారు. అయితే ముందుగానే వ్యవహారం బయటకు వస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో గుమ్మనంగా ప్లానింగు, మ్యాపింగు చక్కబెట్టేశారు. అతి త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. మణిపాల్ ఆస్పత్రి వద్ద ట్రంపెట్ సర్కిల్ నిర్మించనున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ (ఫ్లై ఓవర్) కోసం 2019లోనే రూ.1,181 కోట్లు ఖర్చవుతాయని అంచనాలు రూపొందించారు. ధరల పెరుగుదల (కాస్ట్ ఎస్కలేషన్)తో ప్రస్తుతం రూ.1,500 కోట్ల వరకూ ఖర్చు చేయనున్నారు. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా మణిపాల్ ఆస్పత్రి నుండి రైల్వే ట్రాక్, శీతానగరం వరకూ అధునాతన సాంకేతిక పద్ధతుల్లో భూసార పరీక్షలు నిర్వహించారు.

పక్కనే ఉన్న ఇళ్ల పరిస్థితి ఏమిటి?

ప్రస్తుతం ఎలివేటెడ్ కారిడార్ వస్తున్న ప్రాంతం సుందరయ్యనగర్ నుంచి ఎన్‌టిఆర్ కట్ట, సీతానగరం, వర్కుషాప్ కట్టరోడ్డు ఉన్నాయి. అక్కడ పేదలు ఎక్కువ మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామని, ఇళ్లకు ఇబ్బంది లేదని చెబుతున్నా పనులు జరిగే సమయంలో కారిడార్‌కూ అటూ ఇటు 60 అడుగుల వరకూ ఇళ్లను ఎత్తేయనున్నారు. నిబంధనల ప్రకారం జాతీయ రహదారిలో కలిపే రోడ్లకు కచ్చితంగా ఫీడర్ యాక్సెస్ ఉండాల్సి ఉంటుంది. ఇది ప్రత్యామ్నాయ రహదారిగానూ ఉండాలని ప్లానింగు అధికారులు చెబుతున్నారు. అలాంటి ఫీడర్ లేకపోతే జాతీయ రహదారుల విభాగం వారి రోడ్లను స్థానిక రోడ్లను కలిపేందుకు అనుమతి ఇవ్వదు. ఈ నేపథ్యంలో కారిడార్ నిర్మాణం సమయంలో బయటకు చెప్పకపోయినా అంతో ఇంతో సుందరయ్యనగర్ ప్రాంత నివాసితులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది.

అమరావతి పనుల ఆడిట్ నిర్వహణకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో ప్రపంచబ్యాంకు నిధులతో నడుస్తున్న పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించేందుకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించారు. ప్రస్తుతం రాజధానిలో రూ.15 వేల కోట్లను రుణాల రూపంలో ప్రపంచ బ్యాంకు ఇచ్చింది. వాటితో చేపట్టే పనుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రపంచ బ్యాంకుకు తెలపాల్సి ఉంది. పనుల నిర్వహణపై గతంలోనే కొన్ని సంస్థలను సిఆర్‌డిఎ అధికారులు నియమించారు.

ప్రస్తుతం ఆర్థికపరమైన ఖర్చులు, పనుల నిర్వహణ, టైంబాండ్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అనే అంశాలను పరిశీలించేందుకు ఆడిట్ సంస్థలను నియమించాలని నిర్ణయించారు. ఈ నెల 22లోపు టెండర్లు దాఖలు చేయాల్సి ఉంది. ఆసక్తి వ్యక్తీకరణ అనంతరం అర్హత ఉన్న సంస్థలను ఎంపిక చేయనున్నారు. ప్రతి పనీ నిర్దేశిత సమయంలో చేయాల్సి ఉండటంతో సంస్థలను ఆహ్వానించినట్లు సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు.

శానిటేషన్ నిర్వహణకు కూడా..

రాజధాని పరిధిలో ఎంటిఎంసి పరిధిలో కలిసిన ఆరు గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణకు కూడా సిఆర్‌డిఎ అధికారులు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించారు. అలాగే వివిఐపిలు ప్రయాణించే 10 కిలోమీటర్ల మార్గంలో జటాయు వాహనంతో రోడ్లను శుభ్రం కొనుగోలు సొంత నిర్వహణ (బై ఓన్ అండ్ ఆపరేట్-బిఒఒ) పద్ధతిలో 36 నెలలపాటు నిర్వహించాల్సి ఉంటుందని ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లలో పేర్కొన్నారు.

గ్రూప్-1 మూల్యాంకన అవినీతిలో సవాంగ్ పాత్ర

- టిడిపి నేత విజయ్‌కుమార్ ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించిన గ్రూప్-1 మూల్యాంకన అవినీతిలో గౌతమ్ సవాంగ్ పాత్ర ఉందని టిడిపి అధికార ప్రతినిధి, బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందని చెప్పారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మూల్యాంకనంలో అవకతవకలకు పాల్పడిందని విమర్శించారు. ఎపిపిఎస్‌సి అప్పటి ఛైర్మన్ గౌతం సవాంగ్, కార్యదర్శి పిఎస్‌ఆర్ ఆంజనేయులు వారి అనుయాయులైన వ్యక్తికి గ్రూప్-1 పేపర్లు దిద్దడానికి కాంట్రాక్టు ఇచ్చారని చెప్పారు. సవాంగ్ వెనుక ఎవరుండి ఈ కథ నడిపించారో తెలియాలని డిమాండ్ చేశారు.

టిడిపి కార్యాలయంలో పల్లా జన్మదిన వేడుకలు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు టిడిపి కార్యాలయంలో సోమవారం జరిగాయి. పల్లా జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. 2024 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 95,283 ఓట్ల ఆధిక్యంతో పల్లా విజయం సాధించారని నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, అధికార ప్రతినిధి విజయకుమార్, గ్రంథాలయ ఛైర్మన్ కోటేశ్వరరావు, ఎస్‌సి సెల్ కార్యదర్శి కె అఖిల్, ఎస్‌టి సెల్ అధ్యక్షులు దారు నాయక్, నాయకులు పాతర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులేవీ?

- దృష్టిసారించని విద్యాశాఖ
- హడావుడిగా మోడల్ ప్రైమరీ స్కూల్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లకు తరగతి గదులు కొరత రానుంది. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9,600 పాఠశాలలను ఏర్పాటు చేయనుంది. 1 నుంచి 5వ తరగతి వరకు 60 మంది విద్యార్థులతో వీటిని వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించనుంది. ప్రతి తరగతికి ఒక టీచర్‌ను ఇవ్వనుంది. అయితే ఈ పాఠశాలల్లో తరగతి గదుల కొరత ఏర్పడే అవకాశం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గదుల కొరతపై దృష్టి సారించకుండా హడావుడిగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త విధానంలో ప్రతి తరగతికి ఒక గది చొప్పున కేటాయించాలి. అదే విధంగా ఉపాధ్యాయుల కోసం ఒకటి, సైన్స్ ల్యాబ్‌కోసం మరొకటి చొప్పున గదులు ఉండాలి. అంటే ప్రతి మోడల్ స్కూల్‌లో కచ్చితంగా 7 తరగతి గదులు ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు లేదా నాలుగు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. 7 గదులున్న పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో అదనపు తరగతి గదులు నిర్మించాల్సిన అవసరం ఉంది. పాఠశాలలను ఎలా ఏర్పాటు చేయాలనే అంశాలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరుపుతున్న పాఠశాల విద్యాశాఖ మౌలిక సదుపాయాలు, అదనపు తరగతి గదులపై దృష్టి సారించడం లేదు. గదుల నిర్మాణానికి నిధులు కొరత ఉందని అధికారులు కారణం చెబుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అదే విధంగా బడులు ప్రారంభమైన తరువాత విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్మించవచ్చనే ధోరణి విద్యాశాఖలో కనపడుతోందని అంటున్నారు. మొత్తం ఎంపిక చేసిన 9,600 మోడల్ స్కూళ్లలో సుమారు 5 వేల స్కూళ్లలో అదనపు గదులు అవసరమవుతాయని అధికారులు లెక్కలు కూడా తేల్చారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలకు తరలించిన విషయం తెలిసిందే. ఈ ఉన్నత పాఠశాలలకే మిగిలిన 1, 2 తరగతులను కూడా తరలించి అక్కడే మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇలాంటివి 1,557 పాఠశాలలు ఉన్నాయి. ఇక్కడ కూడా తరగతి గదుల కొరత ఉంది. గత ప్రభుత్వం నాడు-నేడు కింద మౌలిక సదుపాయాలపై పెట్టిన దృష్టి తరగతి గదులపై సారించలేదు. రెండో దశలో సుమారు రూ.7 వేల కోట్లు నిధులు పెండింగ్‌లో ఉన్నాయి.

గత అనుభవాన్ని పట్టించుకోని అధికారులు

గదుల కొరత కారణంతో గతంలో ప్రారంభించిన మోడల్ ప్రైమరీ స్కూల్ వ్యవస్థ కూడా విఫలం చెందిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. 2015లో సుమారు 3,388 మోడల్ ప్రైమరీ స్కూళ్లను పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. అయితే వీటిల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా గదుల నిర్మాణం చేపట్టలేదు. గదులు కొరత కారణంతో విద్యార్థుల చేరిక తగ్గింది. దీంతో ఇవి కూడా సాధారణ స్కూళ్లలాగే తయారయ్యాయి. ఇప్పుడు తీసుకొచ్చే మోడల్ ప్రైమరీ స్కూళ్లకు కూడా అవసరమైన గదులు నిర్మించకుంటే ఇవి కూడా నిలబడవని విద్యావేత్తలు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నర్సింగ్ సేవల్లో అసమానతలు

- ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సేవలపై తీవ్ర ప్రభావం
- డబ్ల్యుహెచ్‌ఒ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : తక్కువ, మధ్య తరగతి ఆదాయాలు కలిగిన దేశాలు నర్సులను గ్రాడ్యుయేట్ చేయడం, తమ ఆరోగ్య వ్యవస్థల్లో వారిని నియమించడం, నిలుపుకోవడంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) తన తాజా నివేదికలో పేర్కొంది. మానసిక ఆరోగ్యం, కార్మిక సంక్షేమం అనేవి ఆందోళనకరంగా వున్నాయని పేర్కొంది. అలాగే అంతర్జాతీయంగా నర్సింగ్ నియామకాల్లో నెలకొన్న అసమానతల వల్ల కీలకమైన ఆరోగ్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలు, దేశాల్లో నర్సుల సేవల లభ్యత విషయంలో అసమాతనలు అలాగే కొనసాగుతున్నాయని పేర్కొంది. ఇటువంటి పరిస్థితుల్లో నర్సుల ఉద్యోగాలను సృష్టించడానికి, కొనసాగించడానికి దేశీయంగా పెట్టుబడులను పెంచాల్సి వుందని 'స్టేట్ ఆఫ్ ది వరల్డ్స్ నర్సింగ్ 2025' నివేదికలో పేర్కొంది.

అధిక ఆదాయం కలిగిన దేశాలతో పోలిస్తే తక్కువ ఆదాయం కలిగిన దేశాల్లో చాలా వేగంగా నర్సు గ్రాడ్యుయేట్లు పెరుగుతున్నారని నివేదిక పేర్కొంది. చాలా దేశాల్లో జనాభా వేగంగా పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గడం వల్ల నర్సుల గ్రాడ్యుయేషన్ రేటులో కష్టపడి సాధించిన ప్రగతి మెరుగైన రీతిలో కనిపించడం లేదని నివేదిక పేర్కొంది. దీన్ని పరిష్కరించడానికి, దేశాలు ఉద్యోగాలను సృష్టించాలి, అప్పుడే గ్రాడ్యుయేట్లను ఆరోగ్య వ్యవస్థల్లోకి మిళితం చేయడానికి వీలు వుంటుందన్నారు. తద్వారా పని పరిస్థితులు కూడా మెరుగవుతాయన్నారు. ఇక అధిక ఆదాయ దేశాలు ఎక్కువ సంఖ్యలో రిటైరయ్యే నర్సుల పరిస్థితులను ఎదుర్కొనడానికి కూడా సిద్ధం కావాల్సి వుంటుంది. విదేశాల్లో శిక్షణ పొందిన నర్సులపై ఆధారపడడాన్ని కూడా సమీక్షించుకోవాల్సి వుంటుందని నివేదిక పేర్కొంది. ఏ దేశాల నుండి నర్సులను నియమించుకుంటున్నామో ఆ దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలను బలోపేతం చేసుకోవాల్సి వుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడుగురు నర్సుల్లో ఒకరు, అధిక ఆదాయం కలిగిన దేశాల్లో 23శాతం మంది నర్సులు విదేశీ నర్సులే అయి వుంటున్నారని సర్వేలో వెల్లడైంది. అంటే అంతర్జాతీయ వలసలపై అధికంగా ఆధారపడుతున్నామని తేలింది. దీనికి విరుద్ధంగా ఎగువ మధ్య తరగతి ఆదాయ దేశాల్లో విదేశీ నర్సులు ఎనిమిది శాతం కాగా, తక్కువ మధ్య తరగతి ఆదాయ దేశాల్లో ఒక శాతంగా, తక్కువ ఆదాయ దేశాల్లో 3శాతంగా వున్నారని వెల్లడైంది.

ఎన్ఆర్‌టిఎస్‌ను క్రమబద్ధీకరించండి

- ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌కు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : నర్సుల రిజిస్ట్రేషన్, ట్రాకింగ్ వ్యవస్థ (ఎన్ఆర్‌టిఎస్)ను క్రమబద్ధీకరించాలని, ఆ వ్యవస్థకు సంబంధించి సమర్థవంతమైన రీతిలో ఆధునీకరించిన పనితీరును అమలు చేయాలని కోరుతున్న అభ్యర్ధనపై నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సి)ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుత వ్యవస్థలో వున్న లోపాలను ఎత్తిచూపుతూ తక్షణమే వాటిని తొలగించి, పనితీరును మెరుగుపరచాలని కోరుతున్న రిట్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్ఆర్‌టిఎస్‌ను క్రమబద్ధీకరించేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇండియన్ ప్రొఫెషనల్ నర్సెస్ అసోసియేషన్ (ఐపిఎన్ఎ) న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అధికారులు నిర్దేశించిన ప్రమాణాలకు లోబడి అమలు వుండాలని కోరింది. దేశవ్యాప్తంగా రిజిస్టర్ అయిన నర్సుల సెంట్రల్ డేటాబేస్‌ను నిర్వహించే డిజిటల్ వేదిక ఎన్ఆర్‌టిఎస్. పిటిషనర్ ఈ ఆదేశాల కాపీని కౌన్సిల్‌కు అందజేసిన ఆరు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది.

మాల్దీవులకు భారత్ 50 మిలియన్ డాలర్ల సాయం

మాలే : మరో ఏడాదిపాటు ట్రెజరీ బిల్లును రోల్‌ఓవర్ చేయడం ద్వారా మాల్దీవులకు భారత్ 50 మిలియన్ల డాలర్ల ఆర్థిక సాయాన్ని అందించింది. తమ దేశం ఆర్థిక ప్రగతికి ఈ సాయం ఉపకరిస్తుందని మాల్దీవులు ప్రభుత్వం తెలిపింది. మాల్దీవులు ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఆ దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన 50 మిలియన్ల డాలర్ల ప్రభుత్వ ట్రెజరీ బిల్లును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మరో ఏడాదిపాటు సబ్‌స్క్రైబ్ చేసిందని మాల్దీవుల్లోని భారత్ హైకమిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2019 నుంచి ప్రతీ సంవత్సరం భారత్ ప్రభుత్వం ఎస్‌బిఐ ద్వారా ఇటువంటి అనేక ట్రెజరీ బిల్లులను సబ్‌స్క్రిప్షన్ చేయడం సులభతరం చేస్తోంది. ప్రతి ఏడాది వడ్డీ లేకుండా మాల్దీవులు ప్రభుత్వానికి సాయం అందజేస్తోంది. 'ఇది మాల్దీవుల అత్యవసర ఆర్థిక సాయంగా, ఇరు ప్రభుత్వాల మధ్య జరిగిన ప్రత్యేకమైన ఒప్పందం ప్రకారం జరిగింది' అని హైకమిషన్ తన ప్రకటనలో తెలిపింది. మాల్దీవులు భారత్‌కు కీలకమైన పొరుగుదేశమని పేర్కొంది. తమ దేశానికి కీలకమైన ఆర్థిక సాయం అందించినందుకు భారత్‌కు, కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు మాల్దీవులు విదేశాంగ మంత్రి అబ్దుల్లా ఖలీల్ కృతజ్ఞతలు తెలిపారు.

విక్రమ్ మిస్రి కుమార్తెపై ట్రోలింగ్ బాధ్యతారహితం

- ఖండించిన ఎన్‌సిడబ్ల్యూ

న్యూఢిల్లీ : కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఆయన కుటుంబం ముఖ్యంగా మిస్రి కుమార్తెపై ట్రోలింగ్‌ను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యూ) తీవ్రంగా ఖండించింది. ట్రోలింగ్‌ను 'చాలా బాధ్యతారహిత చర్య'గాను, ఆమె భద్రతకు ముప్పు కలిగించే గోప్యతను ఉల్లంఘించడం గానూ విమర్శించింది. ఈ మేరకు ఎన్‌సిడబ్ల్యూ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిస్రి వంటి సీనియర్ సివిల్ సర్వెంట్ల కుటుంబ సభ్యులపై వ్యక్తిగత దాడులు ఆమోదయోగ్యం కాదని, నైతికంగా కూడా సమర్థించలేరని విమర్శించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలోనూ సంయమనంతో, గౌరవంగా, బాధ్యతాయుతమైన ప్రవర్తనతో వ్యవహరించాలని కోరారు.

మిస్రి కుటుంబంపై ట్రోలింగ్‌ను ప్రముఖ దౌత్యవేత్త నిరుపమా, వామపక్షాలు, రాజకీయ నాయకులు అఖిలేష్ యాదవ్, అసదుద్దీన్ ఒవైసి కూడా తీవ్రంగా ఖండించారు. మిస్రి కుటుంబానికి మద్దతు ప్రకటించారు.

పిఎస్‌లలో సిసి కెమెరాలపై ప్రణాళిక రూపొందించండి

- డిజిపికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లలో సిసి టివి కెమెరాలను సక్రమంగా పనిచేసేందుకు ఒక ప్రణాళిక రూపొందించాలని డిజిపిని హైకోర్టు ఆదేశించింది. సంబంధిత అధికారులను సంప్రదించి పలు అంశాలతో ఒక అథార్టీని ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. సిసి కెమెరాల పనితీరుతోపాటు ఫుటేజ్ స్టోరేజ్ వంటి సమస్యలు వస్తే వాటి వివరాలు ఆ అథార్టీకి సమాచారం చేరేలా ఏర్పాట్లు ఉండాలంది. ఎప్పుడు, ఏ సమయానికి ఫిర్యాదు అందిందో అథార్టీకి సమాచారం ఉండాలంది. సిసి కెమెరాల్లో లోపాలుంటే వాటిని రిపేర్లు చేయించడం, పూర్తిగా పనిచేయకుంటే కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు, ఇవన్నీ నిర్దిష్ట వ్యవధిలో చేసేలా చర్యలు తీసుకోవాలంది. నిర్ధేశించిన గడువులోగా చేయకపోతే అందుకు ఎవరు బాధ్యుడో కూడా గుర్తించేలా యాంత్రాంగం ఉండాలంది. జిల్లాల వారీ అన్ని సిసి టివి కెమెరాల వస్తు సామగ్రి, ఫుటేజీ స్టోరేజీ వంటివి ఉండేలా చర్యలు తీసుకోవాలంది. ఈ మేరకు ఒక ప్రణాళికను రూపొందించి సమర్పించాలని న్యాయమూర్తులు జస్టిస్ ఆర్ రఘునందన్‌రావు, జస్టిస్ కె మన్మథరావుతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 2015లో వెలువరించిన తీర్పు మేరకు అన్ని పోలీసు స్టేషన్లు, జైళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల్సి వుందని, అయితే, రాష్ట్రంలో ఏర్పాటు జరగలేదంటూ అడ్వకేట్ తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. సుప్రీం ఉత్తర్వుల మేరకు సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని 2019 జులై 15న ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయలేదని పిటిషనర్ కోర్టుధిక్కార పిటిషన్ వేశారు. తదుపరి విచారణ జూన్ 17కు వాయిదా పడింది.

బంగారం దిగివస్తోంది..!

- రూ.1800 తగ్గుదల

న్యూఢిల్లీ : భౌగోళిక ఆందోళనలు, టారిఫ్ ప్రభావాలతో భారీగా పెరిగిన బంగారం ధర తగ్గుముఖం పడుతోంది. ముఖ్యంగా అమెరికా, చైనా మధ్య నెలకొన్న టారిఫ్ యుద్ధానికి బ్రేక్ పడటానికి తోడు రష్యా, ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ సంకేతాలతో సోమవారం పసిడి ధర భారీగా తగ్గింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1800 తగ్గి రూ.96,880గా పలికింది. 22 క్యారెట్ల పసిడిపై రూ.1650 దిగివచ్చి రూ.88,800గా నమోదయ్యింది. కిలో వెండిపై రూ.1100 పతనమై రూ.97,900గా చోటు చేసుకుంది. ఇటీవలి వరకు అంతర్జాతీయ మార్కెట్‌లో 3400 డాలర్ల ఎగువన ట్రేడయిన ఔన్సు బంగారం ధర తాజాగా 3218 డాలర్లకు దిగొచ్చింది. ప్రస్తుత సానుకూల వాతావరణంలో అతి సమీపంలోనే బంగారం ధర మరింత దిగివచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

కెనరా బ్యాంక్ ఉద్యోగులు భళా..

- రూ.16,700 కోట్ల డిపాజిట్లు సమీకరణ

బెంగళూరు : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ఉద్యోగులు డిపాజిట్ల సమీకరణలో భళా అనిపించుకున్నారు. డిపాజిట్ల వృద్ధి లేమితో సతమతమవుతున్న కెనరా బ్యాంకు చేపట్టిన వినూత్న కార్యక్రమంలో భాగంగా కేవలం 10 వారాల్లోనే రూ.16,700 కోట్లు సమీకరించారు. బ్యాంకులో పనిచేసే 82,000 మంది సిబ్బంది ఈ క్యాంపెయిన్‌లో పాల్గొని నిధుల సమీకరణ చేశారు. 2024 జనవరి 26న ప్రారంభమైన ఈ క్యాంపెయిన్‌లో తమ ఉద్యోగులు ఎంతో అంకితభావంతో పని చేశారని కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె సత్యనారాయణ రాజు తెలిపారు. కాసా లేదా రిటైల్ టర్మ్ డిపాజిట్ రూపంలో ఒక్కొక్కరూ రూ.10 లక్షలు తీసుకురావాలని కోరామన్నారు. కాసా బ్యాలెన్స్‌లలో కూడా స్థిరత్వం ఉన్నందున ఈ డ్రైవ్ మొత్తం వ్యాపారానికి సహాయపడిందని పేర్కొన్నారు. దీంతో కెనరా బ్యాంక్ బల్క్ డిపాజిట్లపై ఆధారపడటం కూడా తగ్గిందన్నారు.

జాగల్ ప్రీపెయిడ్ రెవెన్యూ 50 శాతం వృద్ధి

హైదరాబాద్ : సాస్ ఫిన్‌టెక్ కంపెనీ జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్ 2025 మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 50.5 శాతం వృద్ధితో రూ.411 కోట్ల రెవెన్యూ సాధించింది. అదే సమయంలో 66.8 శాతం పెరుగుదలతో రూ.32 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.19 కోట్ల నికర లాభాలు, రూ.273 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 2024-25లో మొత్తం లాభాలు రెట్టింపై 87.4 కోట్లుగా, రెవెన్యూ 68 శాతం వృద్ధితో రూ.1,302 కోట్లుగా చోటు చేసుకుంది.

టాలీ ప్రైమ్ 6.0 ఆవిష్కరణ

హైదరాబాద్ : చిన్న, మధ్య తరహా కంపెనీలకు అనుసంధానించబడిన బ్యాంకులతో ఆర్థిక కార్యకలాపాలను సులభతరం చేయడానికి వీలుగా టాలీ ప్రైమ్ 6.0ను ఆవిష్కరించినట్లు టాలీ సొల్యూషన్స్ తెలిపింది. ఇది ఎస్ఎంఇలు, అకౌంటెంట్లు, బ్యాంకింగ్ ఆటోమేషన్, ఆర్థిక నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని సంస్థ ఎండి తేజస్ గోయెంకా తెలిపారు. ఎస్ఎంఇల కోసం వ్యాపార కార్యకలాపాలను సరళీకృతం చేయడానికి సహాయపడే సాంకేతికతను నిర్మించడమే తమ లక్ష్యమన్నారు.

పిఎల్ అసెట్ నుంచి పెర్ఫార్మింగ్ క్రెడిట్ ఫండ్

ముంబయి : పిఎల్ క్యాపిటల్ - ప్రభుదాస్ లీలాధర్ గ్రూపునకు చెందిన ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పిఎల్ అసెట్ మేనేజ్‌మెంట్ తన మొట్టమొదటి పెర్ఫార్మింగ్ క్రెడిట్ ఫండ్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఇది తమ తొలి ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎఐఎఫ్) అని పేర్కొంది. మూలధన రక్షణ, అత్యుత్తమ రిస్క్-అడ్జస్టెడ్ రాబడిని అందించడానికి రూపొందించబడిందని తెలిపింది. ఈ ఫండ్ ద్వారా రూ.500 కోట్లు నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ఈ మొత్తాన్ని వృద్ధి ఆధారిత వ్యాపాం సంస్థలకు రుణ పెట్టుబడులుగా అందించనున్నట్లు వెల్లడించింది.

మారుతి ఆల్టో కె10లోనూ 6 ఎయిర్ బ్యాగ్‌లు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ తన మారుతి ఆల్టో కె10లోనూ ఆరు ఎయిర్ బ్యాగ్‌లను అమర్చినట్లు వెల్లడించింది. తన ఎంట్రీ లెవల్ మోడళ్లు అయినా ఆల్టో కె10, వ్యాగనార్, సెలిరియో, ఈకో మోడళ్లలో ఇకపై స్టాండర్డ్‌గా 6 ఎయిర్‌బ్యాగులు అందించనున్నట్లు ఆ కంపెనీ సోమవారం వెల్లడించింది. వాహనదారుల భద్రతే తమకు ముఖ్యమని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ పేర్కొన్నారు. హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ దారులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ప్రయాణికుల భద్రత కూడా మరింత కీలకమైందన్నారు.

ఇంకా అందని పరిహారం!

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేశారు. సుమారు 140 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వానికి ఉద్యాన శాఖాధికారులు తుది నివేదిక అందించారు.

భూ సమీకరణ ప్రాంతాల్లో పరిహారం సాధ్యం కాదంటున్న అధికారులు

రాష్ట్ర రాజధాని అమరావతి పరిధిలో భూ సమీకరణ ప్రాంతాల్లో రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వడం సాధ్యం కాదని ఉద్యాన శాఖాధికారులు తేల్చి చెప్తున్నారు. ఇటీవల గాలివానకు గుంటూరు జిల్లా తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లో దాదాపు 105 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అరటి, బొప్పాయి, మామిడి, కూరగాయాలు, పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. రాజధాని గ్రామాల్లో భూ సమీకరణలో సిఆర్‌డిఎకు భూములు ఇచ్చిన రైతులు అనధికారికంగా సాగు చేస్తున్నందున వారికి పరిహారం ఇవ్వడం సాధ్యం కాదని ఉద్యాన శాధికారులు చెప్తున్నారు.

'తూర్పు'లో పూర్తి కాని ఎన్యూమరేషన్

తూర్పుగోదావరి జిల్లాలో 76 ఎకరాల్లో ఉద్యాన పంటలకు, కాకినాడ జిల్లాలో వెయ్యి ఎకరాల్లో వరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 480 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. దీనిపై ఎన్యూమరేషన్ పూర్తి కాలేదు. కాకినాడ జిల్లాలో మంగళవారం నుంచి ఎన్యూమరేషన్ నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు. కోనసీమ జిల్లాలో నష్టపరిహారం ఇచ్చేంత నష్టం జరగలేదని, ఎన్యూమరేషన్ నిర్వహించాలని తమకు ఆదేశాలు లేవని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు.

ఏలూరులో అధికారుల ప్రాథమిక నివేదిక సిద్ధం

ఏలూరు జిల్లాలో 108 పామాయిల్ చెట్లు దెబ్బతిన్నట్లు, అరటి, బొప్పాయి, నిమ్మకు 35 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక నివేదిక తయారు చేశారు.

కాల్పుల విరమణ ఇలా..

- తెరవెనుక అనేక చర్చలు
- భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచ దేశాలు అలర్ట్
- చర్చల కోసం ఇరు దేశాలకు పిలుపు
- ఎట్టకేలకు సీజ్‌ఫైర్‌కు ఓకే

న్యూఢిల్లీ : గతనెల 22న జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య పరిస్థితులు మారాయి. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ ఎలాంటి చర్యలు తీసుకోబోతుందన్న చర్చలు తీవ్రంగా మారాయి. భారత ప్రధాని మోడీ.. భద్రత దళాల ఉన్నతాధికారులతో సమావేశాలు, చర్చలు జరిపారు. ఈనెల 7న తెల్లవారుజామున 1.05 గంటలకు భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టింది. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)లలోని ఉగ్రస్థావరాలను మట్టుబెట్టటమే లక్ష్యంగా భారత్ దాడులు చేసింది. 25 నిమిషాల్లో భారత దళాలు ఈ ఆపరేషన్‌ను ముగించాయి. ఆ తర్వాత భారత సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్ (డిజిఎంఒ).. పాక్ డిజిఎంఒ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లాకు ఫోన్ చేసి.. పాక్, పిఒకెలలోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసిందని 1.30 గంటలకు తెలియజేశారు.

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సాయుధ దళాలు తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై 24 క్షిపణులను ప్రయోగించాయి. ఈ దాడులు కచ్చితమైనవి, తీవ్రతరం కానివనీ, పాక్ సైనిక ఆస్తులను లక్ష్యంగా చేసుకోలేదని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే ధ్వంసం చేశాయని భారత డిజిఎంఒ నొక్కి చెప్పారు. ఏప్రిల్ 22 ఘటన తర్వాత పాక్‌పై భారత చర్య ఎలా ఉండబోతున్నదన్న అంశంపై ప్రపంచ దేశాలు నిశితంగా పరిశీలించాయి. ఈ విషయంపై భారత్‌ను పలు ప్రపంచ దేశాలు సంప్రదించాయి. సరిహద్దు వెంబడి ఉగ్రవాద శిబిరాలు కొనసాగితే.. రెచ్చగొట్టే చర్యలకు బలమైన ప్రతిస్పందన ఉంటుందని భారత్ గతంలోనే స్పష్టం చేసింది. ఈనెల 1న భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్.. అమెరికా విదేశాంగ కార్యదర్శి, జాతీయ భద్రతా సలహాదారు మార్కో రూబియోతో ఫోన్‌లో మాట్లాడి ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు.

పలు దేశాల ఆందోళన

ఆపరేషన్ ముగిసిన వెంటనే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ మార్కో రూబియోతో పాటు ఇతర కీలక నేతలతో మాట్లాడారు. భారత్, పాక్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదమున్నదని అనేక దేశాలు ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఇందులో అమెరికా మాత్రమే కాకుండా సౌదీ అరేబియా, యుఎఇ, ఇరాన్, ఈజిప్ట్‌లు స్పష్టతను, సంయమనాన్ని కోరాయి. చర్చలను ప్రోత్సహించాయి. భారత స్వీయరక్షణ (సెల్ఫ్–డిఫెన్స్)కు 12 దేశాలు మద్దతు పలికాయి. .

బ్రిటన్ కార్యదర్శి చర్చలు

మే 9 రాత్రి పాకిస్తాన్.. జమ్మూకాశ్మీర్, పంజాబ్, రాజస్తాన్ అంతటా అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి భారీ షెల్లింగ్ నిర్వహించింది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రదేశాలలో డ్రోన్‌లు కనిపించాయి. ఒక్క పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోనే 15 డ్రోన్‌లు కనిపించాయి. రెడ్ అలర్ట్ తర్వాత వాటిలో చాలా వరకు నియంత్రించబడ్డాయి. అదేరోజు, బ్రిటీష విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ.. జైశంకర్‌తో మాట్లాడారు. దౌత్యపరమైన మార్గానికి, సంయమనానికి పిలుపునిచ్చారు. డిజిఎంఒ లైన్ తెరిచే ఉన్నదని జైశంకర్ తెలిపారు. లామీ.. పాక్ నాయకత్వంతో కూడా చర్చలు జరిపారు.

రంగంలోకి అమెరికా

మే 10న భారత వైమానిక దళం పాక్‌లోని రఫికి, మురిద్, చక్లాలా, రహీం యార్ ఖాన్, సుక్కూర్, చునియన్, పస్రూర్, సియాల్‌కోట్‌లలోని సైనిక లక్ష్యాలపై తీవ్రమైన కచ్చితమైన దాడులను నిర్వహించింది. ఈ దాడుల తర్వాత అమెరికా జోక్యం చేసుకున్నది. భారత్‌తో చర్చలు జరిపింది. అటు మర్కో రూబియో పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌తో మాట్లాడారు. పాక్ అభ్యర్థన మేరకే ఇది జరిగినట్టు తెలుస్తున్నది. పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించటానికి రెండు వైపులా మార్గాలను అన్వేషించాలని మార్కో రూబియో పిలుపునిచ్చారు. కొన్ని గంటల తర్వాత రూబియో.. జైశంకర్‌కు ఫోన్ చేశారు. చర్చలకు పాక్ సిద్ధంగా ఉన్నదని తెలియజేశారు. 'నిర్మాణాత్మక చర్చలు' అవసరమని చెప్పారు. డిజిఎంఒ లైన్లు మాత్రమే కమ్యూనికేషన్ ఛానల్‌గా ఉంటాయనీ, భారత్ ఎలాంటి రాజకీయ, దౌత్య మార్గాన్ని సక్రియం (యాక్టివేట్) చేయదని పునరుద్ఘాటించారు.

మోడీకి వాన్స్ ఫోన్.. కాల్పుల విరమణ ఖరారు

మే 10 తెల్లవారుజామున అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్.. భారత ప్రధాని మోడీకి ఫోన్ చేసి ఇలాంటి విజ్ఞప్తి చేశారు. పాక్ చేసే ఏదైనా దాడికి మరింత బలమైన ప్రతిస్పందన ఉంటుందని ఈ సందర్భంగా మోడీ చెప్పారు. అటు తర్వాత పాక్‌కు సమాచారం అందింది. మధ్యాహ్నం 1 గంటకు పాకిస్తాన్ డిజిఎంఒ.. భారత డిజిఎంఒకు ఫోన్ చేశారు. ఆ సమయంలో సమావేశాలు జరుపుతున్న భారత డిజిఎంఒ.. 3.35 గంటలకు రిటర్న్ కాల్ చేశారు. కాల్పుల విరమణ ప్రకటనలోని పదాల విషయంలో ఇరుపక్షాల మధ్య గణనీయమైన చర్చ జరిగింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఖరారైన వెంటనే.. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాయంత్రం సోషల్ మీడియా వేదికగా దీనిని ప్రకటించారు.

కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించటంపై భారత్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రతిపక్షాలు ఆందోళనను వ్యక్తం చేశాయి. ఈ విషయంలో ట్రంప్‌నకు మోడీ సరెండర్ అయ్యారని విమర్శించాయి.

ఆ 48 గంటల్లో పరిస్థితి తీవ్రం

మే 7న దాడుల తర్వాత 48 గంటల్లోనే పరిస్థితి తీవ్రమైంది. ప్రపంచ దేశాల నుంచి ఆందోళన తీవ్రంగా వ్యక్తమైంది. భారత్, పాక్‌ల మధ్య ప్రత్యక్ష చర్చలకు అమెరికా పిలుపునిచ్చింది. మధ్యవర్తిత్వం వహించటానికి కూడా ముందుకొచ్చింది. పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ రెండు దేశాలు చర్చలు జరపాలని, పౌరులకు భద్రతను నిర్ధారించాలని యూరోపియన్ యూనియన్ (ఇయు) కూడా పిలుపునిచ్చింది. ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో సౌదీ అరేబియా విదేశాంగ శాఖ సహాయ మంత్రి అదెల్ అల్జుబీర్ భారత్‌కు వచ్చి జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి కూడా ఇదే ప్రయత్నాలు చేశారు

కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఎంత ?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సిపిఐ(ఎం)
- ప్రపంచానికి అధ్యక్షుడిగా ట్రంప్ భావిస్తున్నారని ఎద్దేవా

అగర్తల : భారత్, పాకిస్తాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా జోక్యాన్ని సిపిఐ (ఎం) తీవ్రంగా నిరసించింది. భారత్, పాకిస్తాన్ కంటే ముందుగానే కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎలా ప్రకటన చేశారో వివరించాలని కేంద్రాన్ని కోరింది. సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ఆదివారం త్రిపుర రాజధాని అగర్తలలో విలేకరులతో మాట్లాడుతూ 'ద్వైపాక్షిక సమస్యలపై మూడో పక్షం మధ్యవర్తిత్వం అవాంఛనీయమన్నది మా పార్టీ విధానం. ద్వైపాక్షిక సమస్యలను ద్వైపాక్షికంగానే పరిష్కరించుకోవాలి' అని అన్నారు. అగర్తలలో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. 'దేశీయంగా ఉన్న సమస్యలను, పొరుగు దేశాలతో ఉన్న సమస్యలను అంతర్జాతీయం చేయడం ఆమోదయోగ్యం కాదని భారత ప్రభుత్వం కూడా గతంలో భావించింది. పొరుగు దేశాలతో నెలకొన్న సమస్యలను చర్చల ద్వారా, పరస్పర ఆమోదయోగ్యమైన పద్ధతిలో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. వివిధ ప్రాంతాలలో ఉద్రిక్తతలు సడలుతున్నాయి. కాల్పుల విరమణపై అందరి కంటే ముందుగానే అమెరికా అధ్యక్షుడు ఎలా ప్రకటించారో ప్రభుత్వం వివరించాలి' అని బేబీ చెప్పారు. భారత్ – పాకిస్తాన్ సరిహద్దు ఉద్రిక్తతలలో జోక్యం చేసుకోవాలని అమెరికా భావించడం లేదని ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ గతంలో చేసిన వ్యాఖ్యను బేబీ ప్రస్తావించారు. 'తాను ప్రపంచానికే అధ్యక్షుడిననే విధంగా అమెరికా అధ్యక్షుడు వ్యవహరిస్తున్నారు. ఇది ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు. భారత సైనిక ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్ (డిజిఎంఒ)తో పాకిస్తాన్ డిజిఎంఒ మాట్లాడిన తర్వాత కాల్పుల విరమణపై ఒప్పందం కుదిరిందని విదేశాంగ కార్యదర్శి చేసిన ప్రకటనను బేబీ గుర్తు చేస్తూ ట్రంప్ చెబుతున్న మాటలకు దీనితో పొంతన కుదరడం లేదని బేబీ చెప్పారు.

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సిపై 15లోగా స్పష్టతివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

నేటికీ పునరుద్ధరించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని తెలిపారు. ఆదివాసీ ప్రజాప్రతినిధుల అసమర్థత వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు వేల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగాలను వివిధ డిపార్టుమెంట్‌ల్లో స్థానిక ఆదివాసీలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పెషల్ డిఎస్‌సిపై ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసేదిగా ఉందన్నారు. 2025 మెగా డిఎస్‌సిలో 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, దానిలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని వివరించారు. తాజా డిఎస్‌సిలో 2024 పోస్టులు ఎస్‌టిలకు కేటాయించినట్టు గిరిజన శాఖ మంత్రి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, వీటిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. మెగా డిఎస్‌సిలో షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనులకు కేవలం 45 పోస్టులు మాత్రమే కేటాయించబడినట్టు తెలిపారు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల్లో పేర్కొన్న 3914 పోస్టుల్లోనూ, గిరిజన గురుకులాల్లో పేర్కొన్న జోన్–1, జోన్–2 ఉద్యోగాల్లోనూ ఆదివాసీలకు జరిగే అన్యాయాన్ని వివరించారు. ఇప్పటికే ఏకలవ్య మోడల్ స్కూళ్లలో సుమారు 500 పోస్టుల్లో ఉత్తర భారతదేశం నుంచి తీసుకొచ్చి నియమించారని గుర్తు చేశారు. మెగా డిఎస్‌సికి దరఖాస్తులు సమర్పించే చివరి తేదీ ఈ నెల 16 కావడంతో ఆదివాసీ నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన, ఆక్రోశం నెలకొందని తెలిపారు. ఈ క్రమంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు సమిరెడ్డి మాణిక్యం, కాంతారావు, పి.రాధ, రాజ్‌కుమార్, చందు, రమేష్, దాస్, సిహెచ్.రాజబాబు, కిముడు కొత్తయ్య, జీవన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ 18వ అఖిల భారత మహాసభ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ఎస్‌ఎఫ్‌ఐ 18వ అఖిల భారత మహాసభ లోగోను ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు ఎంఎ బేబీ ఆవిష్కరించారు. సోమవారం నాడిక్కడ హరి కిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో లోగో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సమాజంలో మతతత్వవాదులు పట్టు కోసం ప్రయత్నిస్తున్న ప్రస్తుత పరిస్థితిలో ఎస్‌ఎఫ్‌ఐ జోక్యం చాలా కీలకమని అన్నారు. '1970లో తిరువనంతపురంలో మొదటి అఖిల భారత సమావేశం జరిగినప్పుడు, ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వం 1.24 లక్షలని, నేడు దేశంలో అత్యంత బలమైన విద్యార్థి ఉద్యమం ఎస్‌ఎఫ్‌ఐ నిర్మించిందని అన్నారు. 18వ అఖిల భారత మహాసభ ఎస్‌ఎఫ్‌ఐ కృషిలో ఒక మైలురాయిగా నిలవాలన్నారు. 'విద్యార్థులను తప్పుడు దిశలో నడిపించడానికి మతపరమైన కోణాల నుండి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు ఎస్‌ఎఫ్‌ఐ ప్రతిపాదించిన రాజకీయ తీర్మానం చాలా ముఖ్యమైనది' అని పేర్కొన్నారు. ఆయన ఎస్‌ఎఫ్‌ఐ తొలి అఖిల భారత సమావేశం జ్ఞాపకాలను కూడా పంచుకున్నారు. జూన్ 26 నుండి 30 వరకు కోజికోడ్‌లో ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత సమావేశం జరగనుంది. మలప్పురంలోని వాలంచేరికి చెందిన లిబిన్ ఉన్నికృష్ణన్ లోగోను రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మాజీ నాయకులు నీలోత్పల్ బసు, అరుణ్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్, సహాయ కార్యదర్శులు దీప్సితా ధార్, ఆదర్శ్ ఎం సాజి, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ఐషీ ఘోష్, అధ్యక్షులు సూరజ్ ఎలామోన్, ఎంఎల్ అభిజిత్ పాల్గొన్నారు.

యుద్ధమంటే బాలివుడ్ సినిమా కాదు!

- దౌత్యానికే తొలి ప్రాధాన్యత
- ఆర్మీ మాజీ చీఫ్ నరవణె

న్యూఢిల్లీ : భారత్, పాకిస్తాన్‌లు సైనిక చర్యలకు స్వస్తి పలుకుతూ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఎదురవుతున్న విమర్శలపై ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణె తీవ్రంగా స్పందించారు. యుద్ధమంటే బాలివుడ్ సినిమా కాదని వ్యాఖ్యానించారు. కాల్పులు జరుగుతున్నాయంటే సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజల్లో తీవ్రమైన భయాందోళనలు రేకెత్తుతాయని అన్నారు. "యుద్ధం మొదలైందంటే చావు, విధ్వంసం చోటు చేసుకుంటాయి. కచ్చితంగా అందుకు మూల్యం చెల్లించాల్సి వుంటుంది." అని అన్నారు. "కాబట్టి యుద్ధమంటే అదేదో బాలివుడ్ సినిమాలో చూపించేలా రొమాంటిక్‌గా వుండదు. ఇది చాలా తీవ్రమైన అంశం. యుద్ధం లేదా హింస అనేది చిట్టచివరిగా చేపట్టాల్సిన అంశం. ముందుగా దౌత్యానికే ప్రాధాన్యత ఇవ్వాలి. తెలివితక్కువ వారి చేష్టలతో ఒకోసారి మనం కూడా యుద్ధాలు చేపట్టాల్సి వస్తూ వుంటుంది. కానీ అదేమీ ఆనందం కలిగించే అంశం కాదు, ఒక సైనికుడిగా ఆదేశిస్తే కచ్చితంగా నేను యుద్ధానికి వెళతా, కానీ అది నా ఫస్ట్ ఎంపికగా వుండదు, దౌత్యానికి నా మొదటి ప్రాధాన్యత, చర్చలతోనే విభేదాలను పరిష్కరించుకోవాలి, అంతేకాని సాయుధ ఘర్షణలకు వెళ్లరాదు." అని నరవణె సూచించారు. అలాగే దాడులు, యుద్ధాల వల్ల పునర్నిర్మాణ వ్యయమే కాకుండా, ధ్వంసమైన సైనిక సామాగ్రిని మళ్లీ సమకూర్చుకునే వ్యయాన్ని కూడా భరించాల్సి వుంటుంది." అని ఆయన వ్యాఖ్యానించారు.

పూనేలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వజ్రోత్సవాల్లో నరవణె ఆదివారం ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. "యుద్ధం, యుద్ధ విన్యాసాలు ఖరీదైన వ్యవహారం. ఇటువంటి ఘర్షణలు, యుద్ధాలతో కూడిన వాతావరణాన్ని వారాలు, నెలలల తరబడి సుదీర్ఘ కాలం మనం కొనసాగించినట్లైతే ...ఒక్కసారి ఊహించండి, తక్షణమే మనకు ఎంత నష్టం జరుగుతుందో.. యుద్ధం చివరిలో ఒక్కసారిగా మనం పునరావలోకనం చేసుకుంటే ఈ నష్టం ఏ స్థాయిలో వుంటుందో తెలుస్తుంది." అని ఆయన వ్యాఖ్యలు చేశారు.

అసలు ఈ కాల్పుల విరమణ మంచిదా, చెడ్డదా అని సమీక్షలు చేపడుతూ చాలామంది ప్రశ్నలు వేస్తున్నారు. కానీ వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని ఆలోచిస్తే, నష్టం మరీ ఎక్కువగా వాటిల్లకుండా ముందుగానే దౌత్య మార్గాన్ని చేపట్టడం తెలివైన వ్యక్తి తీసుకునే నిర్ణయమని అన్నారు. ఇప్పటికే మన దాడుల ద్వారా మన సైనిక సంపత్తి ఎలాంటిదో, మన దాడి సామర్థ్యం ఎలా వుంటుందో పాకిస్తాన్‌కు రుచి చూపించాం, వారి భూభాగంలోని ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టాం, వారి గగనతలంలోకి చొచ్చుకుపోయి దాడులు చేశామని చెప్పారు. జరిగిన నష్టాన్ని పరిగణనలోకి తీసుకునే వారు కూడా కాళ్ల బేరానికి వచ్చారని, డిజిఎంఒల చర్చలకు సిద్ధమయ్యారని చెప్పారు.

యుద్ధాలు చాలా తీవ్రమైన, కోలుకోలేని నష్టాలను కలిగిస్తాయి. వాటి వల్ల కలిగే బాధ వెంటాడుతునే వుంటుంది. సరిహద్దుల్లో కాల్పుల శబ్దాలు మొదలవగానే సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీసే పిల్లల బాధ గురించి ఎవరూ పట్టించుకోరు. పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు, వున్న ప్రాంతాల నుండి కొత్త ప్రాంతాలకు వలస వెళ్లిపోయే కుటుంబాలకు తరతరాలుగా ఈ బాధ, నొప్పి, ఆవేదన వెంటాడుతునే వుంటాయని ఆర్మీ మాజీ చీఫ్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పెరిగిన పిల్లలు 20ఏళ్ల తర్వాత కూడా చాలా దారుణంగా వ్యవహరిస్తుంటారని, అలాంటి వారికి మానసిక చికిత్స కూడా అవసరమవుతుందని అన్నారు.

మిస్రిపై ట్రోలింగ్‌పై మౌనమేల?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వామపక్షాలు

న్యూఢిల్లీ : అన్ని సైనిక చర్యలను నిలిపివేస్తూ భారత్, పాకిస్తాన్‌లు ఒక అవగాహనకు వచ్చాయని ఈ నెల 10వ తేదీన ప్రకటించిన నేపథ్యంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రిపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న బెదిరింపులు, ట్రోలింగ్‌పై మోడీ ప్రభుత్వం మౌనంగా వుండడాన్ని వామపక్షాలు ప్రశ్నించాయి. మిస్రి, ఆయన కుమార్తెలను ఆన్‌లైన్ ట్రోల్ చేస్తున్న వార్తకు సంబంధించిన ఫోటోను సిపిఎం ఎక్స్ పోస్టులో షేర్ చేసింది. "ప్రభుత్వం మౌనంగా ఎందుకు ఊరుకుంటోంది? ట్రోల్స్ చేయడం సిగ్గుచేటు" అని సిపిఎం వ్యాఖ్యానించింది. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని సిపిఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. భారత ప్రభుత్వం పరిగణించిన వైఖరిని మాత్రమే విదేశాంగ కార్యదర్శి వ్యక్తీకరించారని బ్రిట్టాస్ పేర్కొన్నారు.

"పాలకపక్షం ఆమోదించిన విధానాలను, నిర్ణయాలను ఆయన వ్యక్తీకరించడాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం, అందుకు ఆయనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని దూషించడం విచారాన్ని కలిగిస్తున్నాయి." అని బ్రిట్టాస్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ సైబర్ దాడి తర్వాత మిస్రి తన ఎక్స్ ప్రొఫైల్‌ను నిలిపివేశారు.

"ప్రభుత్వ విధానాలకు కేవలం కట్టుబడినందుకు ఎదురయ్యే దూషణ ఛీత్కారాలను తప్పించుకునేందుకు దేశంలోనే సీనియర్ మోస్ట్ అయిన దౌత్యవేత్త ఇలా డిజిటల్ వేదిక నుండి ఉపసంహరించుకున్న వాస్తవం అనూహ్యమైనది, ఆందోళన కలిగిస్తోంది." అని ఆయన వ్యాఖ్యానించారు. ఎలాంటి భయం, బెదిరింపులు లేకుండా తమ విధులు నిర్వహించుకునేందుకు ఉద్యోగులకు గల అవకాశాలు వేగంగా కుంచించుకుపోతుండడం గురించి ఒక దుష్ట సంకేతాన్ని పంపిస్తోందని బ్రిట్టాస్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్ని నర్వాల్‌పై కూడా ఇలాగే ఆన్‌లైన్ ట్రోలింగ్ జరిగిందని బ్రిట్టాస్ గుర్తు చేశారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ, విద్వేష రాజకీయాలే ఈ పరిస్థితికి దారి తీశాయన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ బాహాటంగా దీని గురించి మాట్లాడి, సమస్యను పరిష్కరించాలన్నారు. మిస్రి ఏమీ సామాన్య వ్యక్తి కాదు, ఆయనో ఉన్నతస్థాయి అధికారి. ఆయనకే రక్షణ లేనప్పుడు ఇక ఎవరికి వుంటుందని రాజా ప్రశ్నించారు. ప్రభుత్వం రెచ్చగొడుతున్న దూకుడుతో కూడిన జాతీయవాదం ఫలితమే ఇదని రాజా వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రకటించినందుకు మిస్రిని ఎందుకు ట్రోల్ చేస్తున్నారని సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "దూకుడుతో కూడిన జాతీయవాద భావాలను రెచ్చగొట్టే వ్యక్తులు అడ్డూ అదుపు లేకుండా చేసే ఇలాంటి దూషణలతో కూడిన ట్రోలింగ్‌ను ఎదుర్కొంటున్న భారత విదేశాంగ కార్యదర్శి తన ఎక్స్ హ్యాండిల్‌ను కాపాడుకోవాల్సి వచ్చింది. ప్రధాని తీసుకున్న నిర్ణయానికి విదేశాంగ కార్యదర్శిని ఎందుకు ట్రోల్ చేస్తారు? ఉగ్రవాదుల మతోన్మాద కుట్రను భగ్నం చేసినందుకు భారత ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేసినందుకా?' అని ప్రశ్నించారు.

పంటల బీమా అస్తవ్యస్తం

(మొదటి పేజీ తరువాయి)

వాటాను పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. రాష్ట్రం తన వాటా పెట్టుకోలేదన్న సాకుతో కేంద్రమూ తన వాటా ప్రీమియాన్ని జమ చేయలేదు. ఆ మూడు సీజన్లలో కరువు, తుపాన్లు, వరదలు లక్షల ఎకరాల్లో పంటలను కబళించి రైతులను ఆర్థికంగా కుంగదీశాయి. నేటికీ క్లెయిములు లేవు.

బకాయిల జోలికిపోని కూటమి

వైసిపి సర్కారు 2022 రబీ (ఫసల్) ప్రీమియం రూ.644 కోట్లు, 2023–24 ఖరీఫ్, రబీలకుగాను ఫసల్, వాతావరణ బీమాకు రూ.1,344 కోట్లు కంపెనీలకు చెల్లించాలని కూటమి సర్కారు వెల్లడించింది. ఆ మొత్తాన్నీ తాము చెల్లించి రైతులకు బీమా పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చింది. రూ.2 వేల కోట్లకుపైన ఇప్పటికీ చెల్లించలేదని సమాచారం. సమగ్ర పంటల బీమా పేరిట కేంద్ర పథకాలతో కలిసి 2024–25 రబీ నుంచి బీమా అమలు చేస్తోంది. ఉచిత పంటల బీమాను ఎత్తేసింది. బీమా చేయించుకోవడాన్ని రైతుల ఇష్టాఇష్టాలకు వదిలేసింది. 2024 ఖరీఫ్ మట్టుకు ఉచిత పంటల బీమాను అమలు చేసింది. పూర్తి స్థాయిలో ప్రీమియం చెల్లించలేదు. కేంద్రం సైతం తగిన విధంగా తన వాటా నిధులివ్వలేదు. దాంతో విపత్తుల్లో పంటలు కోల్పోయిన రైతులెవ్వరికీ పరిహారం అందలేదు.

బీమా పరిస్థితి

సీజన్	రైతుల సంఖ్య లక్షలు	విస్తీర్ణం లక్షల ఎకరాలు	రాష్ట్ర వాటా ప్రీమియం రూ.కోట్లు	కేంద్రం వాటా ప్రీమియం రూ.కోట్లు	మొత్తం ప్రీమియం రూ.కోట్లు
ఫసల్ బీమా					
2022 రబీ	15.22	38.45	642	443	1,090
2023 ఖరీఫ్	22.68	48.82	462	95	558
2023 రబీ	12.92	49.22	283	123	406
2024 ఖరీఫ్	23.85	50.75	304	50	354
2024 రబీ	2.91	9.57	81	81	193
(రైతుల ప్రీమియం 31 కోట్లు)					
వాతావరణ బీమా					
2023 ఖరీఫ్	7.40	17.95	449	179	628
2023 రబీ	1.92	4.00	128	49	173
2024 ఖరీఫ్	8.00	19.57	530	209	739
2024 రబీ	0.15	0.32	007	007	20
(రైతుల ప్రీమియం 6 కోట్లు)					

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : 27 బికెసి, సి 27, జి బ్లాక్, బాంద్ర కుర్ల కాంప్లెక్స్, బాంద్ర (ఈ), ముంబయి–400051
కార్పొరేట్ కార్యాలయం : కొటక్ ఇన్‌ఫినిటి, బిల్డింగ్ నెం.21, ఇన్‌ఫినిటి పార్క్, జనరల్ ఏ.కే వైద్య మార్గ్, మలాడ్ (ఈ), ముంబాయి–400097 www.kotak.com

వేలం-నోటీసు

క్రింద పేర్కొన్న ప్రకారం, దిగువ తెలిపిన రుణగ్రహీత/లు బంగారు ఆభరణాలు/వస్తువులను సెక్యూరిటీగా పెట్టి బంగారు రుణ సదుపాయం పొంది ఉన్నారు. బాకీ మొత్తాలు మరియు వాయిదాలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత/లు విఫలమైనారు మరియు బాకీ మొత్తాలు తిరిగి చెల్లించుటకు రుణగ్రహీతలను పిలుస్తూ నోటీసులను జారీ చేయడమైనది. అయినప్పటికి, రుణగ్రహీత/లు బాకీ మొత్తాలను తిరిగి చెల్లించుట/క్లియర్ చేసుకోవడంలో విఫలమైనందున బ్యాంకు పేరునా తాకట్టుగా ఉన్న బంగారు ఆభరణాలను బ్యాంకు స్వాధీనపరుచుకొని వేలం వేస్తుంది.

దిగువ పేర్కొన్న బంగారు ఆభరణాల వేలం తేది/తర్వాత ఇక్కడ నిర్వహించబడుతుంది :తేది : 23-మే-2025,
సమయం : ఉ.11.00 గం.లకు, ప్రదేశం : సంబంధిత శాఖ ఆవరణలు

ఎపిఐఎల్‌ఎపిఐసి	కక్షీదారుని పేరు	రాష్ట్రం	ఉప ప్రదేశం	శాఖ పేరు	స్థూల బరువు	వేలం తేది
GLN3689957	సూర్యదేవర హేమ మహేశ్వరి	ఆం.ప్ర	విజయవాడ	లబ్బీపేట	359.9	23-05-2025 తేదిన/తరువాత
GLN3757503	గొల్ల రామవెంకట సూర్య కె మూర్తి	ఆం.ప్ర	విజయవాడ	అమలాపురం	213.1	23-05-2025 తేదిన/తరువాత
GLN3743656	సయ్యద్ రహీమ్	ఆం.ప్ర	విజయవాడ	నరసరావుపేట	207	23-05-2025 తేదిన/తరువాత
GLN3628742	ఎన్ అరుంధతి	ఆం.ప్ర	విజయవాడ	కర్నూలు	236.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3721590	లతిక వెంకటేష్	ఆం.ప్ర	విజయవాడ	నరసరావుపేట	147.9	23-05-2025 తేదిన/తరువాత
GLN3625995	మునం గంగాధర్ రెడ్డి	ఆం.ప్ర	విజయవాడ	గిద్దలూరు	150.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3718782	గుత్తికొండ బాల మురళీకృష్ణ	ఆం.ప్ర	విజయవాడ	గాయత్రి నగర్	161.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3693038	షేక్ అసబి	ఆం.ప్ర	విజయవాడ	మెయిన్‌రోడ్డు	174.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3718744	గుత్తికొండ బాల మురళీకృష్ణ	ఆం.ప్ర	విజయవాడ	గాయత్రినగర్	146.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3707422	అబ్దుల్ రహమాన్	ఆం.ప్ర	విజయవాడ	లబ్బీపేట	129.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3708611	చింతల సుబ్బారెడ్డి	ఆం.ప్ర	విజయవాడ	నరసరావుపేట	133.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3740113	మునం గంగాధర్ రెడ్డి	ఆం.ప్ర	విజయవాడ	గిద్దలూరు	135.81	23-05-2025 తేదిన/తరువాత
GLN3473723	మన్నె బుచ్చయ్య	ఆం.ప్ర	విజయవాడ	విద్యానగర్	131.2	23-05-2025 తేదిన/తరువాత
GLN3473742	మన్నె బుచ్చయ్య	ఆం.ప్ర	విజయవాడ	విద్యానగర్	119.4	23-05-2025 తేదిన/తరువాత
GLN3513012	దాసరి రూపేంద్ర	ఆం.ప్ర	విజయవాడ	రామచంద్రాపురం	130.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3692094	సూర్యదేవర హేమ మహేశ్వరి	ఆం.ప్ర	విజయవాడ	లబ్బీపేట	124.9	23-05-2025 తేదిన/తరువాత
GLN3626012	మునం గంగాధర్ రెడ్డి	ఆం.ప్ర	విజయవాడ	గిద్దలూరు	100.8	23-05-2025 తేదిన/తరువాత
GLN3510227	ఎస్.తాసీన్	ఆం.ప్ర	విజయవాడ	కిలికిలి	109.5	23-05-2025 తేదిన/తరువాత
GLN3631266	బొండిలి సత్య బాయి	ఆం.ప్ర	విజయవాడ	మార్కాపురం	88.5	23-05-2025 తేదిన/తరువాత
GLN3481256	ధనేకుల యశ్వంత్ చౌదరి	ఆం.ప్ర	విజయవాడ	సత్యనారాయణపురం	92.1	23-05-2025 తేదిన/తరువాత
GLN3626027	మునం గంగాధర్ రెడ్డి	ఆం.ప్ర	విజయవాడ	గిద్దలూరు	84.2	23-05-2025 తేదిన/తరువాత
GLN3733900	మోర్ వెంకటేష్	ఆం.ప్ర	విజయవాడ	రామ్‌నగర్	81.1	23-05-2025 తేదిన/తరువాత
GLN3707885	ముత్యాల చంద్రశేఖర్	ఆం.ప్ర	విజయవాడ	తాడేపల్లిగూడెం	70.4	23-05-2025 తేదిన/తరువాత
GLN3610887	గొట్టుముక్కల రమేష్ రాజు	ఆం.ప్ర	విజయవాడ	గాజువాక	67.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3633870	సూర్యదేవర హేమ మహేశ్వరి	ఆం.ప్ర	విజయవాడ	లబ్బీపేట	70	23-05-2025 తేదిన/తరువాత
GLN3732073	గరుగుబెల్లి శ్రీధర్	ఆం.ప్ర	విజయవాడ	గాజువాక	65.1	23-05-2025 తేదిన/తరువాత
GLN3473983	కొత్తపల్లి శ్రీ చందన	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	67.73	23-05-2025 తేదిన/తరువాత
GLN3716891	వేదుళ్ల దిలీప్ చౌదరి	ఆం.ప్ర	విజయవాడ	తాడేపల్లిగూడెం	63.2	23-05-2025 తేదిన/తరువాత
GLN3505827	కొత్తపల్లి శృజన	ఆం.ప్ర	విజయవాడ	లలితానగర్	66.08	23-05-2025 తేదిన/తరువాత
GLN3674178	యడ్ల లక్ష్మి	ఆం.ప్ర	విజయవాడ	సత్యనారాయణపురం	59.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3706248	కొమ్మినేని ఉమా శంకర్	ఆం.ప్ర	విజయవాడ	తిరుపతి	61.4	23-05-2025 తేదిన/తరువాత
GLN3559839	అల్లి సాయి వెంకట సత్య ఇఎస్ నిఖిల్	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	52.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3554481	చింత వెంకట రమణ	ఆం.ప్ర	విజయవాడ	అమలాపురం	47.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3528680	ఎమ్ జగదీష్ చౌదరి	ఆం.ప్ర	విజయవాడ	కర్నూలు	47.8	23-05-2025 తేదిన/తరువాత
GLN3586496	చందన రంగారావు	ఆం.ప్ర	విజయవాడ	ఎమ్‌జి రోడ్డు	45	23-05-2025 తేదిన/తరువాత
GLN3159285	సలీమ్ రాజు	ఆం.ప్ర	విజయవాడ	రావులపాలెం	47.4	23-05-2025 తేదిన/తరువాత
GLN3718671	బండ స్వర్ణలత	ఆం.ప్ర	విజయవాడ	అనంతపురం	35.1	23-05-2025 తేదిన/తరువాత
GLN3740093	సుందల రవికుమార్	ఆం.ప్ర	విజయవాడ	గిద్దలూరు	34.8	23-05-2025 తేదిన/తరువాత
GLN3512658	దివ్వెల నాగభద్రినాథ్	ఆం.ప్ర	విజయవాడ	చీరాల	46.4	23-05-2025 తేదిన/తరువాత
GLN3738214	కుడుపూడి పురుషోత్తమరావు	ఆం.ప్ర	విజయవాడ	తాడేపల్లిగూడెం	37.5	23-05-2025 తేదిన/తరువాత
GLN3721383	వాక శివ నాగేంద్రం	ఆం.ప్ర	విజయవాడ	తెనాలి	34.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3475261	కొత్తపల్లి శ్రీచందన	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	34.9	23-05-2025 తేదిన/తరువాత
GLN3514553	సయ్యద్ సుభాన్	ఆం.ప్ర	విజయవాడ	రామచంద్రాపురం	33.8	23-05-2025 తేదిన/తరువాత
GLN3516145	బచ్చలకూర కమల	ఆం.ప్ర	విజయవాడ	తెనాలి	32.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3690840	ఆర్. యుగంధర్ రెడ్డి	ఆం.ప్ర	విజయవాడ	పలమనేరు	41.2	23-05-2025 తేదిన/తరువాత
GLN3721379	వాక శివ నాగేంద్రం	ఆం.ప్ర	విజయవాడ	తెనాలి	28.5	23-05-2025 తేదిన/తరువాత
GLN3700990	నూతంగి ప్రశాంతి	ఆం.ప్ర	విజయవాడ	తాడేపల్లిగూడెం	25.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3751830	గవిడి గణేష్	ఆం.ప్ర	విజయవాడ	లలితానగర్	25.26	23-05-2025 తేదిన/తరువాత
GLN3730067	కంద్రాగుల మహాలక్ష్మి	ఆం.ప్ర	విజయవాడ	రామ్‌నగర్	24.2	23-05-2025 తేదిన/తరువాత
GLN3534322	దివి వెంకట నాగ సాయి కుమార్	ఆం.ప్ర	విజయవాడ	తెనాలి	32.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3682888	బొక్కెన కుసుమ కుమారి	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	26.68	23-05-2025 తేదిన/తరువాత
GLN3710785	వరె శివకుమారి	ఆం.ప్ర	విజయవాడ	తెనాలి	20.3	23-05-2025 తేదిన/తరువాత
GLN3725069	గుల్లంకి కిరణ్ బాబు	ఆం.ప్ర	విజయవాడ	ఎమ్‌జి రోడ్డు	20	23-05-2025 తేదిన/తరువాత
GLN3456701	కె సి అంజినప్ప	ఆం.ప్ర	విజయవాడ	మెయిన్ రోడ్డు	24.8	23-05-2025 తేదిన/తరువాత
GLN3609825	రేగన శివకుమార్	ఆం.ప్ర	విజయవాడ	గాజువాక	20.2	23-05-2025 తేదిన/తరువాత
GLN3717444	ఒసూరి రాజు	ఆం.ప్ర	విజయవాడ	పోరుమామిళ్ల	24.3	23-05-2025 తేదిన/తరువాత
GLN3166121	గొల్లపల్లి బాబు	ఆం.ప్ర	విజయవాడ	అమలాపురం	26.4	23-05-2025 తేదిన/తరువాత
GLN3758093	పెదపూడి సుబోధ్ కుమార్	ఆం.ప్ర	విజయవాడ	ఎమ్‌జి రోడ్డు	21.4	23-05-2025 తేదిన/తరువాత
GLN3690710	షేక్ సుభాని	ఆం.ప్ర	విజయవాడ	నరసరావుపేట	16.2	23-05-2025 తేదిన/తరువాత
GLN3720681	కొత్తపల్లి ప్రకాశరావు	ఆం.ప్ర	విజయవాడ	నరసరావుపేట	15.8	23-05-2025 తేదిన/తరువాత
GLN3633977	ఇర్లంకి నాగ అరుణ	ఆం.ప్ర	విజయవాడ	రావులపాలెం	16	23-05-2025 తేదిన/తరువాత
GLN3739119	సింహాద్రి అప్పలాచారి	ఆం.ప్ర	విజయవాడ	వెంకోజిపాలెం	14.5	23-05-2025 తేదిన/తరువాత
GLN3682908	బొక్కెన కుసుమ కుమారి	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	17	23-05-2025 తేదిన/తరువాత
GLN3443537	పి రామమోహనరెడ్డి	ఆం.ప్ర	విజయవాడ	మెయిన్‌రోడ్డు	29.3	23-05-2025 తేదిన/తరువాత
GLN3714740	అదారి లోకేష్ భాస్కర్	ఆం.ప్ర	విజయవాడ	రామ్‌నగర్	14	23-05-2025 తేదిన/తరువాత
GLN3682835	బొక్కెన కుసుమ కుమారి	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	12.1	23-05-2025 తేదిన/తరువాత
GLN3680760	గురుగుబెల్లి శ్రీధర్	ఆం.ప్ర	విజయవాడ	గాజువాక	12.1	23-05-2025 తేదిన/తరువాత
GLN3488382	నెబర్తి అరుణ్ కిరణ్	ఆం.ప్ర	విజయవాడ	వెంకోజిపాలెం	14.3	23-05-2025 తేదిన/తరువాత
GLN3689378	అడ్లూరు కృష్ణవేణి	ఆం.ప్ర	విజయవాడ	తిరుపతి	12.1	23-05-2025 తేదిన/తరువాత
GLN3600677	కొత్తపల్లి శ్రీచందన	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	11.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3682912	బొక్కెన కుసుమ కుమారి	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	13.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3754177	షేక్ ఆయుష	ఆం.ప్ర	విజయవాడ	పెద్దరావూరు	13.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3715346	అదారి రాజశేఖర్	ఆం.ప్ర	విజయవాడ	అనకాపల్లి	13.9	23-05-2025 తేదిన/తరువాత
GLN3482855	కొలిమి దుర్గన్న	ఆం.ప్ర	విజయవాడ	ఆదోని	11.9	23-05-2025 తేదిన/తరువాత
GLN3453506	బొల్లె రాణి	ఆం.ప్ర	విజయవాడ	మెయిన్‌రోడ్డు	9.8	23-05-2025 తేదిన/తరువాత
GLN3477389	కర్రి విజయ భాస్కరరెడ్డి	ఆం.ప్ర	విజయవాడ	తాడేపల్లిగూడెం	9.8	23-05-2025 తేదిన/తరువాత
GLN3554540	కాకుళ్ల సురేష్	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	8.6	23-05-2025 తేదిన/తరువాత
GLN3637368	శంకూరి రాజారావు	ఆం.ప్ర	విజయవాడ	అరండల్‌పేట	7.3	23-05-2025 తేదిన/తరువాత
GLN3471119	జమ్మన శంకరరావు	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	6.9	23-05-2025 తేదిన/తరువాత
GLN3569995	మామిడిశెట్టి గాయత్రి	ఆం.ప్ర	విజయవాడ	ద్వారకానగర్	5.9	23-05-2025 తేదిన/తరువాత
GLN3725353	శంకూరి రాజారావు	ఆం.ప్ర	విజయవాడ	అరండల్‌పేట	6.3	23-05-2025 తేదిన/తరువాత
GLN3538529	కాకుమాను శ్రీనివాసరావు	ఆం.ప్ర	విజయవాడ	నరసరావుపేట	5.7	23-05-2025 తేదిన/తరువాత
GLN3507220	కొంగలేటి ప్రేమరాజు	ఆం.ప్ర	విజయవాడ	అరండల్‌పేట	6.3	23-05-2025 తేదిన/తరువాత

వేలం తేదిన రెండు ప్రస్తుత ఫోటోగ్రాఫ్‌లతో పాటు వెరిఫికేషన్ కొరకు ఓరిజినల్‌తో పాటు సంతకం మరియు చిరునామా గల వారి ఫోటో–ఐడెంటిటీ కాపీని సమర్పించగలరని బిడ్డర్లను అభ్యర్థించడమైనది. బిడ్డర్లకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా వేలం ను రద్దు లేదా వేలం యొక్క ప్రదేశం/తేది/సమయం మార్చే హక్కు బ్యాంకుకు కలదు.
వేలం ప్రక్రియకు అయ్యే ఖర్చు ఖాతాదారు ఖాతాకు డెబిట్ అవుతుంది. బిడ్ మొత్తం ఖాతా మొత్తం చెల్లించుటలో తక్కువైనట్లయితే ఖాతాదారుని నుండి మిగిలిన మొత్తంను వసూలు చేసే హక్కు బ్యాంకుకు కలదు.
వేలం యొక్క నియమాలు మరియు నిబంధనల సంబంధించి ఏవైనా పూర్తి వివరాల కొరకు, మీరు అవసరమైతే దిగువ తెలిపిన వ్యక్తి/లను సంప్రదించగలరు.

కొటక్ మహీంద్రా బ్యాంక్ లిమిటెడ్ ఫోన్- 9110330228

వేసవి విడిది

చిన్ననాటి ఆటలు

వేసవి సెలవులు రావడంతో తాతయ్య ఊరికి వస్తాడు ప్రశాంత్. తను బాగా చదువుతాడు. కానీ, బయటకెళ్లి స్నేహితులతో అస్సలు ఆడడు. ఇంట్లోనే సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడుకుంటాడు. ఆ అలవాటుతోనే తాతయ్య ఇంట్లో కూడా సెల్ ఫోన్ చూస్తూ ఉన్నాడు. తాతయ్యకి ఇది నచ్చలేదు. ప్రశాంత్‌ని ఎలాగైనా బయట ఆడుకునే ఆటలవైపు మళ్లించాలనుకున్నాడు.

ఒక రోజు తాతయ్య ప్రశాంత్‌ను తన స్నేహితుడు మల్లయ్య దగ్గరికి తీసుకెళ్లాడు. తాతయ్యలిద్దరూ ఒక చెట్టుకింద కూర్చొని హాయిగా మాట్లాడుకుంటూ పులి, మేక ఆట ఆడుకున్నారు. ఆ ఆటను చూసిన ప్రశాంత్‌కి దానిపై ఆసక్తి కలిగింది. సెల్‌ఫోన్ పక్కన పడేసి నిదానంగా తాతయ్య పక్కకి చేరాడు. 'ఇది ఏం ఆట తాతయ్య' అని అడిగాడు. 'దీనిని పుంజీతం ఆట అంటారు. ఇందులో ఉన్న రెండు పులులను మేకలు కట్టడి చేయాలి' అని తాతయ్య చెప్పాడు.

అప్పుడు పక్కనే ఉన్న మల్లయ్య తాత, 'ఇవే కాదోయ్! మేము చిన్నప్పుడు అనేక ఆటలు ఆడేవాళ్ళం. కోతికొమ్మచ్చి, సిర్రగోనె, కబడ్డీ, దాగుడు మూతలు, అష్టా చెమ్మ, తొక్కుడు బిళ్ళ మొదలగు అనేక ఆటలు అడేకునేవాళ్లం. ఆ ఆటలు ఆడటం వల్ల మేము చాలా ఆరోగ్యంగా, స్నేహంగా ఉండేవాళ్లం' అని చెప్పాడు.

వెంటనే ప్రశాంత్ 'తాతయ్య ఆ ఆటలు నాకు కూడా నేర్పించవా' అని అడిగాడు. 'కొంతమంది స్నేహితులను నీతో తీసుకురా. అప్పుడు వాటిని నేర్పిస్తా' అని తాతయ్య అన్నాడు. ప్రశాంత్ ఇంటివైపు పరుగు లంకించుకున్నాడు. అది చూసి, తాతయ్య ఎంతో సంతోషించాడు. ఆ విధంగా ప్రశాంత్ తన వేసవి సెలవులను ఎంతో సంతోషంగా గడిపాడు.

– దారవేణి రచిత,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల,
నర్సింహులపల్లి,
పెద్దపల్లి జిల్లా.

భరత నాట్యం

హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు నైనిక. నేను ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాశాను. మా నాన్న గారు డా.కె.మనోహర్. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ప్రొఫెసర్. మా అమ్మ పి.సుజాత. రాజమండ్రి సర్వజన ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్. నాకు భరత నాట్యం అంటే చాలా ఇష్టం. రాజమండ్రిలోని డా.సప్పా దుర్గారావు గురువు దగ్గర నేర్చుకుంటున్నాను. భరతనాట్యంలో అభినయం, వ్యక్తీకరణ కళ, వస్త్రధారణ, సంగీతం, లయ, శ్లోకం వంటి అనేక అంశాలు వున్నాయి. నేను మా గురువు గారి ఆధ్వర్యంలో అనేక ప్రదర్శనలు ఇచ్చాను. ప్రముఖులతో ప్రశంసాపత్రాలు తీసు కున్నాను. చదువుతో పాటు భరత నాట్య ప్రదర్శనలలో మరింత గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను.

– కె. నైనిక,
10వ తరగతి,
ఢిల్లీ పబ్లిక్ స్కూలు,
రాజమండ్రి,
94418 72472.

బొమ్మల కొలువు

సయ్యద్ ఉమర్ ఫవాజ్,
1వ తరగతి,
రాజంపేట.



పి.లక్ష్మీప్రియబాయి,
8వ తరగతి,
యం.తిమ్మాపురం, ఆదర్శ పాఠశాల,
మహానంది(మం), నంద్యాల జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన the family

జీవన సౌరభం

భయంతో ఏ పనిచేసినా విజయాన్ని సాధించలేము.. వివేకంతో చేసే పని సత్ఫలితాన్నిస్తుంది.

గ్రామీణ విద్యార్థులకు

అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్య

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంజనీరింగ్ విద్య అందుతోంది. ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సులో 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇచ్చాం. ఏప్రిల్ 27 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. మేనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా అభ్యర్థులను కోరాం. ఇప్పటికే దరఖాస్తులు చాలా వరకూ వచ్చాయి. వర్శిటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవటానికి గడువు ఇంకా ఉంది. కాబట్టి రాబోయే రోజుల్లో ఇంకా దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నాం. ఈ సారి రెండు నెలలకు ముందుగానే దరఖాస్తుల పక్రియను ప్రారంభించాం. ఎంపికైన అభ్యర్థుల జాబితాను జూన్ 5న విడుదల చేస్తాం. 11 నుంచి ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. పీహెచ్‌సీ, క్యాప్, ఎన్‌సిసి, స్పోర్ట్స్, స్కౌట్స్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపులోనే జరుగుతాయి. ఒక్కో క్యాంపస్‌లో 1000 సీట్లు, అదనంగా ఈడబ్ల్యుఎస్ సీట్లు 100 ఉన్నాయి. మొత్తం నాలుగు క్యాంపస్‌లలో కలిపి 4400 సీట్లు భర్తీ చేయబోతున్నాం.

మెరిట్‌కే ప్రాధాన్యత

పీయూసీకి ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.45 వేలు, ఇంజనీరింగ్‌కు ఏడాదికి రూ.50వేలుగా నిర్ణయించారు. ఆంధ్రేతర రాష్ట్రాల వారికి 25 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ అభ్యర్థులు ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.1.50 లక్షలు చెల్లించాల్సివుంది. పీయూసీ తర్వాత ట్రిపుల్‌ఐటి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. దరఖాస్తులో అభ్యర్థి మెరిట్ కేటగిరీ వారిచ్చిన ప్రాధాన్యం ప్రకారం క్యాంపస్ కేటాయింపు ఉంటుంది. ఒకసారి క్యాంపస్ కేటాయించిన తర్వాత బదిలీలు అనుమతించబోము.

రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఎస్సీ సబ్‌ప్లాన్ క్లాసిఫికేషన్ ప్రకారం సీట్ల భర్తీ ఉంటుంది. గతంలో మాదిరిగా సీటు దొరుకుతుందో లేదో అనుకుని వేరే కళాశాలలో చేరి మళ్లీ ఇక్కడ సీటు వస్తే అక్కడ నగదు వదులుకుని ఇక్కడకు రావటం వంటి ఇబ్బందులు పడే ప్రసక్తి ఉండదు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఈసారి ఆంధ్రా యూనివర్శిటీ పరిధిలోని జిల్లాలకు 65.62 శాతం, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పరిధిలోని జిల్లాలకు 34.38 శాతం కేటాయించాం.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం

ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటిల్లో నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా ఉన్నాయి. నాణ్యమైన విద్యను అందిస్తున్న ట్రిపుల్ ఐటిల్లో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రామీణ, పేద మధ్యతరగతి విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యను అందించేందుకు 2008లో రాష్ట్రప్రభుత్వం ట్రిపుల్‌ఐటిలను ప్రారంభించింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం బాసర ట్రిపుల్‌ఐటి కళాశాల తెలంగాణాకు వెళ్లింది. దీంతో 2016 నుంచి రాష్ట్రంలో ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్‌ఐటిలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఏటేటా ప్రవేశాలు జరుగుతుండగా వేలాదిమంది చేరుతున్నారు. ఆయా జిల్లాలకు కేటాయించే సీట్ల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు అవకాశం లభించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిని విద్యార్థులకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది.ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు రుసుం రూ.200, బీసీ, ఈడబ్ల్యుఎస్, ఓసీ అభ్యర్థులు రూ.300 చెల్లించాల్సివుంది.

డిజిటల్ బోధన

ఒకప్పుడు రాష్ట్రంలో ఇడుపులపాయ, నూజివీడులలో మాత్రమే రెండు ట్రిపుల్ ఐటీలు ఉండేవి. రాష్ట్ర విభజన అనంతరం మరో రెండు ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేయగా అందులో ఒకటి 2016–17 విద్యాసంవత్సరంలో శ్రీకాకుళంలో నెలకొల్పారు. దీనివల్ల ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల విద్యార్థులకు తక్కువ దూరంలోనే నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చినట్లయింది.

డిజిటల్ బోధన

ఆర్జీయూకేటీలో విద్యార్థులకు ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ కోర్సును అందిస్తున్నాం. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో డిజిటల్ తరగతి గదుల్లో లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో విద్యాభ్యాసం జరుగుతుంది. మొదటి రెండేళ్ల ఇంటర్‌తో సమానమైన పీయూసీ– 1, పీయూసీ– 2 కోర్సును పూర్తి చేయాలి. తరువాత ఇంజనీరింగ్‌లో ప్రవేశాలు పొంది నాలుగేళ్ల చదవాలి. ఒకవేళ మొదటి రెండేళ్ల తరువాత ఇంటర్‌తోనే విద్యార్థి బయటకు వచ్చేందుకు కూడా అవకాశం ఉంది. నిత్యం ఆన్‌లైన్‌లో విద్యాభ్యాసం సాగించే విద్యార్థుల ఒత్తిడిని దూరం చేసేందుకు ఉదయం వ్యాయామం, యోగా, క్రీడలతో విద్యార్థుల రోజువారీ కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం క్రీడలు, సంగీతం, నత్యం వంటి వివిధ సాంస్కతిక కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు తరగతులు జరుగుతాయి.

ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ బడుల్లో చదువుకున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో సాంకేతిక విద్యనందించాలనే లక్ష్యంతో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు అదనంగా 4 శాతం మార్కులు జోడించి ఎంపిక జాబితా ప్రకటిస్తాం. జాతీయ నూతన విద్యావిధానానికి అనుగుణంగా కోర్సులో మార్పులు చేశాం. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యాక ప్రాంగణాల మధ్య విద్యార్థులకు అంతర్గత బదిలీ అవకాశం లేదు. కౌన్సెలింగ్ తేదీలతో సహా పూర్తి సమాచారం www.rgukt.in వెబ్‌సైట్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది.

- సంద్ర అమరేంద్రకుమార్
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్జీయూకేటీ) రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్, ప్రవేశాల కన్వీనర్,
సెల్ : 80087 31515



చౌదరి-ఎన్టీఆర్ సినిమా ప్రారంభం

నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు తారకరామారావు నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. వైవిఎస్ చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. న్యూటాలెంట్ రోర్స్ పతాకంపై ఆయన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ సరసన వీణారావు కథానాయికగా నటిస్తోంది. తెలుగమ్మాయి అయిన ఆమె కూచిపూడి డ్యాన్సర్. కొత్తగా రామారావు, వీణారావును తెలుగు చిత్ర సీమకు పరిచయం చేస్తున్నారు. 'దేవదాసు'తో రామ్‌ని, 'రేయ్' చిత్రంతో సాయిధరమ్‌తేజ్‌ని కథానాయకులుగా ఆయన పరిచయం చేశారు. ఇప్పుడు నందమూరి కుటుంబంలో నాలుగో తరానికి చెందిన తారక రామారావును పరిచయం చేస్తున్నారు. 1980 నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. తెలుగుభాష, సంస్కృతి, తెలుగు జాతి నేపథ్యం వంటి అంశాలను ప్రతిబింబించేలా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు వైవిఎస్ చౌదరి ప్రకటించారు. ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి సంగీత సాహిత్యాలను అందిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగులు ఇస్తున్నారు. సీనియర్ నందమూరి తారక రామారావు నటించిన 'తోడు నీడ' సినిమా విడుదలై మే 12 నాటికి 60 ఏళ్ళ పూర్తయిన సందర్భంగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది.

విశాల్ ఆరోగ్యం బాగానే ఉంది



కోలీవుడ్ నటుడు విశాల్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తమిళనాడులోని విల్లుపురంలో ఆదివారం రాత్రి జరిగిన ఈవెంట్‌కు హాజరైన విశాల్ స్పృహతప్పి పడిపోయారు. ఆయన సిబ్బంది వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. మధ్యాహ్నం ఆహారం తీసుకోకపోవటంతోనే అస్వస్థతకు గురయ్యారనీ, వెంటనే ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు చేయించామని ఆయన ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం ఆయన పూర్తి ఆరోగ్యంగానే ఉన్నారన్నారు. అభిమానులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తమిళనాడు విల్లుపురంలో ఉండే కూవాగం గ్రామంలోని ఆలయంలో కొద్దిరోజులుగా చిత్తిరై (తమిళమాసం) వేడుకలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ జరిగిన మిస్ కువాగం ట్రాన్స్‌జెండర్ బ్యూటీ కాంటెస్ట్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న ఆయన కొద్ది సేపట్లోనే వేదికపై ఉన్నట్టుండి స్పృహ తప్పిపడిపోయారు.

కమలేష్ జగన్ పాత్రకు ఫిదా

కోలీవుడ్‌లో ప్రస్తుతం బాగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'టూరిస్ట్ ఫ్యామిలీ'. ఈనెల ఒకటోతేదీన విడుదలైన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద వసూళ్ల వర్షాన్ని కురిపిస్తోంది. కొత్త దర్శకుడు అభిషాన్ జీవింత్ దర్శకత్వంలో శశికుమార్, సిమ్రాన్ జంటగా నటించారు. బాలనటుడు కమలేష్ జగన్ నటన బాగుందని తమిళ ప్రేక్షకులు అభినందించారు. కథానాయకుడు శివకార్తికేయన్ ఈచిత్ర బృందాన్ని పిలిపించి అభినందించారు. ప్రత్యేకంగా కమలేష్‌ను మెచ్చుకున్నారు. తాజాగా రజనీకాంత్ కూడా ఈ చిత్రం సూపర్ అంటూ కితాబిచ్చారు. టూరిస్ట్ ఫ్యామిలీలో శశికుమార్, సిమ్రాన్‌ల కుమారుడిగా దళపతి విజయ్ అభిమానిగా నటించి మెప్పించారు. 'సరే గమప లిల్ చాంప్స్ సీజన్ 2'లో కమలేష్ మొదటిసారి తెరపై మెరిశాడు. ఆ రియాల్టీ షోకు అతిథులుగా త్రిష కృష్ణన్, నయనతార, అమలాపాల్ హాజరై ప్రశంసలు కురిపించారు. నటి జ్యోతిక తమిళ చిత్రం 'రాచ్చసి'లో కమలేష్‌కు అవకాశం ఇప్పించారు. ఆ తర్వాత 'కణ్మనీ రాంబో ఖతీజా' చిత్రంలో ఛాన్స్ లభించింది. విజయ్ దళపతి కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహించిన తొలి సినిమాలో కూడా కమలేష్ నటిస్తున్నాడు. ఆపై కాంచన 4లో కూడా ఛాన్స్ కొట్టేశాడు.

ఈ ఏడాది ఉత్తమ చిత్రాలివే...

ఈ ఏడాది ఇప్పటివరకూ జరిగిన కాలంలో కొన్ని హిట్ మూవీస్ ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. మొదటిగా అక్షయ్‌కుమార్ నటించిన బాలీవుడ్ మూవీ 'కేసరి 2' మొదటి స్థానంలో నిలిచింది. దేశభక్తి ప్రధానమైన ఈ కోర్టు రూమ్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా రూ.129.14 కోట్లు వసూలు చేసి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. టాలీవుడ్‌లో వచ్చిన 'కోర్టు : స్టేట్ వర్సెస్‌నె నోబడీ'. కథానాయకుడు నాని నిర్మాతగా ప్రియదర్శి ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ కోర్టు రూమ్ డ్రామా ఆడియెన్స్‌గా విపరీతంగా మెప్పించింది. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.58.15 కోట్లు కలెక్ట్ చేసి నిర్మాత, డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలను మిగిల్చింది. కోలీవుడ్‌లో వచ్చిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమా కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. కొత్త జీవితాన్ని ఏర్పాటుచేసుకోవటానికి ప్రయత్నించే వలస కుటుంబం కథగా ఈ సినిమా రూపొందింది. ఫన్నీ ఫ్యామిలీ డ్రామాగా శశికుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా రూ.25 కోట్లు వసూళు చేసి మంచి హిట్ మూవీగా నిలిచింది. మలయాళ ఇండస్ట్రీ నుంచి రీసెంట్‌గా వచ్చిన 'తుడరం' సినిమా కూడా ఎమోషనల్ రోలర్ కోస్టర్‌గా తెరకెక్కి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్‌ను తెచ్చుకుంది. మోహనల్‌లాల్ కథానాయకుడిగా వచ్చిన ఈ సినిమా రూ.175 కోట్లు వసూలుచేసి సూపర్ హిట్ మూవీగా నిలిచింది.

కన్నడలో 'అజ్ఞాతవాసి' సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ఎన్నో సీక్రెట్స్, ఎవరూ ఊహించని ట్విస్టులతో మంచి స్క్రీన్ ప్లేతో అలరిస్తోంది. ఈ సినిమాలన్నీ చిన్నబడ్జెట్‌తో నిర్మించినవే. కానీ భారీ విజయాలను అందుకున్నాయి.

టెస్ట్ క్రికెట్‌కు కోహ్లి గుడ్‌బై

- రిటైర్మెంట్ ప్రకటించిన రన్ మెషిన్
- ఇక వన్డేలకే పరిమితం

న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కోచ్ రాజ్‌కుమార్ శర్మ నుంచి జ్ఞాపికను అందుకుంటున్న విరాట్ కోహ్లి(ప్రక్కన తల్లి సరోజ్)

న్యూఢిల్లీ: టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లి క్రికెట్ అభిమానులకు చేదువార్తను వినిపించాడు. టెస్టు క్రికె1ట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు సోమవారం ట్విటర్ వేదికగా ప్రకటించాడు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో సోమవారం భావోద్వేగ భరిత పోస్ట్ పెట్టాడు. "14 ఏళ్ల క్రితం తొలిసారిగా టెస్టు క్రికెట్ జెర్సీ ధరించా... తెల్ల జెర్సీలో ఆడటం వ్యక్తిగతంగా నా మనసుకు చాలా ప్రత్యేకమైనది. నిశ్శబ్దమైన ఆనందం.. సుదీర్ఘమైన రోజులు.. ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ గుర్తుంటాయి. అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చా. నేను ఆశించిన దానికంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావంతో దీని నుంచి వైదొలుగుతున్నా..." అని కోహ్లి తన పోస్టులో రాసుకొచ్చాడు. గతేడాది టి20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం రోహిత్ శర్మ, కోహ్లి, జడేజా ఆ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పారు. రోహిత్ ఇటీవల టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించగా.. తాజాగా కోహ్లి కూడా అతనిని అనుసరించాడు. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు బిసిసిఐ సమాచారమిచ్చాడు. 2011లో టెస్టు క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కోహ్లి.. ఇప్పటివరకు 123 టెస్టుల్లో 46.85సగటుతో 9,230 పరుగులు చేశాడు. ఇందులో 30 శతకాలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. టెస్టుల్లో 46.85 సగటు సాధించిన నాల్గో బ్యాటర్ కోహ్లి కాగా.. భారత్ తరఫున అతనిదే తొలిస్థానం. ఈ ఫార్మాట్‌లో వ్యక్తిగత అత్యధిక స్కోరు 254 పరుగులు. ఈ ఏడాది (2025) జనవరి 3న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడాడు. టెస్టుల్లో ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి.. పదివేల పరుగుల మైలురాయికి 770 పరుగుల దూరంలో గుడ్ బై చెబుతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు.

టెస్ట్ కెరీర్ ఇలా...

టెస్ట్ క్రికెట్‌లో భారతజట్టు విజయవంతమైన కెప్టెన్‌గా విరాట్ కోహ్లి చరిత్రలో నిలిచాడు. ఈ ఫార్మాట్‌లో కేవలం 18నెలలు (34టెస్టుల్లో) ఆరు డబుల్ సెంచరీలో కొట్టిన ఏకైక బ్యాటర్ కోహ్లి మాత్రమే. కోహ్లి కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్ 2014–15లో నడించింది. ఆ ఏడాది 86.85సగటుతో 692పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీఢ ఉన్నాయి. ఇక 2019–20లో బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌లోనూ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. ఆ ఏడాది ముగిసేసరికి 63.65 సగటుతో 5,347 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే సెంచరీల సంఖ్యను కూడా 21 నుంచి 30 సెంచరీలకు పెంచుకున్నాడు. ఇది కేవలం 90 ఇన్నింగ్స్‌లో మాత్రమే సాధ్యపడింది. 2020 తర్వాత 39టెస్టుల్లో ఆడి 30.72సగటుతో కేవలం 2000 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. కోహ్లి కెరీర్‌లో అతి తక్కువ సగటు నమోదు చేసింది ఈ కాలంలోనే. ఆ తర్వాత 10 టెస్టుల్లో 22.87 సగటుతో 382పరుగులు మాత్రమే చేశాడు. ఇక గత ఏడాది పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్‌లో సెంచరీతో తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు.

టెస్ట్ క్రికెట్ కెరీర్ ఇలా...

కెరీర్	టెస్టులు	ఇన్నింగ్స్	పరుగులు	సగటు	100/50
అరంగేట్రం నుంచి 2014వరకు	29	51	1,855	39.46	6/9
అక్టోబర్ 2014 నుంచి డిసెంబర్ 2019	55	90	5,347	63.65	21/13
2020 నుంచి ఇప్పటివరకు	39	69	2,028	30.72	3/9

సువర్ణాధ్యాయం...

2014 నుంచి 2016వరకు 18నెలలు విరాట్ కోహ్లి కెరీర్ సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. 2016 జులైలో వెస్టిండీస్‌లోని నార్త్ సౌండ్‌లో తొలి డబుల్ సెంచరీ కొట్టిన కోహ్లి.. ఆ తర్వాత ఏడాది 2017లో మరో ఐదు సెంచరీలతో రాణించాడు. ఆ తర్వాత అతని టెస్ట్ కెరీర్ సువర్ణాక్షరాలతో లిఖించేదిగా చెప్పుకోవచ్చు. 2019 ముగిసే నాటికి 63.65 సగటుతో 21 సెంచరీలతో సహా 5,347 పరుగులు కొట్టాడు. ఇందులో కెరీర్ బెస్ట్ 254పరుగులు కూడా ఉంది. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా లెజెండ్ డాన్ బ్రాడ్‌మన్ 34 ఇన్నింగ్స్‌లో 8 డబుల్ సెంచరీలు మార్క్‌కు చేరువయ్యాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో బ్రాడ్‌మన్(8డబుల్ సెంచరీలు) తర్వాత కోహ్లి(6డబుల్ సెంచరీలు) కొట్టిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఆ తర్వాత రాహుల్ ద్రావిడ్(4), రికీ పాంటింగ్(4), మైఖేల్ క్లార్క్(4), కేన్ విలియమ్సన్ 4 డబుల్ సెంచరీలు ఉన్నారు. రెండు క్యాలెండర్ ఇయర్‌లో 75.00 సగటుతో 1000 పరుగులు కొట్టి తొలి బ్యాటర్. టెస్టుల్లో ఏడు డబుల్ సెంచరీలు కొట్టిన ఏకైక భారత బ్యాటర్.

17నుంచి ఐపిఎల్ తిరిగి ప్రారంభం

బెంగళూరు–కోల్‌కతా జట్ల మధ్య మ్యాచ్‌తో షురూ

ముంబయి: ఈనెల 17నుంచి ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) తిరిగి ప్రారంభం కానున్నట్లు ఐపిఎల్ గవర్నింగ్ బాడీ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)– కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య ఎం. చిదంబరం స్టేడియంలో జరిగే మ్యాచ్‌తో పునఃప్రారంభం కానున్నట్లు ఆ ప్రకటనలో ప్రకటించింది. గత శుక్రవారం భారత్–పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపిఎల్ అర్థాంతరంగా ఆగిపోయిన సంగతి తెలిసిందే. ఇఈ సీజన్ ఐపిఎల్‌లో మరో 16మ్యాచ్‌లు మాత్రమే జరగాల్సి ఉంది. ఇందులో ప్లే–ఆఫ్స్‌తోపాటు ఫైనల్ మ్యాచ్ కూడా ఉంది. సీజన్–18 ఐపిఎల్‌లో ఇప్పటివరకు మ్యాచ్‌లు ముగిసేసరికి గుజరాత్ టైటాన్స్ 16పాయింట్లతో అగ్రస్థానంలో ఉండి ప్లే–ఆఫ్స్‌కు చేరువైంది.

ప్రభుత్వ అనుమతితోనే...

ఐపిఎల్‌ను తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అన్నాడు. "వచ్చే కొన్ని రోజుల్లో ఫ్రాంఛైజీలు, ప్రసారదారు, స్పాన్సర్లు, మిగతా మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సిన రాష్ట్ర సంఘాలతో సంప్రదింపులు మొదలుపెడతాం. ఆ తర్వాత ఐపిఎల్ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటాం. అయితే లీగ్ తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి" అని చెప్పాడు. ఆ జట్లకు చెరో పాయింట్: భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ రద్దయిన సంగతి తెలిసిందే. మ్యాచ్ ఆగిపోయే సమయానికి పంజాబ్ 10.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది. ఆ మ్యాచ్‌ను కొనసాగించడం, లేదా మొదటి నుంచి నిర్వహించడం ఉండకపోవచ్చు. రెండు జట్లకు చెరో పాయింట్ ఇచ్చే అవకాశం ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68